బుధవారం
16-4-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 204
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

'బోయింగ్' డెలివరీలు ఆపేసిన చైనా

బీజింగ్: అమెరికాతో సుంకాల యుద్ధం క్రమంలో బోయింగ్ జెట్ డెలివరీలను చైనా నిలిపివేసింది. బోయింగ్ జెట్ల తదుపరి డెలివరీలు తీసుకోవద్దని తమ దేశానికి చెందిన విమానయాన సంస్థలకు స్పష్టమైన ఆదేశాలిచ్చింది. చైనా ఉత్పత్తులపై 145 శాతం సుంకాలను అమెరికా విధించడంతో బీజింగ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. అమెరికా కంపెనీల నుంచి విమానాలకు సంబంధించిన పరికరాలు, విడిభాగాల కొనుగోళ్లను కూడా నిలిపివేయాలని ఆదేశాలు జారీ అయ్యాయన్నాయి. బోయింగ్ జెట్లు లీజుకు తీసుకున్న ఎయిర్‌లైన్స్ ఏ విధంగా సహకారాన్ని అందించాలనే దిశగా చైనా ప్రభుత్వం యోచిస్తున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

వివాహితుల లైంగిక బంధం నేరం కాదు

కోల్‌కతా: ఇద్దరు వివాహితులు పరస్పర అంగీకారంతో శారీరక సంబంధం పెట్టుకోవడం నేరం కాదని కలకత్తా హైకోర్టు తీర్పు చెప్పింది. ఇద్దరికి వైవాహిక స్థితి గురించి తెలిశాక... సమ్మతితో లైంగిక సంబంధం పెట్టుకోవడం నేరం కాదని పేర్కొంది. దీనిని ఏకాభిప్రాయంగా పరిగణించాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. ఇద్దరు వివాహితులు రెండేళ్ల నుంచి శారీరక సంబంధం కలిగి ఉన్నారు. విషయం తెలుసుకున్న మహిళ భర్త... ఆమెతో జీవించడానికి నిరాకరించాడు. దీంతో తనతో సంబంధం ఉన్న వ్యక్తిని పెళ్లి చేసుకోవాలని ఆమె కోరింది. అందుకు అతడు

- మిగతా 2 లో

ఈడీ విచారణకు రాబర్ట్ వాద్రా

న్యూఢిల్లీ: హర్యానాలోని శికోపూర్ గ్రామంలో జరిగిన భూమి కొనుగోళ్లకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో వ్యాపారవేత్త, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బావమరిది రాబర్ట్ వాద్రా వాంగ్మూలాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మంగళవారం నమోదు చేసిందని అధికారిక వర్గాలు తెలిపాయి. 56 ఏళ్ల వాద్రా సెంట్రల్ ఢిల్లీలోని సుజన్ సింగ్ పార్క్‌లో గల తన నివాసం నుండి రెండు కిలోమీటర్ల దూరంలో ఏపీజే అబ్దుల్ కలాం రోడ్‌లో ఉన్న ఈడీ ప్రధాన కార్యాలయానికి నడిచి వెళ్లారు. ఆయన భద్రతా బృందం

- మిగతా 2 లో

బెంగాల్‌లో హింసపై సుప్రీం విచారణ?

న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్‌లో జరిగిన నిరసనల్లో చెలరేగిన హింసాత్మక ఘటనల వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరింది. ఈ హింసపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు కోరుతూ దాఖలైన రెండు పిటిషన్ల పరిశీలనకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ముర్షిదాబాద్ సహా వివిధ జిల్లాల్లో జరిగిన హింసాత్మక ఘటనలపై సిట్ తో దర్యాప్తు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో న్యాయవాది శశాంక్ శేఖర్ ఝా పిటిషన్ దాఖలు చేశారు. రాష్ట్రంలో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మహిళా సాధికారతే

ప్రభుత్వ లక్ష్యం

- గ్రీన్ పవర్ ఉత్పత్తిలో మహిళలకు భాగస్వామ్యం
- లక్ష్యానికి మించి వడ్డీలేని రుణాల పంపిణీ
- స్త్రీ సమ్మిట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

విశాలాంధ్ర–హైదరాబాద్: దేశంలో అన్ని రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరిగేందుకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ పునాదులు వేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం హైదరాబాద్ తాజ్ డెక్కన్ లో జరిగిన 'స్త్రీ సమ్మిట్' ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మనదేశంలో బాల్యవివాహాలు, వరకట్నం నిషేధం, మహిళలకు ఓటు హక్కు, విడాకులు, మహిళలకు ఆస్తిలో వాటా వంటి చట్టాలు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ హిందూ కోడ్ బిల్ ద్వారానే ఆచరణలోకి వచ్చాయని వివరించారు. స్థానిక సంస్థల్లో 33% మహిళలకు రిజర్వేషన్‌ను మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. ఈ చర్యల మూలంగా మహిళలు రాజకీయాలు, పరిపాలన రంగంలోకి ప్రవేశించారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి సంవత్సరం లక్ష్యానికి మించి రూ.21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు స్వయం సహాయక సంఘాల మహిళలకు అందజేశామని తెలిపారు. రాబోయే నాలుగు సంవత్సరాలు కూడా ఇదే మాదిరిగా వడ్డీ లేని రుణాల పంపిణీ ఉంటుందన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన గ్రీన్ పవర్ పాలసీలో వారికి భాగస్వామ్యం కల్పించినట్టు తెలిపారు. విద్యుత్ శాఖ, ప్రభుత్వంలోని ఇతర శాఖలు కలిసి స్వయం సహాయక సంఘాల మహిళలతో వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. బ్యాంకు లింకేజీ ద్వారా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయించి, ఖాళీ స్థలాలు ప్రభుత్వమే లీజుకు ఇచ్చి, మహిళా సంఘాలు ఉత్పత్తి చేసిన విద్యుత్తును ప్రభుత్వమే కొనుగోలు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నామని

- మిగతా 2 లో

ప్రజల్లోకి సంక్షేమ పథకాలు

పార్టీ గీత దాటితే సహించం

- మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయం శిరోధార్యం
- హెచ్‌సీయూ భూములపై బీజేపీ, బీఆర్ఎస్ విష ప్రచారం
- తెలంగాణ మోడల్ చూసి మోదీకి వణుకు
- సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర–హైదరాబాద్: కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు పిలుపు నిచ్చారు. శంషాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సీఎల్పీ సమావేశంలో సీఎం పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలనుద్దేశించి మాట్లాడారు. పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారని స్పష్టం చేశారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందని తెలిపారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠాన నిర్ణయమే ఫైనల్ అన్నారు. విస్తరణపై ఎవరేం మాట్లాడినా ఉపయోగంలేదన్నారు. జనంలోకి వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించి ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచాలన్నారు. ఈ సమావేశానికి పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు.

సన్నబియ్యం పథకం అద్భుతం

ప్రజాప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. సన్నబియ్యం పథకం ఒక అద్భుతమని ఆనాడు రూ.2 కిలో బియ్యంలా ఇప్పుడు సన్నబియ్యం పథకం శాశ్వతంగా గుర్తుండే పథకమని సీఎం వివరించారు. భూ భారతిని రైతులకు చేరవేయాలన్నారు. దేశంలోనే ఇందిరమ్మ ఇండ్ల పథకం ఆదర్శంగా నిలిచిందని క్షేత్ర స్థాయిలో నిజమైన లబ్ధిదారులకే అందాలని దీన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

కులగణనతో వందేళ్ల సమస్యకు పరిష్కారం

వారికి శాశ్వత పరిష్కారం చూపాం : కులగణన ద్వారా వందేళ్ల సమస్యను శాశ్వతంగా పకడ్బందీగా పరిష్కరించామన్న సీఎం విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిల్లులు తీసుకొచ్చామని ఇది ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమని వెల్లడించారు. జటిలమైన ఎస్సీ ఉపకులాల వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని అందుకే వర్గీకరణ జరిగే వరకు ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదని తెలిపారు.

ఎంత మంచి చేసినా... ప్రజల్లోకి తీసుకెళ్లగలగాలి

హెచ్‌సీయూ భూములపై ప్రతిపక్షం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో ఒక అబద్ధపు ప్రచారం చేసిందని, ఈ ప్రచారాన్ని ప్రధాని మోదీ కూడా నమ్మి బుల్డోజర్లు పంపిస్తున్నారని మాట్లాడుతున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. పార్టీ, ప్రభుత్వం ప్రతిష్ఠ పెరిగితేనే భవిష్యత్ ఉంటుందని మనం ఎంత మంచి చేసినా ప్రజల్లోకి తీసుకెళ్లకపోతే ప్రయోజనం ఉండదన్నారు. మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలని పార్టీశ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వివరించారు.

దేశంలో తెలంగాణ మోడల్‌పై చర్చ జరుగుతోందని రేవంత్ తెలిపారు. అందుకే తెలంగాణలో కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టాలనే బీజేపీ, బీఆర్ఎస్

- మిగతా 2 లో

జపాన్ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర–హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రానికి పెట్టబడులను ఆకర్షించే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి జపాన్ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఈ నెల 16 నుంచి 22 వరకు ఆయన అక్కడే ఉండనున్నారు. ఈ పర్యటనలో సీఎం తో పాటు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఇతర అధికారులు ఉన్నారు. తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో సీఎం జపాన్ పర్యటన కొనసాగనుంది. అలాగే ఒసాకాలో జరిగే ఇండస్ట్రియల్ ఎక్స్‌పో లో సీఎం రేవంత్ పాల్గొంటారు. అనంతరం టోక్యోలో పెట్టుబడులపై పారిశ్రామికవేత్తలతో సమావేశమవు తారు. జపాన్ లోని కొత్త సాంకేతిక పరిజ్ఞానం, ఏఐ ఆధారిత అభివృద్ధిపై సీఎం బృందం అధ్యయనం చేయనుంది. తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీ కోసం జపాన్ సాంకేతికతను అధ్యయనం చేయ డంతో పాటు, అభివృద్ధిలో భాగస్వామ్యం కావాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డి అక్కడి వ్యాపారవేత్తలను, వివిధ సంస్థలను ఆహ్వానించనున్నట్లు తెలిసింది.

గ్లోబల్ బిజినెస్ హబ్‌గా హైదరాబాద్

మంత్రి శ్రీధర్ బాబు

విశాలాంధ్ర–హైదరాబాద్: గ్లోబల్ బిజినెస్ హబ్‌గా హైదరాబాద్ మారిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఇక్కడ కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ బాగా పెరిగిందని చెప్పారు. మంగళవారం నానక్ రాంగూడలో యూఎస్‌కు చెందిన సిటిజెన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేసిన "సిటిజెన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్" ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... హైదరాబాద్ లో 2030 నాటికి 200 మిలియన్ చదరపు అడుగుల "గ్రేడ్ ఏ" కమర్షియల్ స్పేస్‌ను అందు బాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ "గ్లోబల్ బిజినెస్ హబ్" గా మారిందని, అందుకు అనుగుణంగానే కమర్షియల్ స్పేస్ కు డిమాండ్ పెరిగిందన్నారు. ఢిల్లీ, చెన్నై లాంటి మెట్రో నగరాల్లో కమర్షియల్

- మిగతా 2 లో

నేషనల్ హెరాల్డ్ కేసు

సోనియా, రాహుల్‌పై ఛార్జిషీటు

న్యూఢిల్లీ: 'నేషనల్ హెరాల్డ్' మనీలాండరింగ్ కేసులో ఈడీ ఛార్జిషీటు దాఖలు చేసింది. ఛార్జిషీటులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను పేర్కొంది. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించిన ఆస్తుల స్వాధీనానికి ఈడీ నోటీసులు జారీ చేసింది. తాజాగా కాంగ్రెస్ ఎంపీలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు ఆ పార్టీ ఓవర్సీస్ విభాగం అధ్యక్షుడు శ్యామ్ పిట్రోడా పేర్లను ప్రస్తావిస్తూ ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో మంగళవారం ఛార్జిషీటు దాఖలు చేసింది. దీనిపై ఏప్రిల్ 25న ఢిల్లీ ప్రత్యేక కోర్టు విచారణ చేపట్టనున్నది. సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ ఛార్జిషీటు దాఖలు చేయడం ఇదే తొలిసారి. హర్యానాలో జరిగిన రియల్ ఎస్టేట్ ఒప్పందంతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ ఆరోపణలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త,

- మిగతా 2 లో

నితీశ్‌కు రాజకీయ సెగ!

ఈసారీ సీఎం పీఠంపై ఆశలు

- కాబోయే సీఎం మావాళ్లేనంటున్న కమలనాథులు
- నితీశేనంటూ జేడీ(యూ) స్పష్టీకరణ
- ఐక్యంగా ముందుకు సాగుతున్న 'ఇండియా'

పాట్నా: బీహార్ రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ఈ ఏడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం అన్ని పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. ఇండియా ఐక్య సంఘటన–ఎన్డీఏ కూటమి మధ్య గట్టి పోటీ ఉండనున్నట్లు స్పష్టమవుతోంది. ఈ పరిణామాల నడుమ జనతాదళ్ (యునైటెడ్) అధినేత, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు రాజకీయ సెగ ప్రారంభమయింది. కమలనాథుల నుంచి భిన్నమైన సంకేతాలు వెలువడుతున్నాయి. ఇది నితీశ్‌కు మింగుడు పడటంలేదు. ఇప్పటికే రెండు దశాబ్దాలుగా నితీశ్ కుమార్ ప్రభుత్వం నడుస్తోంది. మరోసారి అధికారం కోసం బీజేపీ నేతృత్వంలో వ్యూహాలు రచిస్తోంది. అయితే ఈసారి నితీశ్ కుమార్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా పక్కన పెట్టాలని బీజేపీ భావిస్తోంది. ఎలాగైనా ముఖ్యమంత్రి పీఠం దక్కించుకోవాలని కమలనాథులు వ్యూహాలు రచిస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ప్రణాళిక రచిస్తున్నట్లు సమాచారం. ఇదిలాఉండగా తాజాగా హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ సంచలన వ్యాఖ్యలు చేశారు. సామ్రాట్ చౌదరి... కాబోయే ముఖ్యమంత్రి అంటూ ప్రకటించారు. ఈ

- మిగతా 2 లో

వర్షాలు పుష్కలం

ఈ ఏడాది 'ఎల్ నినో' అడ్డంకి లేదు
ఐఎండీ చల్లటి కబురు

న్యూఢిల్లీ: ఈ ఏడాది వర్షాకాలంలో పుష్కలంగా వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. సాధారణం కంటే ఎక్కువే వర్షపాతం నమోదవుతుందని అంచనా వేసింది. ఈసారి వర్షాకాలం సీజన్‌లో 'ఎల్ నినో' తరహా వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశమే లేదని స్పష్టం చేసింది. మంగళవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో సంబంధిత వివరాలను ఐఎండీ అధిపతి మృత్యుంజయ్ మోహపాత్ర వెల్లడించారు. జూన్ నుంచి సెప్టెంబరు వరకు నాలుగు నెలల పాటు (వర్షాకాలం) సాధారణం కంటే ఎక్కువే వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీర్ఘకాలిక వర్షపాత సగటు 87 సెంటీమీటర్లు. ఇందులో దాదాపు 105 శాతం మేర సగటు వర్షపాతం ఈ వర్ష రుతువులో నమోదుకావచ్చని ఆయన తెలిపారు. 'ఎల్ నినో తరహా వాతావరణ

- మిగతా 2 లో

18న విచారణకు రండి

'మద్యం' కేసులో విజయసాయికి సిట్ నోటీసు



విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు నోటీసు జారీ చేశారు. ఈనెల 18వ తేదీన విజయవాడ సీపీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని పేర్కొన్నారు. గతంలో లిక్కర్ కుంభకోణం కేసుపై విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సాక్షిగా వాంగ్మూలం ఇచ్చేందుకు రావాలంటూ సిట్ అధికారులు నోటీసుల్లో తెలిపారు. సీఆర్పీసీ సెక్షన్ 160 కింద సాయిరెడ్డికి నోటీసులు జారీ చేసినట్లు సిట్ బృందం తెలిపింది. మద్యం కుంభకోణంలో కీలక పాత్ర పోషించిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బంధువు, వైసీపీ ప్రభుత్వ ఐటీ సలహాదారు రాజ్ కసిరెడ్డి కోసం పోలీసులు, సిట్ అధికారులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. విచారణకు హాజకావాలని హైకోర్టు చెప్పిన ప్పటికీ... లెక్కచేయకుండా కసిరెడ్డి తప్పించుకుని

- మిగతా 2 లో

ఎస్సీ వర్గీకరణకు ఆర్డినెన్స్

- 200 పాయింట్ల రోస్టర్ అమలుకు నిర్ణయం
- రూ.1,403 కోట్లతో హైకోర్టు, అసెంబ్లీ భవనాలు
- త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్ జారీ
- 26న మత్స్యకార భరోసా కింద రూ.20 వేల పంపిణీ
- ఏపీ రాష్ట్రమంత్రివర్గం కీలక నిర్ణయాలు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్‌కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశం మొత్తం 24 అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంది. వీటిలో ప్రధానంగా ఎస్సీ వర్గీకరణ అమలు పై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. ఎస్సీ ఉపవర్గీకరణలో 200 పాయింట్ల రోస్టర్ అమలు చేయాలని నిర్ణయించింది. విద్య,

- మిగతా 2 లో

తెలంగాణలో తొలి రాజకీయ పాఠశాల

కోస్తా ఆంధ్ర ప్రాంతంలోని కొన్ని చోట్ల 1930 లో రాజకీయ పాఠశాలలు జరిగినట్టే తెలంగాణలో కూడా 1939 మే 23 నుంచి జూన్ 13 వరకు 22 రోజుల పాటు తునికిపాడులో కూడా రాజకీయ పాఠశాల జరిగింది. దీనికి 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. రైతు సంఘం పేరుతో కృష్ణాజిల్లా పార్టీ విభాగం ఈ తరగతులను నిర్వహించింది.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

దేశ సంపద సృష్టికర్తలదే

ప్రతి పైసా శ్రమజీవులకు తిరిగిచ్చేయాల్సిందే

35 మంది టర్కీ కేపిటలిస్టులకు కమ్యూనిస్టు పార్టీ లేఖ

ఇస్తాంబుల్: దేశ సంపద దానిని సృష్టించిన కార్మిక/శ్రామిక వర్గానిదని, ప్రతి రూపాయిపై వారికి హక్కు ఉందని టర్కీ కమ్యూనిస్టు పార్టీ (టీకేపీ) ఉద్ఘాటించింది. మీరు తీసుకున్న ప్రతి రూపాయి దానిని సృష్టించిన శ్రామిక వర్గానికి తిరిగి చెల్లించేయాల్సిందేనని పేర్కొంటూ ప్రపంచ కుబేరుల జాబితాలోని టర్కీకి చెందిన 35 మంది పెట్టుబడిదారులకు టర్కీ కమ్యూనిస్టు పార్టీ ఓ లేఖ పంపింది. 'అంతర్జాతీయ ఆర్థిక మ్యాగజైన్ ప్రచురించిన కుబేరుల్లో మీ పేర్లు ఉన్నాయి. 'బిలియనీర్ టర్క్స్' పేరిట ఈ కథనంలో 35 మంది బిలియనీర్ టర్కుల ఆస్తి మొత్తం 79.5 బిలియన్ డాలర్లు అని ఉంది. ఈ కుబేరుల్లో కొందరు ఒకే కుటుంబానికి చెందిన వారు. 86 మిలియన్ల మంది జనాభాగల దేశంలో కేవలం 14 సంపన్న కుటుంబాలకు చెందిన 30 మంది ప్రపంచ కుబేరులుగా నిలిచారు. ఈ లేఖ మిమ్మల్ని అభినందించడానికో లేక ఏదైన డిమాండ్ చేయడానికి కాదు... కేవలం వాస్తవాలను నిర్ధారించడం కోసం... వాటిని ప్రజల ముందుకు తీసుకురావడం కోసం రాశాం' టర్కీ కమ్యూనిస్టు పార్టీ పేర్కొంది. 2024లో టర్కీ స్థూల జాతీయ ఆదాయం దాదాపు 1.322 ట్రిలియన్ డాలర్లకు చేరుకోగా పర్ క్యాపిటా ఆదాయం 15వేల డాలర్లుగా ఉందని, ప్రపంచ బ్యాంకు ప్రమాణాల ప్రకారం అత్యధిక ఆదాయంగల దేశంగా టర్కీ ఉందని కమ్యూనిస్టు పార్టీ వెల్లడించింది. అత్యధిక ఆదాయంలో శ్రామిక వర్గానికి దక్కేది గరంత కూడా లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొంది. పేదరికంలో మగ్గుతూ చాలా కుటుంబాలు దుర్భర జీవితాలు గడుపుతున్నట్లు ఆవేదన వ్యక్తంచేసింది. సంపన్నులకు కొమ్ము కాస్తూ శ్రామిక/పేద వర్గాన్ని పణంగా పెట్టేసిన ఏకేపీ ప్రభుత్వ విధానాలను ఆక్షేపిస్తున్నట్లు కమ్యూనిస్టు పార్టీ పేర్కొంది. 'పేదలు మరింత పేదరికంలోకి నెట్టబడుతుంటే కొద్దిపాటి మంది సంపన్నుల వద్దనే సంపద ఉన్నది. దారిద్ర్య రేఖ పరిధిని ఖరారు చేసిన మూడు నెలల్లోనే కనీస వేతనం దాని దిగువునకు పడిపోయింది. పదవీ విరమణ పొందిన వారికి పింఛన్లు లభించడంలేదు. ఏటేటా వేలాది మంది కార్మికులు పనిప్రదేశాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. టర్కీ ఆర్థిక వ్యవస్థ పెరుగుతుండటం వాస్తవమే అయినప్పటికీ దాని ఫలాలు మాత్రం కొద్ది మంది సంపన్నులకు చేరుతున్నాయి తప్ప పేదలకు, కార్మిక/శ్రామిక వర్గానికి ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు. లాభాలు గడిస్తూ మీ కంపెనీలు విస్తరిస్తున్నాయి. ప్రభుత్వం కొమ్ముకాస్తుండటంతో కార్యక్రమాలన్నీ నిరాటకంకంగా సాగిపోతున్నాయి. పన్ను మినహాయింపులు లభిస్తున్నాయి. దీంతో అసమానతలు పెరిగిపోతున్నాయి. అన్యాయం తీవ్రమవుతోంది. ప్రజలను దోపిడీ చేసే వ్యవస్థను మీరు ఏర్పాటు చేశారు. మీలాంటి కొద్ది మంది చేతుల్లోకి దేశ వనరులు వెళ్లిపోయాయి. వాటి ఫలాలను మీరు ఆశ్వాదిస్తున్నారు. టర్కీ శ్రామిక వర్గం చెమటోడ్చి సృష్టించే సంపద కొద్ది మంది జేబుల్లోకి వెళ్లిపోతోంది. ప్రజలను దోచుకోవడానికి మించిన నేరం మరొకటి లేదు. మీరంతా ఈ నేరం చేసిన నేరస్తులు. శ్రామిక వర్గం తాను సృష్టించిన సంపదను తిరిగి స్వాధీనం చేసుకుంటుంది. మీరు తీసుకున్న ప్రతి రూపాయి దానిని సృష్టించిన ప్రజలకు తిరిగి ఇచ్చేయాల్సి ఉంటుంది. ఈ దోపిడీ వ్యవస్థ అంతమైన రోజు దేశ సంపద దానిని సృష్టించిన వారికి సమానంగా చెందుతుంది. అది జరిగినప్పుడే టర్కీలో న్యాయం జరుగుతుంది. సమానత్వం వర్ధిల్లుతుంది' అని లేఖలో టర్కీ కమ్యూనిస్టు పార్టీ పేర్కొంది.

మాపై అమెరికా అత్యాధునిక సైబర్ దాడులు

ఎన్ఎస్ఏ ఏజెంట్లకు పాత్ర: చైనా

బీజింగ్: ఫిబ్రవరిలో ఏషియన్ వింటర్ గేమ్స్ జరిగినప్పుడు తమ కీలక పరిశ్రమలపై అమెరికా జాతీయ భద్రతా సంస్థ (యూఎస్ ఎన్ఎస్ఏ) అత్యాధునిక సైబర్ దాడులకు పాల్పడినట్లు చైనా ఆరోపించింది. ఈ మేరకు ముగ్గురు ఎన్ఎస్ఏ ఏజెంట్ల పేర్లను వాంటెడ్ జాబితాలో ఈశాన్య హార్బిన్ నగరానికి చెందిన పోలీసులు చేర్చారు. సైబర్ దాడులతో కాలిఫోర్నియా యూనివర్సిటీకి, వర్జీనియా టెక్‌కు సంబంధాలు ఉన్నట్లు తమ దర్యాప్తులో తేలినట్లు నివేదిక పేర్కొన్నదని 'జిన్హువా' మంగళవారం నివేదించింది. ముగ్గురు ఎన్ఎస్ఏ ఏజెంట్లను క్యాథరిన్ ఎ.విల్సన్, రాబర్ట్ జె.షెల్లింగ్, స్టీఫెన్ డబ్ల్యు.జాన్సన్‌గా గుర్తించినట్లు వెల్లడించింది. చైనా మౌలిక వసతుల కీలక సమాచారాన్ని రాబట్టడంలో ఈ ముగ్గురికి భాగస్వామ్యం ఉందని... హువేయి, ఇతర సంస్థలపై సైబర్ దాడుల్లోనూ వీరికి పాత్ర ఉందని తెలిపింది. అమెరికాకు చెందిన రెండు విశ్వవిద్యాలయాల పాత్ర గురించి వెల్లడించలేదు. కాగా, చైనా, అమెరికా మధ్య వాణిజ్య యుద్ధం నెలకొన్న సమయంలో తమ దేశంపై సైబర్ దాడులు జరిగినట్లు చైనా ఆరోపించడానికి ప్రాధాన్యత ఏర్పడింది. విద్యుత్, రవాణా, కమ్యూనికేషన్స్, నీటి ఆదా సహా హెలంగ్జియాంగ్ ప్రావిన్స్‌లోని జాతీయ రక్షణ పరిశోధన సంస్థలపై సైబర్ దాడులు జరిగినట్లు హార్బిన్ పబ్లిక్ సెక్యూరిటీ బ్యూరో నివేదించినట్లు జిన్హువా వెల్లడించింది. చైనా మౌలికవసతుల రంగ కీలక సమాచారానికి రాబట్టి... అస్థిర పరిస్థితులు సృష్టించడం, విశ్వసనీయ సమాచారాన్ని దోచుకోవడం కోసమే సైబర్ దాడులు జరిగినట్లు ఆరోపించింది. హెలాంగ్జియాంగ్‌లోని కొన్ని ప్రత్యేకించిన పరికరాల్లోని మైక్రోసాఫ్ట్ విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్స్‌లోకి ముందుగానే బగ్ పెట్టి ఈ దాడులకు ఎన్ఎస్ఏ పాల్పడినట్లు జిన్హువా పేర్కొంది. ఇందుకోసం యూరప్, ఏషియా సహా వివిధ దేశాల్లోని పెద్ద నెట్‌వర్క్‌ల నుంచి సర్వర్లను ఎన్ఎస్ఏ గోప్యంగా అద్దెకు తీసుకున్నదని, ఐపీ అడ్రస్‌లు కొనేసిందని ఆరోపించింది. క్రీడాకారుల వ్యక్తిగత సమాచారాన్ని దొంగలించే ఉద్దేశంతోనే సైబర్ దాడి జరిగిందని పేర్కొంది. తమ కీలక సమాచారాన్ని దొచుకునేందుకు చైనా హ్యాకర్లు తరచూ తమపై దాడులు చేస్తుంటారని అమెరికా చాలాసార్లు ఆరోపించింది. రక్షణ ఇంటెలిజెన్స్ వ్యవస్థ లక్ష్యంగా సైబర్ దాడి జరిగినట్లు గతనెలలోనూ ఆరోపించింది. అయితే అమెరికా ఆరోపణలను బీజింగ్ ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతూ... అవన్నీ అవాస్తవాలను వివరణ ఇస్తూవుంటుంది.

వర్షాలు పుష్కలం

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితులు ఏర్పడితే వర్షాకాలంలో సాధారణం కంటే తక్కువ స్థాయిలో వర్షాలు పడతాయి. ఈసారి భారత్‌లో ఆ తరహా ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు కనిపించడం లేదు' అని మోహపాత్ర చెప్పారు. కాగా, ఇప్పటికే దేశంలోని చాలా ఉత్తరాది రాష్ట్రాల్లో వడగాలులు దడ పుట్టిస్తున్నాయి. ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఏప్రిల్) నుంచి జూన్ వరకు వడగాలుల తీవ్రత క్రమంగా పెరిగే అవకాశం ఉందని ఐఎండీ నిపుణులు అంటున్నారు. దీనివల్ల ప్రభావిత ప్రాంతాల్లోని విద్యుత్ గ్రిడ్‌ల పనితీరుకు ఆటంకం కలగొచ్చునని, నీటి కొరత సమస్య ఏర్పడొచ్చునని చెబుతున్నారు.

రైతాంగానికి శుభవార్త

భారత వ్యవసాయ రంగానికి వర్షపాతమే ప్రధాన ఆధారం. నేటికీ దేశంలోని దాదాపు 42.3 శాతం మంది జనాభాకు ప్రధాన జీవనాధారం వ్యవసాయ రంగమే. మనదేశ స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ)లో 18.2 శాతం వాటా వ్యవసాయ రంగం నుంచే సమకూరుతోంది. దేశంలోని పంట సాగు భూముల్లో దాదాపు 52 శాతం వర్షాధార ప్రాంతాల్లోనే ఉన్నాయి. వర్షాలు కురిస్తే రిజర్వాయర్లు నిండుతాయి. వాటి నుంచే ప్రజలకు తాగునీటిని సరఫరా చేయడంతో పాటు విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లకు నీటిని వదులుతారు. అందుకే సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం కురుస్తుంది అనేది రైతన్నలకు, దేశ ఆర్థిక వ్యవస్థకు పెద్ద శుభవార్త. అయితే దేశంలో ఏటా వర్షాకాలం(నాలుగు నెలల కాలం)లో వర్షాలు కురిసే రోజులు క్రమంగా తగ్గుతున్నాయి. ఇక ఇదే సమయంలో అతి తక్కువ రోజుల్లో అతిభారీ వర్షాలు కురిసే ఘటనలు పెరుగుతున్నాయి. దీనివల్ల వరదలొచ్చి తీవ్ర నష్టం జరుగుతోంది. వాతావరణ మార్పుల వల్లే ఇటువంటి పరిస్థితులు నెలకొంటున్నాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

సోనియా, రాహుల్‌పై ఛార్జిషీటు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాను ఈడీ ప్రశ్నించిన కొన్ని గంటల వ్యవధిలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఈడీ అధికారులు గతంలో పలుమార్లు విచారించిన విషయం తెలిసిందే. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచిపోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచినప్పటికీ... ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ఇటీవల ఈ కేసులో 2023 నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా నోటీసులు జారీ చేసింది. ఆయా ఆస్తుల్లో ఉన్న వారు ఖాళీ చేయాలని పేర్కొంది. అద్దెకు ఉంటున్న వారు ఇక నుంచి తమకే ఆ మొత్తాన్ని చెల్లించాలని తెలిపింది. అక్రమ చలామణి నిరోధక చట్టంలోని సెక్షన్ (8) నిబంధన 5(1) ప్రకారం జప్తు చేసిన ఆస్తులను స్వాధీనం చేసుకొనే ప్రక్రియ చేస్తున్నామని తెలిపింది. ఆస్తులున్న ప్రాంతాల్లో (ఢిల్లీ, ముంబై, లక్నో) భవనాలకు నోటీసులు అంటించినట్లు వెల్లడించింది. తాజాగా ఢిల్లీ ప్రత్యేక కోర్టులో చార్జిషీటు దాఖలు చేసిన ఈడీ... తదుపరి విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపింది.

ప్రజల్లోకి సంక్షేమ పథకాలు

(మొదటిపేజీ తరువాయి)

ఒక్కటయ్యాయన్నారు. సన్న బియ్యం బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. సన్న బియ్యం మన పథకం మన పేటెంట్, మన బ్రాండ్ అని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. మీ నియోజకవర్గంలో ఏం కావాలో ఒక నివేదిక తయారు చేసుకోవాలని ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఆ పనులను పూర్తి చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. నిన్న మొన్నటి వరకు బండి సంజయ్, కిషన్ రెడ్డి మనపై విమర్శలు చేశారని ఇప్పుడు ఏకంగా ప్రధాని మోదీనే రంగంలోకి దిగారన్నారు. తెలంగాణ పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరి బిక్కిరి అవుతున్నారని తెలిపారు. వర్గీకరణ మోదీకి గుదిబండగా మారిందన్నారు

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. మహిళలు ఆర్థికంగా ప్రయోజనం పొందేందుకు ఆర్టీసీ బస్సులో రాష్ట్రంలో ఎక్కడైనా ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించామన్నారు. బ్యాంకు రుణాల ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలతో బస్సులు కొనుగోలు చేయించి వాటిని ఆర్టీసీకి లీజుకు ఇచ్చి ఆర్థికంగా ప్రయోజనం పొందే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. వీటితోపాటు రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిలో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఇందిరాశక్తి క్యాంటీన్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఇచ్చామని... దీని ద్వారా వారు ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశం ఉందన్నారు. 'స్త్రీ సమ్మిట్' వంటి కార్యక్రమాలు ప్రజలను సన్మార్గంలో నడపడానికి ప్రభుత్వాలు సరైన చట్టాలు తెచ్చేందుకు ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు.

అమెరికాతో రాజీ కష్టమే

ఉక్రెయిన్ శాంతి ఒప్పందంపై రష్యా

మాస్కో: ఉక్రెయిన్ శాంతి ఒప్పందంపై అమెరికాతో ఏకీభవించడం కష్టమేనని రష్యా పేర్కొంది. ఒప్పందంలోని అనేక అంశాలపై రాజీకి రాలేమని తెలిపింది. రష్యా ఆర్థిక మంత్రి సెర్గీ లావ్రోవ్ మాట్లాడుతూ ఉక్రెయిన్‌తో శాంతి ఒప్పందంలోని అన్ని అంశాల్లో రాజీ పడలేమన్నారు. ఆర్థికంగా పశ్చిమ దేశాలపై రష్యా ఆధారపడబోదని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్రెయిన్‌లో రక్తపాతాన్ని ఆపాలని, శాంతి ఒప్పందంలో కీలక పాత్ర వహించాలని, శాంతి దూతగా మారాలని ఆకాంక్షిస్తున్న విషయం విదితమే. సెర్గీ లావ్రోవ్ మంగళవారం మాస్కో వార్తా సంస్థ 'కామెర్సెంట్'కు ఓ ఇంటర్వ్యూ ఇచ్చారు. 'పరస్పరం ప్రయోజనాలతో కూడుకున్న ఒప్పందం... మరొక ఉచ్చులోకి నెట్టివేసే ఒప్పందం మధ్య తేడా మాకు బాగా తెలుసు' అని ఓ ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. రష్యా స్పష్టమైన వైఖరితో ఉందని, అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ 2024 జులైలోనే తన వైఖరిని స్పష్టంచేశారన్నారు. నాటోలో చేరాలనే పట్టుదలను వదులుకోవాలని, రష్యా తమవిగా చెప్పే ఉక్రెయిన్‌లోని నాలుగు ప్రాంతాల నుంచి దళాలను ఉపసంహరించుకోవాలని పుతిన్ అప్పట్లో ఉక్రెయిన్‌ను డిమాండ్ చేశారు. సెర్గీ లావ్రోవ్ మాట్లాడుతూ 'ఆ నాలుగు ప్రాంతాల ప్రజల హక్కుల గురించి మనం మాట్లాడుతున్నాం. మేము వాటిని వదులుకోలేం... అక్కడి నుంచి ప్రజలను వెళ్లగొట్టనివ్వం' అని అన్నారు. ట్రంప్ ఇంగితజ్ఞానాన్ని మెచ్చుకుంటూ అమెరికా గత ప్రభుత్వాలు నాటోలో చేరేలా ఉక్రెయిన్‌ను ప్రోత్సహించడమే ఈ యుద్ధానికి ప్రధాన కారణమన్నారు. ఆర్థికంగా, సైనికరంగా, సాంకేతికంగా, వ్యవసాయపరంగానూ పాశ్చాత్య దేశాలపై ఆధారపడే పరిస్థితి రాష్యాకు రానివ్వమని సెర్గీ లావ్రోవ్ నొక్కిచెప్పారు.

నితీశ్‌కు రాజకీయ సెగ!

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యలు రాజకీయంగా సంచలనం సృష్టిస్తున్నాయి. నితీశ్ కుమార్‌ను పక్కన పెడుతున్నారని చెప్పడానికి ఈ వ్యాఖ్యలు నిదర్శనంగా మారాయి. బీజేపీ విజయయాత్ర హర్యానా నుంచి బీహార్ వరకు కొనసాగాలని సైనీ ఆకాంక్షించారు. బీజేపీ నేత సామ్రాట్ చౌదరి కాబోయే బీహార్ ముఖ్యమంత్రిగా చెప్పారు. సైనీ వ్యాఖ్యలపై ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ స్పందిస్తూ... ఎన్డీఏ నాయకుల మధ్య అంతర్గత పోరు నడుస్తోందని, చాలా మంది ముఖ్యమంత్రి పదవి కోసం పోటీ పడుతున్నారని వ్యాఖ్యానించారు. నితీశ్ కుమార్ 20 ఏళ్ల పాలనను పాత వాహనంతో పోల్చారు. దానిని మార్చాల్సిన అవసరం ఉందని అన్నారు. నితీష్ కుమార్ హైజాక్ అయ్యారని తెలిపారు. మరోవైపు, బీహార్‌లో ప్రతిపక్ష కూటమి పటిష్టంగా ఉన్నదని, బీహార్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉందని తేజస్వి అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల సన్నాహకాల కోసం ఢిల్లీలో కాంగ్రెస్ అధినాయకత్వంతో జరిగిన సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్ష కూటమి తరఫున సీఎం అభ్యర్థి ఎవరనే ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. అందరం ఏకగ్రీవంగా సీఎం అభ్యర్థిని ఎన్నుకుంటామని చెప్పారు. అదేవిధంగా ఈ ఎన్నికల్లో ఎన్డీఏ ఎట్టి పరిస్థితుల్లో గెలువబోదని తేజస్వి జోస్యం చెప్పారు.

ఎన్డీఏ సీఎం అభ్యర్థి నితీశ్: జేడీ(యూ)

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో నితీశ్ కుమార్ ఎన్డీఏ ముఖ్యమంత్రి అభ్యర్థి అవుతారని జనతాదళ్ (యునైటెడ్) మంగళవారం ప్రకటించింది. బీజేపీ నాయకుడు, బీహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి సీఎం అవుతారని హర్యానా సీఎం సైనీ వ్యాఖ్యానించిన ఒకరోజు తర్వాత జేడీ(యూ) ఈ ప్రకటన చేసింది. సైనీ వ్యాఖ్యలను ప్రతిపక్షాలు ఉపయోగించుకొని బీజేపీ, దాని మిత్రపక్షాల వైఖరిపై దాడి చేయడంతో జేడీ(యూ) జాతీయ అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ ప్రసాద్...సైనీ వ్యాఖ్యలను తోసిపుచ్చారు. బీహార్‌లో ముఖ్యమంత్రి అభ్యర్థి విషయంలో అధికార కూటమికి ఎలాంటి సంక్షోభం లేదని చెప్పుకున్నారు. 'బీహార్ అసెంబ్లీ ఎన్నికలు నితీశ్ కుమార్ నాయకత్వంలో జరుగుతాయి. ఆయన జాతీయ ప్రజాస్వామ్య కూటమికి ముఖంగా ఉంటారు. నితీశ్ ఎన్డీఏ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తారు. ఇది 2030 వరకు పూర్తి కాలానికి ఎన్నికల తర్వాత కచ్చితంగా ఏర్పడుతుంది' అని ప్రసాద్ తెలిపారు. బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా గతంలోనూ ఇదేవిధంగా మాట్లాడారని, ప్రతిపక్ష ఇండియా ఐక్యసంఘటనపై విమర్శలు గుప్పించారని, అనేక ఇతర రాష్ట్రాలలో జరిగినట్లుగా బీహార్‌లోనూ ఇది విచ్ఛిన్నమవుతుందని ఆయన అన్నారు. తేజస్వీ యాదవ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆర్‌జేడీ ప్రకటించినప్పటికీ... ఈ ఏడాది చివరిలో ఎన్నికలు జరిగిన తర్వాత బీహార్‌లో తమ కూటమి నాయకుడిపై నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ నాయకుడు సచిన్ పైలట్ ఇటీవల చెప్పారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీతో జరిగిన సమావేశం నుంచి యాదవ్ ఖాళీ చేతులతో తిరిగి వచ్చారని అన్నారు. బీహార్‌లో రాబోయే ఎన్నికల్లో ఎన్డీఏ అతిపెద్ద విజయం సాధిస్తుందని చెప్పుకొచ్చారు.

ఎన్డీయేకు ఆర్ఎల్‌జేపీ గుడ్‌బై

బీహార్ శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో బీజేపీ నేతృత్వంలోని కీలక మిత్రపక్షాన్ని ఎన్‌డీఏ కోల్పోయింది. ఆర్ఎల్‌జేపీ అధ్యక్షుడు పశుపతి కుమార్ పరాస్ ఎన్డీయేలో తమకు అన్యాయం జరిగిందని, తమది దళిత పార్టీ కావడమే దీనికి కారణమని చెప్పారు. అందుకే కూటమి నుంచి బయటకు రావాలని నిర్ణయించుకున్నామని తెలిపారు.

బెంగాల్‌లో హింసపై సుప్రీం విచారణ?

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన హింసపై దర్యాప్తు చేయడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో ఐదుగురు సభ్యుల న్యాయ విచారణ కమిషన్ ను ఏర్పాటు చేయాలని కోరుతూ న్యాయవాది విశాల్ తివారీ మరో పిటిషన్ దాఖలు చేశారు. ప్రజల ప్రాణాలను, ఆస్తులను కాపాడాలనే ఆదేశాలతో పాటు హింసపై సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిల్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్లను పరిశీలించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది.

సర్దుకున్న పరిస్థితులు

హింసాత్మక ఘటనలతో అట్టుడికిన ముర్షిదాబాద్‌లో జనజీవనం సాధారణ స్థితికి చేరుకుంది. అయితే కొత్తగా హింసాత్మక సంఘటనలు జరగకుండా భద్రతా దళాలు గట్టి నిఘా ఉంచాయని అధికారులు తెలిపారు. బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, భద్రతా బలగాలని మోహరించామని పేర్కొన్నారు. గత 48 గంటల్లో హింసాత్మక సంఘటనలు ఏవీ జరగలేదని వెల్లడించారు. ముర్షిదాబాద్?లో పరిస్థితి క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంటుందని, వ్యాపారులు దుకాణాలు తెరుస్తున్నారని చెప్పారు. హింసకు సంబంధించి ఇప్పటివరకు మొత్తం 210 మందిని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా బెంగాల్ లో ఈనెల 11,12 జరిగిన తేదీల్లో జరిగిన నిరసనల్లో హింస చెలరేగింది. ఈ క్రమంలో ముర్షిదాబాద్ జిల్లాలో ముగ్గురు మరణించారు. వందలాది మంది నిరాశ్రయులయ్యారు.

ఈడీ విచారణకు రాబర్ట్ వాద్రా

(మొదటిపేజీ తరువాయి)

బయట ఉండగా ఉదయం 11 గంటలకు తన న్యాయవాదితో కలిసి ఈడీ కార్యాలయంలోకి ప్రవేశించారు. ఈడీ కార్యాలయానికి వెళ్లే దారిలో వాద్రా విలేకరులతో మాట్లాడుతూ... ఇది రాజకీయ ప్రతీకారం తప్ప మరొకటి కాదన్నారు. 'నేను మైనారిటీల కోసం మాట్లాడినప్పుడల్లా వారు నన్ను ఆపడానికి, మమ్మల్ని అణిచివేయడానికి ప్రయత్నిస్తారు... పార్లమెంటులో కూడా రాహుల్ గాంధీని ఆపడానికి ప్రయత్నించారు. ఇది దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, రాజకీయ ప్రతీకారం' అని విమర్శించారు. తన దగ్గర ఏమి లేదని, అందుకే తనకు ఎటువంటి భయం లేదని తెలిపారు. అధికారులు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇస్తానని చెప్పారు. గతంలో మాదిరిగానే తాను విచారణకు పూర్తిగా సహకరిస్తానన్నారు. కాగా మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఈడీ దాదాపు రెండు గంటల పాటు వాద్రాను విచారించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కాగా మధ్యాహ్నం 1:30 గంటలకు ఈడీ కార్యాలయం నుండి భోజనానికి బయటకు వచ్చిన సమయంలో దర్యాప్తుకు సహకరించడానికి తాను సిద్ధంగా ఉన్నప్పటికీ, దానిని ముగించాల్సిన అవసరం ఉందని వాద్రా విలేకరులతో అన్నారు. '2007లో జరిగిన దాని గురించి మీరు ఎలా మాట్లాడగలరు?' అని ఆయన ప్రశ్నించారు. ఈ కేసులో ఏప్రిల్ 8న వాద్రాకు సమన్లు జారీ అవగా.... ఆయన హాజరు కాకపోవడంతో 15వ తేదీన విచారణకు పిలవడం జరిగిందని ఈడీ వర్గాలు తెలిపాయి.

18న విచారణకు రండి

(మొదటిపేజీ తరువాయి)

తిరుగుతున్నాడు. హైదరాబాద్‌లో సోమవారం ఏకకాలంలో 15 చోట్ల సిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. రాయదుర్గం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న కసిరెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆయన బంధువులు, స్నేహితులు, ఆత్మీయుల ఇళ్లలోనూ సోదాలు చేశారు. ఏక్తా హైట్స్, కసిరెడ్డి భార్య డైరెక్టర్‌గా ఉన్న అరేటి ఆస్పత్రి, అతని అత్త ఇంట్లోనూ దాడులు చేపట్టారు. మద్యం కుంభకోణంలో ప్రతి నెలా రూ.60 కోట్ల చొప్పున ఐదేళ్లపాటు దాదాపు రూ.3 వేల కోట్లు వసూలు చేయడంలో కసిరెడ్డి ప్రధాన ప్రాతధారిగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు విచారణ హాజరుకావాలని కోరగా...ఇటీవల ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా విజయసాయిరెడ్డికి సిట్ నోటీసులు జారీజేసింది.

ఎస్సీ వర్గీకరణకు ఆర్డినెన్స్

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగాల్లో రిజర్వేషన్ల ఫలాలు సమానంగా అందేలా చర్యలు తీసుకోవాలని తీర్మానించింది. రాష్ట్రంలోని 59 షెడ్యూల్డు కులాలను జనాభా వెనుకబాటుతనం, సామాజిక సమైక్యతల ఆధారంగా మూడు కేటగిరీలుగా విభజించాలని నిర్ణయించింది. వీటిలో గ్రూప్-1 కింద బవురి, చచాటి, చండాల, దండాసి, డొమ్, ఘాసి, గొడగలి, మెహర్, పాకి, పామిడి, రెల్లి, సాప్రు తదితర 12 ఉప కులాలకు ఒకశాతం రిజర్వేషన్ రానుండగా... గ్రూప్-2లో అరుంధతీయ, బిందల, చమార్, చంభార్, దక్కల్, ధోర్, గొదారి, గోసంగి, జగ్గాలి, జాంబవులు, కొలుపుల పండ్లు, మాదిగ, మాదిగ దాసు, మాంగ్, మాంగ్ గరోడి, మాతంగి, సమగార, సింధోలు తదితర 18 ఉపకులాలకు 6.5 శాతం రిజర్వేషన్ అమలు కానుంది. గ్రూప్-3లో మిగిలిన 29 ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేషన్ వర్తించనుంది. అన్ని జిల్లాల్లో ఈ ఆర్డినెన్స్ అమల్లోకి వస్తుంది. అలాగే రూ.617 కోట్లతో అసెంబ్లీ, రూ.786 కోట్లతో హైకోర్టు భవన నిర్మాణాలకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నిర్మాణ పనులను ఎల్1 బిడ్డర్‌కు అప్పగించాలని నిర్ణయించింది. స్టేట్ సెంటర్ ఫర్ క్లైమేట్ ఇన్ సిటీస్ వ్యవస్థల ఏర్పాటును ఆమోదించింది. పట్టణ ప్రాంతాల్లో వరద నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని, వచ్చే విద్యా సంవత్సరంలోగా ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ నెల 26న మత్స్యకార భరోసా సాయం కింద లబ్ధిదారులకు రూ.20 వేలు పంపిణీ చేయాలని సమావేశం తీర్మానించింది. మంత్రివర్గ సమావేశం తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, డోలా బాలవీరాంజనేయస్వామి, కందుల దుర్గేశ్ మీడియాకు వివరించారు.

మెగాసిటీకి అడుగులు

- మంగళగిరి, తాడేపల్లి, గుంటూరు, విజయవాడ కలిపి ఏర్పాటు
- 5 వేల ఎకరాల్లో అంతర్జాతీయ విమానాశ్రయం యోచన
- రెండో విడత భూసమీకరణపై నిర్ణయించలేదు
- మూడేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తి: మంత్రి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజధాని పరిధిలో మరోసారి భూసమీకరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మంత్రి పి.నారాయణ స్పష్టం చేశారు. ఐదు వేల ఎకరాల్లో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయించారని, దానికోసం భూమి అవసరం ఉందని తెలిపారు. అయితే ల్యాండ్ ఎక్విజిషన్ ద్వారా భూములు తీసుకుంటే రైతులు నష్టపోతారనే విషయాన్ని స్థానిక ఎమ్మెల్యేలు తన దృష్టికి తీసుకువచ్చినట్లు మంత్రి చెప్పారు. రాజధానిలోని అనంతవరంలో గ్రావెల్ క్వారీలను మంత్రి నారాయణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మంగళగిరి, తాడేపల్లి, గుంటూరు, విజయవాడను కలిపి త్వరలో మెగాసిటీ ఏర్పాటు చేయాలనే ఆలోచనతో సీఎం ఉన్నారని, అందుకే అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. భూసేకరణ ద్వారా భూములు తీసుకుంటే కేవలం రిజిస్ట్రేషన్ ధరలో రెండున్నర రెట్లు మాత్రమే ఎక్కువ వస్తుందని, అలాకాకుండా భూ సమీకరణ ద్వారా తీసుకుంటే రైతులకు ప్రయోజనం ఉంటుందన్నారు. రైతులు కూడా భూ సమీకరణ విధానాన్నే కోరుకుంటున్నారని అన్నారు. అయితే 5 వేల ఎకరాలు కావాలంటే భూసమీకరణ ద్వారా 30 వేల ఎకరాలు సమీకరించాల్సి ఉంటుందని తెలిపారు. వీటిలో రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వగా మిగిలిన భూముల్లో రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌలిక వసతుల కోసం మరికొన్ని వేల ఎకరాలు అవసరం ఉంటుందన్నారు. ఇవన్నీ పోగా ఇంకా 5 వేల ఎకరాలు మాత్రమే మిగులుతుం దన్నారు. అందుకే ల్యాండ్ పూలింగ్ ద్వారా ఎక్కువ భూమి తీసుకోవాల్సి ఉంటుందని, అయినప్పటికీ ప్రస్తుతం విమానాశ్రయం విషయంలో భూసమీకరణ, భూసేకరణ అనేది ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. అమరావతి నిర్మాణం కోసం 2015లో కేవలం 58 రోజుల్లోనే రైతులు స్వచ్ఛందంగా 34 వేల ఎకరాలు భూమిని పూలింగ్ ద్వారా ఇచ్చారనే విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. మొత్తం 68 పనులకు సంబంధించి రూ.42,360 కోట్ల విలువైన పనులకు ప్రస్తుతం టెండర్లు పూర్తయి... ఈ పనులన్నీ ఇప్పటికే ప్రారంభమయ్యాయని తెలిపారు. నిర్మాణానికి సంబంధించి అవసరమైన గ్రావెల్ కోసం గనుల శాఖ 851 ఎకరాలు సీఆర్డీయేకు కేటాయించిందన్నారు. రాజధాని అమరావతి నిర్మాణ పనులు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయని, ఏడాదిలో అధికారుల నివాస భవనాలు, ఏడాదిన్నరలో ట్రంక్ రోడ్లు, రెండున్నరేళ్లలో లేఅవుట్ రోడ్లు, మూడేళ్లలో ఐకానిక్ భవనాలు పూర్తి చేస్తామని మంత్రి నారాయణ చెప్పారు.

వివాహితుల లైంగిక బంధం నేరం కాదు

(మొదటిపేజీ తరువాయి)

నిరాకరించాడు. దీంతో ఆమె సెప్టెంబర్ 8, 2024న మేనాగురి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బీఎన్ఎస్ సెక్షన్లు 69 (మోసపూరిత మార్గాల ద్వారా లైంగిక సంబంధం), 351(2) (క్రిమినల్ బెదిరింపు) కింద కేసు నమోదు చేశారు. విచారణ సందర్భంగా ఆ వ్యక్తిపై కేసు విచారణను రద్దు చేశారు.

గ్లోబల్ బిజినెస్ హబ్‌గా హైదరాబాద్

(మొదటిపేజీ తరువాయి)

స్పేస్‌కు డిమాండ్ తగ్గుతుంటే మన దగ్గర గతేడాది దేశంలోనే అత్యధికంగా 56 శాతం వార్షిక వృద్ధి రేటు నమోదయిందన్నారు. గతేడాది రిటైల్ రంగంలో 1.8 మిలియన్ చదరపు అడుగుల స్పేస్ ను వివిధ సంస్థలు లీజుకు తీసుకున్నాయన్నారు. హైదరాబాద్ లో ఆమ్జెన్, గ్లోబల్ లాజిక్, ఎలీ లిల్లీ, మారియంట్, సిగ్నా లాంటి అంతర్జాతీయ సంస్థలకు చెందిన 355 జీసీసీలుండగా 3 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నాయన్నారు. ఏడాది వ్యవధిలో 70 కి పైగా కొత్త జీసీసీలు హైదరాబాద్ లో ప్రారంభమయ్యాయన్నారు. హైదరాబాద్ ను జీసీసీలకు హబ్ గా మార్చడమే కాకుండా వాటిని ఇన్నోవేషన్, ఆర్అండ్ డీ, ప్రొడక్ట్ డెవలప్మెంట్ తదితర అంశాల్లో సేవలు అందించే గ్లోబల్ వాల్యూ యాడెడ్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2030 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటా ట్రిలియన్ డాలర్లకు చేరుతుందన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి.. యువతకు ఉద్యోగాలు కల్పించడమే తమ లక్ష్యమని వివరించారు. కొందరు కావాలనే పనిగట్టుకొని పెట్టుబడులు రాకుండా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంపై నమ్మకంతో ఎంతో మంది పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వస్తున్నారని, వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. తమ జీసీసీని హైదరాబాద్ లో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన సిటిజెన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం వేయి మంది ఐటీ, డేటా నిపుణులకు ఇక్కడ ఉపాధి అవకాశాలు లభిస్తాయని రెండు, మూడేళ్లలో ఈ సంఖ్య రెట్టింపు అవుతుందన్నారు.

శ్రీనాథ్ హల్కేను అభినందిస్తున్న మంత్రి సీతక్క

విశాలాంధ్ర -జిల్లా బ్యూరో మహబూబాబాద్ : దేశంలోనీ ఆకాంక్షిత (ఆస్పిరేషనల్ బ్లాక్స్ (ప్రోగ్రాం) మండలాల డెల్టా ర్యాంకింగ్స్‌లో మహబూబాబాద్ జిల్లా, గంగారం మండలం అగ్రస్థానం, ములుగు జిల్లా, కన్నాయిగూడెం మండలం రెండవ స్థానంలో నిలవడం అభినందనీయమని రాష్ట్ర పంచాయతీ, గ్రామీణ, శిశు, సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. సోమవారం ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం అధికారి, శ్రీనాథ్ హల్కే అభినందించారు. మంత్రి మాట్లాడుతూ తాజాగా నీతి అయోగ్ ర్యాంకింగ్‌లో మహబూబాబాద్ జిల్లా గంగారం బ్లాక్ (మొదటి స్థానం) ర్యాంకింగ్లో సాధించిందని, సామాజిక ఫలితాలు అభివృద్ధిని పెంపొందించడంలో, జిల్లాలోని అన్ని శాఖలు సమన్వయంతో కలిసి కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ సూచనల మేరకు క్షేత్రస్థాయిలో హెల్త్ అండ్ న్యూట్రీషియన్, విద్య, సామాజిక అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన వ్యవసాయ, వ్యవసాయేతర అభివృద్ధి, ఐదు (థీమ్స్)లతో (40) సూచికల ద్వారా లోపాలను గుర్తించి మెరుగుపరచడానికి అన్ని విభాగాల అధికారులు సిబ్బంది పనిచేయడం వలన ఈ విజయం సాధ్యమయిందన్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం రెండవ స్థానం ర్యాంకింగ్లో సాధించిందని, మహబూబాబాద్ జిల్లా, ములుగు జిల్లా సంబంధిత అధికారులు మరింత ఉత్సాహంతో పనిచేసే క్షేత్రస్థాయిలో పనిచేసి, అభివృద్ధి చేయుటకు కృషి చేయాలని మంత్రి కోరారు.

మే14న మిస్ వరల్డ్ టీం రామప్పకు రాక : కలెక్టర్

విశాలాంధ్ర -ములుగుజిల్లాబ్యూరో : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ రామప్పను విజిట్ చేయడానికి మిస్ వరల్డ్ టీం మే 14న రాబోతున్నదని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ శబరిష్ అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావులతో కలిసి రామప్పలో ఏర్పాట్ల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే14న ప్రపంచ సుందరి పోటీలలో పాల్గొననున్న పలు దేశాలకు చెందిన పోటీ మహిళలు జిల్లాలోని పర్యాటక ప్రాంతమైన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ రామప్పను సందర్శించనున్న నేపథ్యంలో నేషనల్ హైవే లోని రోడ్డు పనులు మహమ్మద్ గౌస్ పల్లి నుంచి జంగాలపల్లి వరకు, జంగాలపల్లి నుండి రామప్ప టెంపుల్ వరకు ఆర్ అండ్ బి రోడ్డు, రామప్ప దేవాలయం నుండి హరిత హోటల్ వరకు పంచాయతీ రాజ్ రోడ్డు, ఇంజనీరింగ్ అధికారులు ఫీల్డ్ విజిట్ చేసి రోడ్డు మరమ్మత్తు పనులను ఈనెల 30 వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రొఫెసర్ పాండురంగారావు, డీఎస్పీ రవీందర్, పురావస్తు శాఖ అధికారులు, జిల్లా అధికారులు, వెంకటాపూర్ మండలాధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ సభకు తరలిరావాలి : ఎంపీ వద్దిరాజు

విశాలాంధ్ర - ఇల్లందు : ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే భారత రాష్ట్ర సమితి రజతోత్సవ సభకు ఇల్లందు నియోజకవర్గం నుండి కార్యకర్తలు ఉప్పెనలా కదిలి రావాలని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ అధ్యక్షతన పట్టణంలోని స్థానిక అయితా ఫంక్షన్ హాల్లో పార్టీ శ్రేణుల సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ రవిచంద్ర ముందుగా పార్టీ క్రియాశీల కార్యకర్తల ఇంటికి హరిప్రియతో కలిసి ఇంటి ఆడపడుచులకు బొట్టు పెట్టి వరంగల్ లో జరిగే పాతికేళ్ల పార్టీ సంబరాలకు అహ్వానించారు. అనంతరం సమావేశంలో పాల్గొని పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. వరంగల్ లో పది లక్షల మందితో జరిగే సభలో అధినేత కేసీఆర్ సందేశాన్ని వినేందుకు అందరూ ఎదురు చూస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో ఏడాదిన్నరకే ప్రజలు విసిగి పోయారని విమర్శించారు. ఆచరణలో సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయలేక చేతులెత్తేశారన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేద్దామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భ్రమపడుతున్నట్లు ఎద్దేవ చేసారు. అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ వరంగల్ సభ విజయవంతానికి దిశా నిర్దేశం చేశారు. బహిరంగ సభకు హాజరయ్యే ముందు పార్టీ కార్యకర్తలంతా తమ తమ గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్, మహబూబాబాద్ జెడ్పీ మాజీ చైర్మన్ ఆంగోత్ బింధు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ లక్కినేని సురేందర్, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు సంజీవ్ నాయక్,వివిధ మండలాల పార్టీ బాధ్యులు శీలం రమేష్,బొమ్మెర ప్రసాద్,తాతా గణేష్,లక్ష్మణ్ నాయక్,పరుచూరి వెంకటేశ్వరరావు,టీబీజీకేఎస్ నాయకులు రంగనాథ్,జాఫర్ హుస్సేన్,జెకె శ్రీనివాస్,సురేష్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకం..లక్షల్లో లాభాలు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : వర్తమాన వ్యవసాయ పరిస్థితుల్లో లాభాలు పండించే కొర్రమీను చేపల పెంపకం ద్వారా రైతులు ముఖ్యంగా మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో జిల్లాలోని మహిళా సమాఖ్య సభ్యులు, వ్యవసాయ శాఖ ఏపీఎంలకు కొర్రమీను చేపల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సాంప్రదాయ పంటల వ్యవసాయం అన్ని సమయాల్లో కలిసి వస్తుందని గ్యారంటీ లేదన్నారు. ఎందుకంటే వర్షాలు ఎక్కువ పడిన ఇబ్బందే... లేక సకాలంలో పడకున్న ఇబ్బందే అన్నారు. ప్రకృతి సహకరిస్తేనే అధిక దిగుబడిని పొందగలరని అదే ఇలాంటి చాపల పెంపకం అయితే ప్రకృతి వైపరీత్యాలకు సంబంధం లేకుండా లాభాలు గ్యారెంటీగా వస్తాయన్నారు. ఒక్కసారి పెట్టుబడితో నిరంతరం ఆదాయం వచ్చే చేపల పెంపకంపైన రైతులు దృష్టి సారించాలని ఆయన కోరారు. ఈ చేపల పెంపకంలో కొర్రమీను మాత్రమే ఎందుకు చెప్తున్నామంటే అది ఎటువంటి వాతావరణం అయినా తట్టుకుని బురదలో అయినా బతికే సామర్థ్యం ఉన్న చేప జాతి అన్నారు. కొర్రమీను చేపల పెంపకం కొరకు ఎక్కువ ప్రదేశం కూడా అవసరం లేదని ఒక పావుగుంట ప్రదేశంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం ఇంకో పావు కుంట ప్రదేశంలో ఫామ్ పౌండ్ నిర్మాణం తోపాటు సుమారు రూ. 3, 4 లక్షలతో పెంపకం షురూ చేయొచ్చన్నారు. ఒక్కో చేప పిల్ల ఖరీదు రూ. 15 కాగా ఆ చిన్న ప్రదేశంలో 1000 చేపల పిల్లల పెంపకం చేపట్ట వచ్చని వివరించారు. మార్కెట్ లో కిలో చేపల ఖరీదు రూ. 300 ఉందని కేవలం 7 నెలల్లో రూ. 2, లక్షల 70 వేలు వస్తాయన్నారు. ఈ చేపల పెంపకం యూనిట్ స్థాపన కోసం బ్యాంకుల ద్వారా పీఎం ఈ జిపి పథకం ద్వారా 35 శాతం సబ్సిడీ వస్తుందన్నారు. ఈ సదస్సులో అదనపు కలెక్టర్ విద్యా చందన, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ రెడ్డి, పరిశ్రమల శాఖ మేనేజర్ తిరుపతయ్య, మత్స్య శాఖ ఏడి ఇంతియాజ్ ఖాన్, ఆక్వా కనెక్ట్స్ సంస్థ ప్రతినిధులు, మహిళా సమైక్య సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పరిహారం

విశాలాంధ్ర కారేపల్లి : నూతన అదనపు రైల్వేలైన్ కింద భూములు ఇళ్ళు కోల్పోయిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పరిహారం ఇవ్వడం జరుగుతుంది ల్యాండ్ ఎక్విజేషన్ ప్రత్యేక అధికారి ఎం రాజేశ్వరి అన్నారు మంగళవారం సింగరేణి గ్రామపంచాయతీ కార్యాలయంలో డోర్నకల్ నుండి కొత్తగూడెం రైల్వే రెండో లైన్ పరిశీలించిన అనంతరం ఆమె స్థానిక తాసిల్దార్ ఎస్ సంపత్ కుమార్ తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలో భూములు ఇండ్లు కోల్పోయిన కోల్పోయిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందయజేయడం జరుగుతుందన్నారు.గ్రామ సభలో భూములు ఇళ్ళు కోల్పోయిన రైతులకి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు భూములు,ఇళ్ళు కోల్పోయిన రైతులు మాకు మెరుగైన పరిహారం ఇవ్వాలని అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు సభ్యులు తురక నారాయణ, ఆర్ ఐ నరసింహారావు,రైల్వే ఏఈ శ్రీకాంత్ రెడ్డి నాయకులు తోగరు శ్రీను,ముక్క వెంకటేశ్వర్లు,ముళ్ళ యాకాంబరం,గుండెబోయిన కోటేశ్వరరావు,కుమ్మరి రాజు, ఎస్కే అమీర్ పాషా,హరి, సాంబ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్తార్ పాషా త్యాగాలు స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర - బయ్యారం: భారత దేశంలో భూస్వామ్య, పెట్టుబడిదారీ వ్యవస్థ రాజ్యమేలుతున్నాయని అడుగడుగునా పీడిత ప్రజలు దోపిడీకి గురవుతున్న క్రమంలో వారి విముక్తి కోసం శ్రామిక వర్గ పోరాటాలు నిర్మించాలని సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు సాధినేని వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఐఎఫ్టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి దివంగత యస్ కె. ముఖ్తార్ పాషా స్మారకార్థం కొత్తపేట వద్ద నిర్మించిన స్తూపాన్ని మంగళవారం సాధినేని ఆవిష్కరించారు. అనంతరం బయ్యారం కోదండరామ ఫంక్షన్ హాల్లో పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. దేశంలో మతోన్మాద ఫాసిస్టు ప్రమాదం ముంచుకొస్తున్నదని, శ్రామికవర్గాల పై దాడులు, అణచివేత పెరుగుతున్నాయన్నారు. సామ్రాజ్య వాద, ఫ్యూడల్, పెట్టుబడిదారీ శక్తులను ఎదుర్కోవటానికి విప్లవశక్తుల ఐక్యత తక్షణావసరమన్నారు. విప్లవకారుల ఐక్యతా కోసం చర్చలకు వెళ్ళిన క్రమంలోనే పాషా కరోనా బారిన పడి అమరుడయ్యాడని యస్వీ గుర్తు చేసారు. పాషా అమరత్వం స్ఫూర్తితో రెండు న్యూడెమోక్రసీ సంస్థలు ఒకే పార్టీగా విలీనమయ్యాయని, విప్లవకారుల నాయకత్వాన వీరోచిత పోరాటాలు, త్యాగాలతో పేదరైతులకు లక్షల ఎకరాల భూములు సాధించుకొన్నారని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలలో పెంకు కార్మికుల సంఘాన్ని స్థాపించి వారికి అనేక హక్కులు, సౌకర్యాలు సాధించి పెట్టాడని పాషా త్యాగాలను వివరించారు. కార్మిక కర్షక వర్గం సైక్యంగా లేకుంటే ఈ వ్యాపార మతోన్మాద, ఫాసిస్టు శక్తులు బానిసత్వంలోకి నెట్టేస్తాయని విమర్శించారు. దేశంలో వర్గపోరాటాలను తీవ్ర తరం చేయటం ద్వారానే దోపిడీ వర్గాన్ని నిలువరించగలుగుతామని ఎస్వీ స్పష్టం చేసారు. దోపిడీ లేని సమసమాజాన్ని నిర్మించటమే అమరుడు పాషాకు అర్పించే నిజమైన ఘనమైన నివాళి అన్నారు. అనేక ఆటంకాలను అధిగమించి పాషా స్మారక స్తూపాన్ని నిర్మించిన ఖమ్మం- వరంగల్ ఏరియా కమిటీకి ఆయన అభినందనలు తెలియజేశారు. ఈసభలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు, కే. గోవర్ధన్, పీవోడబ్ల్యూ జాతీయ నాయకురాలు వీ.సంధ్య, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, ఐఎఫ్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జీ.అనూరాధ, జే సీతారామయ్య, పార్టీ రాష్ట్ర నాయకులు బందారి ఐలయ్య, మోకాళ్ళ మురళీకృష్ణ, నందగిరి వెంకటేశ్వర్లు,ముక్తి సత్యం, తుపాకుల నాగేశ్వరరావు, రాము, సాగర్, ఐఎఫ్టీయూ నాయకులు ఏపూరి వీరభద్రం పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ మహబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పర్వత కోటేశ్, శివారపు శ్రీధర్, భద్రాద్రి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొక్కు సారంగపాణి,తోడేటి నాగేశ్వరరావు, డీ. ప్రసాద్, మహబూబాబాద్ జిల్లా పార్టీ, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పేలిన డైనమెన్... కూలిన ఇరిగేషన్ డివైడర్

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా ఖానాపూర్ : ఖానాపూర్ టు నిర్మల్ ప్లే ఓవర్ బ్రిడ్జ్ పనుల్లో డైనమెన్ బాంబు పేలుడు పదార్థం , గత పది రోజులుగా పేలుతున్నాయి. ఖానా పూర్ టు నిర్మల్ హైవే నెంబర్ 61 రహదారి రిజర్వు ఫారెస్ట్ మధ్యలో నుంచి ఉండుట వలన వన్యప్రాణుల సంరక్షణ కొరకై నేషనల్ హైవే నిధుల నుండి కోట్ల రూపాయలు వెచ్చించి నడుస్తున్న ప్లే ఓవర్ బ్రిడ్జి పనుల్లో ఖానాపూర్ సమీపాన ఇక్బల్పూర్ శివారులో ప్లే ఓవర్ బ్రిడ్జ్ పనుల్లో బండరాళ్లు రావడంతో బండరాలను డైన్ మెన్ వంటి పేలుడు పదార్థాన్ని పెట్టి పేల్చినారు. అంతేకాకుండా సరస్వతి కెనాల్ డి 27కు ఉపకాలువ ఇగ్బాల్ పూర్ శివారు నుండి సుర్జాపూర్ మేడమ్ పల్లి శివారులో గల భూములను సస్యశ్యామలం చేస్తూ నిర్మితమైన ఇరిగేషన్ డిపార్ట్మెంట్ కెనాల్‌కు రహదారి వద్ద రోడ్డుకు ఇరువైపులా డివైడర్ వండి గైడ్ వాళ్లను తొలగించి వేశారు. ఇట్టి విషయమై సంబంధిత అధికారులైన పోలీస్ రెవెన్యూ ఎంపీడీవో ఇరిగేషన్ వంటి అధికారులను చేరవాణి ద్వారా వివరణ కోరగా పేలుడు పదార్థానికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు అని వివరించారు. ఈ విషయాన్ని నేషనల్ హైవే అధికారిని చేరవాణి, ద్వారా వివరణ కోరగా విత్ పర్మిషన్‌తో పనులు నడుస్తున్నాయన్నారు.

న్యాయవాదుల చట్టం సవరణ తగదు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: అడ్వకేట్స్ యాక్టుకు సవరణ ఏకపక్షంగా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకు రానున్న ప్రతిపాదిత బిల్లును వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ న్యాయవదుల్లో విస్తృత ప్రచారం చేపట్టింది. ఈ మేరకు మంగళవారం ప్రతిపాదిత సవరణలతో బార్ కౌన్సిల్ స్వతంత్ర ప్రతిపత్తి ప్రశ్నార్థకం అవుతుందని న్యాయవాదులు ముద్రించిన కరపత్రం ప్రదర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం న్యాయవాద వృత్తి మనుగడకు ప్రమాదకరంగా పరిణమిస్తుందని విమర్శించారు. ప్రస్తుతవున్న చట్టాన్నే కొనసాగించాలని, విదేశీ లాయర్లను అనుమతించొద్దని ఏ.ఐ.ఎల్.యు. నాయకులు డిమాండ్ చేశారు. ప్రచారంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ముసాయిదా బిల్లు ప్రతిపాదనలపై అభ్యంతరాలు, సలహాలు, సూచనలతో కూడిన ఎనిమిది పేజీల వివరణాత్మక కరపత్రాన్ని ఏ.ఐ.ఎల్.యు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించి విడుదల చేసారు. జిల్లా వ్యాపితంగా న్యాయవాదులకు కరపత్రాన్ని పంపిణీ చేశారు. కొత్త ముసాయిదా బిల్లులోని లోపాలు, కేంద్ర ప్రభుత్వ ఏకపక్షవైఖరిని వివరించారు. ముసాయిదా బిల్లులో న్యాయవాదుల రక్షణ, సంక్షేమ చర్యలపై ఏమీ లేకపోగా, వృత్తిని ప్రమాదంలో పడేసే ప్రతిపాదనలు ఉన్నాయని తప్పుబట్టారు. ఎలాంటి చర్చలు, సంప్రదింపులు లేకుండానే కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారం సవరించాలని చూస్తే దేశవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కేవలం న్యాయవిద్య చదువుకున్న వారు మాత్రమే న్యాయవాద వృత్తిలోకి అనుమతించాలన్నారు. న్యాయవాదులు మాత్రమే బార్ కౌన్సిళ్లకు ప్రాతినిధ్యం వహించాలని నాయకులు అభిప్రాయపడ్డారు. ఆయా రాష్ట్రాల బార్ కౌన్సిళ్లలో, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో కేంద్ర ప్రభుత్వం ముగ్గురు న్యాయవాదేతర వ్యక్తులను నియమించాలని చూడటం అప్రజాస్వామ్య విధానమని విమర్శించారు. ఈ కరపత్రాన్ని నాయకులు ఎం.వి. ప్రసాదరావు, రమేష్ కుమార్ మక్కడ్, జె. శివరాం ప్రసాద్, కె.పుల్లయ్య, పి.కిషన్ రావు, పాయం రవివర్మ, బందారు అరుణ్, రావిలాల రామారావు, అరికాల రవి కుమార్, మెదరమెట్ల శ్రీనివాస రావు, యు.గౌతమ్ కుమార్ తదితరులు ఆవిష్కరించారు.

ఎన్నికలు నిర్వహిస్తే బీఆర్ఎస్‌కు 100 సీట్లు : ఎర్రబెల్లి

విశాలాంధ్ర -జిల్లా బ్యూరో మహబూబాబాద్ /తొర్రూర్: ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ పార్టీకి 100 సీట్లు వస్తాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఈనెల 27న జరిగే వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తి ఎక్స్‌రోడ్‌లో జరిగే భారత రాష్ట్ర సమితి రజితోత్సవ సభ విజయవంతం చేయాలని జరిగిన సమా వేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒకటి కూడా నెరవేర్చలేదని దుయ్యబట్టారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రజలకు అన్ని విధములుగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాయ మాటలుతో ప్రజలను బురిడీ కొట్టి అధికారంలోనికి వచ్చారని తెలిపారు. మహిళలకు 2500, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లాంటి పథకాల కు తులం బంగారం ఇస్తానని ఎందుకు ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. కెసిఆర్ ప్రభుత్వం 24 గంటల కరెంటు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతులకు పెట్టుబడి కింద రైతుబంధు, రైతు రుణమాఫీ, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర , వికలాంగులకు, వితంతువులకు ,వృద్ధులకు పెన్షన్ సకాలంలో అందించి ఆదుకున్నామన్నారు. ప్రజలకు కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా నేను అండగా ఉంటానని వారికి భరోసాను కల్పించారు. తొర్రూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో 100 పడకల ఆస్పత్రిని మంజూరు చేశానని, దానిని పెండింగ్లో పెట్టకుండా వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సీతారాములు, మాజీ జెడ్పి ఫ్లోర్ లీడర్ మంగళంపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చిన్న అంజయ్య, బిందు శ్రీనివాస్ ,మాజీ కౌన్సిలర్లు ,మాజీ కోఆప్షన్ నెంబర్లు, మాజీ సర్పంచులు, వార్డ్ అధ్యక్ష ,కార్యదర్శులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం పథకంపై ప్రజలు హర్షం : గోలి

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సన్న బియ్యం పథకాన్ని అందరూ మెచ్చుకుంటున్నారని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నల్గొండ జిల్లా, కొండమల్లేపల్లి ,దేవరకొండ మండలాలలో జాతీయ ఆహార భద్రత చట్టం-2013 అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా దేవరకొండ ఏరియా ఆసుపత్రిలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ దేవరకొండ, కొండమల్లేపల్లి మండలాలలో రేషన్ షాపులు, అంగన్వాడీ కేంద్రాలు ,పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేసామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చౌకధర దుకాణాల ద్వారా పేద ప్రజలకు అందిస్తున్న సన్న బియ్యం పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని, అందరు మెచ్చుకుంటున్నారన్నారు. అంత్యోదయ కార్డులకు పంచదార కేటాయించాలని ప్రజలు కోరారని, అదేవిధంగా చౌకధర దుకాణాలలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు వంటి అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అంగన్వాడి కేంద్రంలో చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహార పంపిణీ, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు బాగున్నాయని, అలాగే దేవరకొండ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, గిరిజన బాలికల వసతి గృహం, వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాలలో తనిఖీలు నిర్వహించి అక్కడ మెనూ ప్రకారం భోజనం, ఇతర సౌకర్యాలను తనిఖీ చేశామని, నిబంధనల ప్రకారమే విద్యార్థులకు కల్పిస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. ఏరియా ఆసుపత్రి 100 పడకల సామర్థ్యం ఉన్నప్పటికీ ప్రస్తుతం 180 మంది వస్తున్నారని , 200 పడకల కోసం ప్రభుత్వానికి సిఫారసు చేసామని డిసిహెచ్ మాతృనాయక్ తెలిపారు. అయితే రాష్ట్ర ఆహార కమిషన్ ద్వారా 200 పడకల ఆసుపత్రిగా స్థాయి పెంచేందుకు తమ వంతు కృషిగా లేఖ రాస్తామని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు శారద, భారతి, జ్యోతి, దేవరకొండ ఆర్ డి ఓ రమణారెడ్డి, బీసీ సంక్షేమ అధికారి ఖాజా నజీమ్ అలీ, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాలకు బ్యాంకు ఇన్సూరెన్స్

విశాలాంధ్ర -ములుగు జిల్లాబ్యూరో : ములుగు జిల్లాలో గత వారం రోజుల నుండి కురుస్తున్నటువంటి వడగళ్ల వాన వల్ల పంట నష్టపోయినటువంటి రైతు సోదరులు వారు పంట రుణం తీసుకున్నప్పుడు,కానీ లేదా తరువాత కానీ క్రాప్ ఇన్సూరెన్స్ చేసినట్లయితే,వారు వెంటనే సంబంధిత బ్యాంకులో కానీ లేదా మీరు ఇన్సూరెన్స్ చేసినటువంటి కంపెనీ వారికి తెలియజేసినట్లయితే సంబంధిత ఇన్సూరెన్స్ కంపెనీ వాళ్ళు తమ పంట పొలాలను పరిశీలించి నష్టపోయినటువంటి రైతు సోదరులకు ప్రభుత్వం ఇస్తున్నటువంటి నష్టపరిహారంతో పాటుగా ఇన్సూరెన్స్ కూడా వచ్చే అవకాశం ఉన్నదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇట్టి విషయాన్ని జిల్లాలోని రైతు సోదరులు గమనించి సదరు ఇన్సూరెన్స్ కంపెనీ లను సంప్రదించవలసిందిగా ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

భూ భారతిని సమర్థవంతంగా అమలు చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో సంగారెడ్డి : తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక భూ చట్టం 'భూభారతి' ని సమర్థవంతంగా, క్షేత్ర స్థాయిలో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు రెవెన్యూ అధికారులకు పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్లో రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. బుధవారం ,రెవెన్యూ అధికారులకు శిక్షణ , రైతులకు ఈనెల 17 నుంచి 30 వరకు మండలాల వారీగా అవగాహన సదస్సులు వుంటాయని అన్నారు . నూతన భూభారతి పోర్టల్ ను ఓపెన్ చేసి పరిశీలించారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక నూతన భూ చట్టం భూభారతిని సమర్థవంతంగా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని అధికారులు ఆదేశించారు. భూభారతి రైతుల సమస్యలు పరిష్కరించి, భూముల వివాదాలు లేకుండా జిల్లాను తీర్చిదిద్దా లని అన్నారు. రైతులు కార్యాలయాల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగకుండా ఉండేందుకు భూభారతిని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. రైతుల భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా,గ్రామ, మండల ,జిల్లా స్థాయిలో రైతులు ప్రజలు లేవనెత్తే సందేహాలకు అర్థమయ్యే భాషల్లోని సమాధానాలు చెప్పి , భూ సమస్యలకు పరిష్కారాలు చూపాలని, రెవెన్యూ అధికారులకు కలెక్టర్ సూచించారు. రైతులు ఈ అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేయాలనీ అన్నారు.

అసిస్టెంట్ వేతనాలు చెల్లించాలి

విశాలాంధ్ర పెనుబల్లి : ఫీల్డ్ అసిస్టెంట్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రీ సదానంద రావు డిమాండ్ చేశారు . ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాలు లేకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని నిత్యం ప్రజల్లో ఉండి ఉపాధి హామీ కూలీలతో పని చేయిస్తూ , ప్రజాక్షేత్రం లో ఉండే మాకు జీతాలు ఇవ్వకుండా జాప్యం చేయడం బాధాకరం అన్నారు. జీతాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని, ఈ విషయంపై రాష్ట్ర కమిటీ ఉపాధి హామీ కమిషనర్ కు వినతి పత్రం ఇచ్చిన స్పందన కరువైందని అన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్న మా గూడు ఆలకించే వారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లె పకృతి వనం, గ్రామ పారిశుధ్య పనుల్లో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు కీలక భూమిక పోషిస్తున్నారని, ఇలాంటి వారికి జీతభత్యాలు ఆపటం ధర్మం కాదని ఆయన పేర్కొన్నారు.

భూభారతి చట్టంపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర-వనపర్తి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి చట్టం పై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టర్ తన ఛాంబర్ లో కలెక్టరేట్ సూపరింటెండెంట్ లతో భూ భారతి చట్టం పై రైతులకు అవగాహన కల్పించడం పై సమీక్ష నిర్వహించారు. భూ భారతి చట్టం- 2025 పై రైతులకు అవగాహన కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. ఏప్రిల్, 17 నుంచి మండలాల వారీగా రైతు వేదికల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి చట్టం పై అవగాహన, అనుమానాలను నివృత్తి చేయాలని సూచించారు. ధరణి స్థానంలో వచ్చిన భూ భారతి చట్టం- 2025 ప్రకారం ఒకేరోజు రిజిస్ట్రేషన్ తో పాటు మ్యుటేషన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అయితే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసే ముందు సంబంధిత భూమి సర్వే చేసే మ్యాప్ తయారు చేయడం జరుగుతుంది. తహసిల్దార్ ద్వారా భూ రిజిస్ట్రేషన్ అయిన వెంటనే మ్యుటేషన్ చేస్తారని తద్వారా నెలల తరబడి మ్యుటేషన్ కొరకు తిరగటం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవడం ఉండదన్నారు.

నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక

విశాలాంధ్ర బ్యూరో పెద్దపల్లి : ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపికకు కట్టుదిట్టమైన కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఇందిరమ్మ ఇండ్ల పథకం పై అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలు ఎటువంటి పొరపాట్లు ఉండటానికి వీలు లేదని, మనకు వచ్చిన దరఖాస్తులలో అత్యంత నిరుపేదలకు మాత్రమే మొదటి విడతలో ఇండ్లు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు పై ప్రత్యేక ప్రాధాన్యత కేటాయించారని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రభుత్వం మంజూరు చేసిన 3,500 ఇండ్లలో పైలెట్ ప్రాజెక్టు కింద మండలాలు ఎంపిక చేసిన గ్రామాలలో కొన్ని ఇండ్లు మంజూరు చేశామని, మిగిలిన ఇండ్లను గ్రామాలు, మున్సిపల్ వార్డుల వారీగా మంజూరు చేసేందుకు అలాట్మెంట్ తయారు చేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు అర్హత ఉండి ఇంటి స్థలం ఉన్న దరఖాస్తుల సంఖ్య ప్రాతిపదికగా సదరు గ్రామాలకు, వార్డులకు ఇండ్ల కేటాయింపు పూర్తి చేయాలని అన్నారు. అనంతరం గ్రామాలు, వార్డులలో ఇందిరమ్మ కమిటీలతో సమావేశం నిర్వహించి, అర్హుల జాబితాలో నుంచి మొదటి విడత మంజూరు చేసేందుకు గ్రామానికి అలాట్మెంట్ చేసిన ఇండ్ల సంఖ్యకు 25 శాతం బఫర్ తో లబ్ధిదారుల ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. ఏప్రిల్ 21 లోపు ఇందిరమ్మ కమిటీల నుంచి 25 శాతం బఫర్ తో ప్రతి గ్రామానికి వార్డుకు అలాట్ చేసిన ఇందిరమ్మ ఇండ్ల కు లబ్ధిదారుల జాబితా వివరాలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో ఎక్కడైనా ఇందిరమ్మ కమిటీల నుంచి సమాచారం రాకపోతే సంబంధిత ఎమ్మెల్యేతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ ఎంపీడీఓ లకు సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, సురేష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. కాళిందిని, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, జడ్పీ సీఈఓ నరేందర్, ఎంపిడిఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

సంపాదకీయం

వక్ఫ్ చట్టం సాకుతో బెంగాల్ కలహాలు

పార్లమెంటులో తగినంత మెజారిటీ ఉన్నందువల్ల వక్ఫ్ బిల్లుకి ఆమోదం వచ్చేసింది. రాష్ట్రపతి ఆమోద ముద్ర కూడా పడింది. అంటే వక్ఫ్ చట్టం అమలులోకి వచ్చినట్టే. వక్ఫ్ చట్టం మీద ఎవరి వాదనలు వారికి ఉండొచ్చు. పార్లమెంటు ఉభయ సభల్లో ఈ బిల్లుపై చర్చ జరుగుతున్నప్పుడు ప్రతిపక్షాల వారు చాలా వీరోచితంగా వ్యతిరేకత వ్యక్తం చేశారు. అయినా పార్లమెంటులో మెజారిటీ ఉన్నందువల్ల ఈ బిల్లును సునాయాసంగా ఆమోదింప చేసుకుంది. ఉభయ సభల్లోనూ తెల్లవారే దాకా చర్చోపచర్చలు జరిగాయి. ఇదంతా ఒక ఎత్తు. వక్ఫ్ చట్టం ఆమోదింప చేయడంలో బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చూపిన మంకుపట్టు అపూర్వమైంది. ప్రతిపక్షాల ఒక్క అభ్యంతరాన్ని అయినా అంగీకరించడానికి మోదీ ప్రభుత్వం ఒప్పుకోలేదు. ఈ బిల్లుకి రాష్ట్రపతి ఆమోదం తెలిపిన తరవాత కూడా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ చట్టాన్ని తమ రాష్ట్రంలో అమలు చేయబోమని తెగేసి చెప్పారు. ఇందులోని సాధ్యాసాధ్యాలు, ఉచితానుచితాల గురించి ఎంతైనా చర్చించవచ్చు. కానీ సాక్షాత్తు ముఖ్యమంత్రి ఈ చట్టాన్ని అమలు చేయబోమని హామీ ఇచ్చిన తరవాత బెంగాల్‌లో ముఖ్యంగా ముర్షీదాబాద్ లాంటి ప్రాంతాలలో కలహాలు చెలరేగడం వైపరీత్యమే. గత వారం ఆ కలహాలు కొనసాగిన తీరునుబట్టి చూస్తే వాటికి వక్ఫ్ బిల్లుతో ఏ మాత్రం ప్రమేయం ఉన్నట్టు కనిపించడం లేదు. ఒక కుట్ర ప్రకారమే రెండు పక్షాల వారూ కూడబలుక్కున్నట్టు మత కలహాలను ప్రేరేపించారు. సీపీఐ(ఎం) కు చెందిన 70 ఏళ్ల హరగోవింద్ దాస్‌ను, 40 ఏళ్ల ఆయన కుమారుడు చందన్ దాస్‌ను మతతత్వ వాదులు అడ్డంగా నరికేశారు. అంటే ఇవి కేవలం మత కలహాలు కావని, ఈ కలహాలు మత విద్వేషంవల్ల చెలరేగినవి కావని అర్థం అవుతూనే ఉంది. మంగళవారం నాటికి పరిస్థితి దారికొచ్చినట్టు కనిపిస్తున్నా ఉద్రిక్తత మాత్రం సడలలేదు. ఈ దాడులను పసిగట్టడంలో మమతా బెనర్జీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. పోలీసుల వైఫల్యం అంతకన్నా భీకరంగా కొట్టొచ్చినట్టు కనిపించింది. చివరకు సైన్యం మీద కూడా దాడులకు తెగబడ్డారంటే దుండగులకు ఉన్న అండను ఏ మాత్రం తక్కువ అంచనా వేయడానికి వీలు లేదు. దాడి చేసింది ముస్లింలన్న ఆరోపణ గట్టిగానే వినిపిస్తోంది. అందులో నిజానిజాలు సమగ్ర, నిష్పాక్షిక దర్యాప్తులో కాని తేలవు. ముర్షీదాబాద్‌లో దుండగులు ముస్లింలు అంటున్నా వారు ముస్లింల మీద కూడా దాడులకు దిగారు. వారి దుకాణాలను, వ్యాపార సంస్థలను సర్వనాశనం చేశారు. హిందువులు, ముస్లింలు కూడా ఈ కలహాలకు స్థానికేతరులే కారణం అంటున్నారు. పోలీసులు ఆ దుండగులతో కుమ్మక్కయ్యారని, చివరకు సరిహద్దు భద్రతా దళాలవారు (బీఎస్ఎఫ్) కూడా భీకర అల్లర్లకు పాల్పడిన వారితో కుమ్మక్కు కావడమే కాక వారికి బాహాటంగా మద్దతిచ్చిందన్న ఆరోపణలు ఉన్నాయి. మత కలహాలు జరిగిన ప్రతి చోటా సాధారణంగా ఇతర మతానికి చెందిన తమ పొరుగువారిపై దాడి చేయరు. అందులో ఆ ప్రాంతానికి చెందని వారి పాత్రే ప్రధానంగా ఉంటుంది. ఈ ధోరణి ప్రతి మత కలహంలోనూ గమనించవచ్చు. అంటే మతకలాహాలు కృత్రిమంగా సృష్టించేవే తప్ప రెండు మతాల వారి మధ్య వైషమ్యాలు ఎంత మాత్రం కారణం కాదని స్పష్టం అవుతోంది.

ఎంతటి కుతంత్రాలకైనా దిగజారి బెంగాల్ లో అధికారం సంపాదించాలని బీజేపీ పట్టుదలతో ఉంది. అధికారం సంపాదించేదాకా ఆర్ఎస్ఎస్, బజరంగ్ దళ్ కార్యకర్తలను బీజేపీ పదాతి దళాలుగా ఉపయోగిస్తూనే ఉంటుంది. అవసరమనుకున్న చోట్ల మతకలహాలు రెచ్చగొడ్తుంది. ఇది బీజేపీ అత్యంత కుశలతతో అనుసరిస్తున్న వ్యూహం. బెంగాల్‌లో ఇది ఇప్పుడు వెర్రి తలలు వేసింది. మమతా బెనర్జీ మత కలహాలను నివారించలేకపోయారని ఆమెను అప్రదిష్ట పాలు చేసి ఎలాగైనా ఆ రాష్ట్రంలో అధికారంలోకి రావాలన్నది బీజేపీ దీర్ఘకాలిక పన్నాగం. సోమవారం కనీసం వంద చోట్ల శాంతి సంఘాలు ఏర్పాటు చేసి శాంతి పునరుద్ధరణకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. జనాగ్రహంలో ఎక్కడా ముస్లింలపై విద్వేషంగానీ, హిందువులపై విద్వేషంగానీ కనిపించడం లేదు. పోలీసుల మీద జనం తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నారు. పోలీసుల పక్షపాత ధోరణిని నివారించడంలో మమతా బెనర్జీ విఫలమయ్యారనడానికి ఈ ఒక్క జనాభిప్రాయం చాలు. హింసాకాండను అదుపు చేయడంలో పోలీసుల నిష్క్రియాపరత్వాన్ని తృణమూల్ కాంగ్రెస్ నాయకులు కూడా దుయ్యబడుతున్నారు. ప్రతిపక్షాలు విమర్శించడం సహజం. పోలీసులు సవ్యంగా ప్రవర్తించి ఉంటే ఇంతటి ఘోర హింసాకాండ జరిగేది కాదని తృణమూల్ నాయకుడు హుమయూన్ కబీర్ అన్నాడంటే పరిస్థితి ఎంతగా దిగజారిందో తెలుస్తూనే ఉంది. "ఈ దారుణానికి కారణం ఎవరో మాకు తెలియదు. కానీ ఒక యువ బృందం ఈ దారుణకాండలో అగ్రభాగాన ఉంది. వారిని మేం గుర్తించలేం. కానీ వారు అంతమంది జనాన్ని ఎలా పోగు చేయగలిగారో అంతుబట్టడం లేదు" అని ఒక ముస్లిం యువకుడు వ్యాఖ్యానించాడంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో ఊహించవచ్చు. ముర్షీదాబాద్ ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట. ఆ ప్రాంతంలో ముస్లింలు అధిక సంఖ్యాకులు. అక్కడ పేదరికం, అభివృద్ధి లేమి ఎక్కువ. అందుకే ఇటీవల అక్కడ రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఒకప్పుడు తృణమూల్ కాంగ్రెస్ లో అగ్రనాయకుల్లో ఒకడైన సువేందు అధికారి బీజేపీలో చేరిన తరవాత మత విద్వేషాలు రెచ్చగొడ్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో నుంచి వచ్చిన వలస కార్మికులు పెద్ద బెడదగా మారారంటున్నారు. కేంద్ర మంత్రి సుకాంత మజుందార్ రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారు. సామాజిక మాధ్యమాలలో విష ప్రచారం చేస్తున్నారు. బెంగాల్‌లో హిందువులు పండగలు జరుపుకోనివ్వడం లేదని నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. వక్ఫ్ బిల్లుకు నిరసన పేరుతో జిహాదీ బృందాలు దాడులు చేస్తున్నాయని నకిలీ ఫొటోలను సుకాంత మజుందార్ ప్రచారంలో పెడ్తున్నారు. ఇతర రాష్ట్రాలలో జరిగిన విధ్వంసాన్ని బెంగాల్ లో జరిగినట్టు నమ్మించడానికి ప్రయత్నిస్తున్నారు. కొన్ని దశాబ్దాల నుంచి ముర్షీదాబాద్ లో ఆర్ఎస్ఎస్ పట్టు సాధించింది. ఈ మధ్యకాలంలో ఆ పట్టు మరింత బిగిసింది. దీనికి ప్రధాన కారకుడు స్వామీ ప్రదీప్తానందగా చెలామణి అయ్యే కార్తీక్ మహరాజ్ అని అంటున్నారు. ఆయన భారత్ సేవా సంఘ నాయకుడట. ఆయనకు మోదీ ప్రభుత్వం ఈ ఏడాది పద్మశ్రీ అవార్డు కూడా ఇచ్చింది. హిందువులు బహుళత్వాన్ని విడనాడి "తీవ్రమైన హిందుత్వ" అనుసరించాలని అంటూ ఉంటారు. 2023లో కార్తీక పూజ సందర్భంగా జరిగిన కలహాలకు ఆయనే కారణం అంటారు. మరో వేపు ముర్షీదాబాద్‌లో ముస్లిం మతతత్వవాదుల ప్రాబల్యం కూడా పెచ్చరిల్లుతోంది. వక్ఫ్ చట్టం వీరికి మంచి సాకుగా అందివచ్చింది. ముర్షీదాబాద్ జిల్లాల్లో ముస్లిం మతతత్వం పెరుగుతున్న సూచనలు ఉన్నప్పుడు మమతా బెనర్జీ ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం దారుణం.

తమిళనాట బీజేపీని మైనారిటీలు నమ్ముతారా?

ఎం కోటేశ్వరరావు

తమిళనాడులో చరిత్ర పునరావృతమైంది. అధికారం కోసం మరోసారి అన్నాడీఎంకేతో బీజేపీ ఎన్నికల ఒప్పందం చేసుకుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో ఏప్రిల్ 11న మైత్రీ బంధాన్ని ప్రకటించారు. ఈ పరిణామంతో ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలై పదవి మాత్రం పోయింది. రాష్ట్ర బీజేపీ సారథిగా మరొకరిని పెట్టాలని అన్నాడీఎంకే విధించిన షరతుకు బీజేపీ తలొగ్గింది. గతంలో అన్నాడీఎంకే నేతగా ఉన్న నైనార్ నాగేంద్రన్ను రాష్ట్ర శాఖ అధ్యక్షునిగా బీజేపీ ఎంపిక చేసింది. 2019 లోక్‌సభ ఎన్నికలు, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పోటీ చేశాయి. తరువాత అన్నామలై బీజేపీ అధ్యక్ష పదవి స్వీకరించిన తరువాత మాజీ సీఎం అన్నాదురై, జయలలిత, పళనిస్వామిని పదే పదే రెచ్చగొట్టే విధంగా విమర్శించారు. ఆయన వ్యాఖ్యలతో మైనారిటీల ఓట్లు పోతాయని కూడా అన్నాడీఎంకే భయపడింది. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైసీపీని ఓడించేందుకు ఉప్పూ నిప్పుగా ఉన్న తెలుగుదేశం, జనసేన, బీజేపీ చేతులు కలిపి విజయం సాధించటంతో అదే ఫార్ములాతో తమిళనాడులో కూడా గెలవాలని రెండు పార్టీల నేతలు కొంతకాలంగా ఆలోచనలు చేస్తున్నారు. అడ్డుగా ఉన్న అన్నామలైని తప్పించారు. అధికారం కోసం బీజేపీ దేనికైనా సిద్ధపడుతుంది. విలువలు, వలువల గురించి కబుర్లు చెప్పే ఆ పార్టీకి ఇతరులకు తేడా లేదు. తెలంగాణాలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసేవరకు అధ్యక్షుడిగా బండి సంజయ్‌ను కొనసాగిస్తామని స్వయంగా ప్రకటించిన పార్టీ సరిగ్గా ఎన్నికలకు ముందు పదవి నుంచి తప్పించి కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డిని కూర్చోపెట్టింది. ఏడాదిన్నర కావస్తున్నా కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోలేకపోయింది. వ్రతం చెడ్డా ఫలం దక్కలేదన్నట్లు బీజేపీ పరిస్థితి తయారైంది. బండి సంజయ్‌ను తొలగించినా మిన్నువిరిగి మీద పడలేదు, ఇప్పుడు అన్నామలైని తొలగించినా అంతే. నోటి దురుసులో ఇద్దరూ ఇద్దరే. తమిళనాడులో ఒక ప్రాంతీయ పార్టీకి తోకగా బీజేపీ తయారైంది. ఆంధ్రప్రదేశ్‌లో మాదిరి మధ్యవర్తి పవన్‌కళ్యాణ్ లాంటి వారెవరూ లేకపోతే నేరుగా కేంద్ర బీజేపీ నాయకత్వం బేరం కుదుర్చుకుంది. ఇటీవల ఆమోదించిన వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకించిన వారిని ముస్లిం సంతుష్టీకరణ పార్టీలుగా వర్ణించింది. వాటిలో అన్నాడీఎంకే ఒకటి. శుభకార్యానికి వెళుతూ పిల్లిని చంకన పెట్టుకుపోయినట్లు ఇప్పుడు బీజేపీ నేతలను చంకనెక్కించుకొని ముస్లింల ఓట్లను అర్థించటం ఆ పార్టీకి పెద్ద పరీక్ష. సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) ని ఉగ్రవాద పార్టీ అని బీజేపీ వర్ణించింది. గత లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే మద్దతుతో అది ఒక స్థానానికి పోటీ చేసింది. ఇప్పుడు ఎస్‌డీపీఐ కూటమిలో భాగస్వామిగా కొనసాగితే బీజేపీ దాని అభ్యర్థులను ఎలా బలపరుస్తుంది, సమర్థిస్తుందన్నది ప్రశ్న. ఎవరేమనుకుంటే మాకేటి సిగ్గు ! మమ్మల్ని విమర్శించే వారేమైనా నాలుగు ఓట్లు వేయిస్తారా, ఒకటో అరో సీటు తెప్పిస్తారా !! అనుకున్నట్లుగా ఉంది. రాష్ట్రానికి పాచిపోయిన లడ్లు ఇచ్చారంటూ ధ్వజమెత్తి వాటినే మహా ప్రసాదంగా స్వీకరించిన పవన్‌కల్యాణ్ మాదిరి అన్నాడీఎంకే నేత పళనిస్వామి కూడా తమిళనాడుకు బీజేపీ చేసిన అన్యాయాల గురించి నిన్నటి వరకు ధ్వజమెత్తారు. ఆకస్మికంగా అదే పార్టీతో చేతులు కలిపితే తమిళ తంబీలు ప్రశ్నించకుండా ఉంటారా ? అంతకు ముందు బీజేపీతో కలసి ఉన్నప్పుడు సంకీర్ణ ధర్మంగా సీఏఏను సమర్థించామని విడిపోయిన తరువాత విమర్శించామని చెప్పుకున్న ఆ పెద్దమనిషిని మైనారిటీలు నమ్ముతారా ? అదే తర్కం ప్రకారం కొద్ది రోజుల క్రితం వ్యతిరేకించిన వక్ఫ్ చట్టానికి ఇప్పుడు జైకొట్టరనే హామీ ఏమిటి? సినిమా నటుడు విజయ్ నాయకత్వంలోని టీవీకే పార్టీతో చేతులు కలపాలని తొలుత అన్నాడిఎంకె భావించి పావులు కదిపింది. విజయ్ అంగీకరించకపోవటంతో డీఎంకేను సొంతంగా ఓడించలేమని గ్రహించి బీజేపీని కలుపుకుంది. బీజేపీతో తెగతెంపులు చేసుకున్నా 2024లో మైనారిటీల ఓట్లు రాలేదని అందువలన తిరిగి ఆ పార్టీతో చేతులు కలిపినా నష్టం లేదన్నది అన్నాడీఎంకే అంతర్గత ఆలోచన అని కూడా చెబుతున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే, బీజేపీ విడివిడిగా పోటీ చేశాయి. ఈ రెండు కూటముల ఓట్లు కలిస్తే 13 లోక్‌సభ నియోజక వర్గాలలో మెజారిటీ వచ్చిందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో ముందుగానే ఒప్పందం చేసుకొని కలసి పోటీ చేస్తే అధికారం ఖాయమనే అభిప్రాయంతో అవి కలిశాయి. లోక్‌సభ ఓటింగ్ వివరాలను చూసినపుడు త్రిముఖ పోటీ జరిగింది. డీఎంకే నాయకత్వంలోని కూటమి మొత్తం 39 స్థానాలను గెలుచుకుంది. ఇండియా కూటమికి 46.97, అన్నాడీఎంకే కూటమి 23.05, బీజేపీ కూటమి 18.28, ఎన్‌టీకే అనే ప్రాంతీయ పార్టీ 8.2 శాతం చొప్పున ఓట్లు పొందాయి. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీ చూస్తే మొత్తం 234కు గాను ఇండియా కూటమి 221, అన్నాడీఎంకే 10, బీజేపీ కూటమి మూడు సీట్లలో గెలుపొందాయి. అయితే బీజేపీకి ఒక్క సీటులోనూ మెజారిటీ రాలేదు, దానితో కలసి పోటీ చేసిన పీఎంకే మూడు చోట్ల ఆధిక్యత కనపరిచింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు నరేంద్రమోదీ తమిళనాడును ఏడుసార్లు సందర్శించినా ఫలితం దక్కలేదు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పరస్పరం ఎలా తిట్టుకున్నాయో 2019 ఎన్నికల్లో చూశాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుసరించిన అప్రజాస్వామిక, కక్షపూరితమైన, బీజేపీకి లొంగుబాటు వైఖరిని, ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడిని అక్రమంగా అరెస్టు చేయటం వంటి తీరును డీఎంకే నేత ఎంకే స్టాలిన్ అనుసరించలేదు. అన్నింటికీ మించి తమిళనాడుకు చేసిన అన్యాయం, డీలిమిటేషన్, హిందీని బలవంతంగా రుద్దేందుకు పూనుకున్న బీజేపీని ఎలాంటి తొట్రుపాటు లేకుండా వ్యతిరేకించి ఎండగడుతున్నారు. అందువలన ఆంధ్రప్రదేశ్ మాదిరి ఫలితాలను ఆశిస్తే అది అత్యాశే అవుతుంది.

తీవ్ర సంక్షోభంలో రొయ్యలసాగు!

బొల్లిముంత సాంబశివరావు

రొయ్యలసాగులో భారతదేశం ప్రపంచంలో రెండవ స్థానంలో ఉంది. చేపల ఉత్పత్తిలో మూడవ స్థానంలో ఉంది. 2021-22లో చేపల ఉత్పత్తి 16.24 మిలియన్ టన్నులు. ఇందులో ఆక్వా సాగు నుంచే 12.12 మిలియన్ టన్నులు ఉంది. ప్రపంచ మత్స్య ఉత్పత్తిలో భారతదేశం 10 శాతం పైగా ఉంది. ఆక్వా రంగం ప్రాథమిక స్థాయిలో 2.8 కోట్లకు పైగా మత్స్యకారులు ఉపాధిని పొందుతున్నారు. కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యం భారత ప్రభుత్వానికి లభిస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌లో 3.9 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతున్నది. ఇందులో 1.8 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. మరో రెండు లక్షల ఎకరాల్లో చేపల సేద్యం జరుగుతున్నది. ఈ సేద్యం కోసం 63,334 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. మొత్తం లక్షా 35 వేల మంది ఆక్వా సాగు చేస్తున్నట్లు ఈ క్రాపింగ్ ద్వారా తెలుస్తున్నది. వీరిలో 2.5 ఎకరాలలోపు సాగు చేస్తున్న రైతులు 95,277 మందికాగా, 2.5 నుంచి 5 ఎకరాల లోపు సాగు చేస్తున్న వారు 22,358 మంది ఉన్నారు. 5 నుంచి 10 ఎకరాలు సాగు చేస్తున్నవారు 11,809 మంది ఉంటే, 10 ఎకరాలకన్నా ఎక్కువ సాగు చేస్తున్న వారు 6,398 మంది ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు తెలుపుతున్నాయి. ప్రతి సంవత్సరం రాష్ట్రానికి 18 లక్షల టన్నుల ఆక్వా ఉత్పత్తుల ద్వారా 66 వేలకోట్ల ఆదాయం వస్తుంది. భారతదేశం నుంచి జరిగే ఆక్వా ఎగుమతుల్లో 40% ఏపీ నుంచే జరుగుతున్నది. రాష్ట్రం నుంచి ఎక్కువగా చైనా, అమెరికా, ఐరోపా దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

రొయ్యల చెరువుల ఫలితంగా తీర ప్రాంత గ్రామాల భూములు ఉప్పు నీటి భూములుగా మారటంతో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. తాగునీటి సమస్యతో పాటు రొయ్యల చెరువులు తీర ప్రాంత ప్రజల జీవితాలను అల్లకల్లోలంగా మార్చింది. నష్టాల పాలైన చాలా మంది చిన్న, సన్నకారు రైతులు ఉన్న ఆస్తులు అమ్మకోవాల్సి వచ్చింది. మరొక వైపున కొద్దిమంది ఆక్వా సాగులో గుత్తాధిపత్యం వహించారు. సాంకేతిక పరికరాలతో అధిక రొయ్యల ఉత్పత్తి సాధించారు.

ఆక్వా సాగు ఖర్చులు వేగంగా పెరిగాయి. అందుకు దాణాధరల పెరుగుదల, కరెంట్ చార్జీలే కారణం. ఈ పెరుగుదల చిన్న సాగుదార్లకు భారంగా మారినా రొయ్యల ధర అనుకూలంగా ఉండటం వలన సాగును కొనసాగించారు. రొయ్యల సాగు ఎగుమతులపై

ఆధారపడి ఉంది. మొత్తం సాగులో 90 శాతం ఎగుమతి జరుగుతున్నది. ఆంధ్రప్రదేశ్‌లో 27 ప్రాసెసింగ్ యూనిట్లు రొయ్యలను ఎగుమతి చేస్తున్నాయి. దేశీయ సాగుదార్లకు నాణ్యమైన వనామీ రొయ్య పిల్లలు లభ్యం కావటంలేదు. ఈ విషయంలో ఈక్వెడార్, ఇండోనేషియా, భారత్ కన్నా చాలా ముందు ఉన్నాయి. అందువల్ల భారతదేశం కన్నా దిగుబడి ఎక్కువ ఉంది. ఫలితంగా భారత్ కన్నా ఆక్వా ఉత్పత్తులను తక్కువ ధరలకు ఎగుమతి చేస్తున్నాయి. ఈ దేశాల నుంచి మన దేశ సాగుదార్లు పోటీ ఎదుర్కొంటున్నారు. 2023-24లో రొయ్యల ఎగుమతి ద్వారా భారతదేశం 5.2 బిలియన్ల అమెరికా డాలర్ల ఆదాయం పొందింది. రాష్ట్ర జీడీపీలో ఆక్వా రంగం కీలక పాత్ర ఉంది. 2023- 24 ఆర్థిక సంవత్సరంలో దేశంలో కోటి 84 వేల టన్నుల మత్స్య ఉత్పత్తులు జరగగా, 51.58 లక్షల టన్నుల ఉత్పత్తితో ఆంధ్రప్రదేశ్ మొదటిస్థానంలో ఉంది. రొయ్యల ఉత్పత్తిలో 76%, చేపల ఉత్పత్తిలో 28% ఏపీలోనే జరుగుతున్నది. 2023- 24 ఆర్థిక సంవత్సరంలోనే భారతదేశం నుంచి అమెరికాకు 2.55 బిలియన్ డాలర్ల సముద్ర ఆహార ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. అందులో 92% రొయ్యలే. వ్యవసాయ అనుబంధ రంగాల స్థూల ఆదాయ నిష్పత్తిలో 9.15% ఆక్వా రంగం నుంచే వస్తున్నది. రొయ్యల దాణా రేట్లు నిరంతరం పెరుగుతూ ఉంటే, గత మూడు సంవత్సరాలుగా రొయ్యల ధర తగ్గుతూ ఉంది. 2022 లో 30 కౌంట్ రొయ్యధర 600 నుంచి 400 లకు పడిపోయింది. 60 కౌంట్ ధర 400 నుంచి 250 రూపాయలకు, 80 కౌంట్ 310 నుంచి 220 రూపాయలకు ధర తగ్గింది. ఫలితంగా రొయ్య సాగుదార్లు తీవ్రంగా నష్టపోయారు. ధరలు తగ్గి నష్టపోతున్న తమను ఆదుకోవాలని రొయ్య సాగు రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వం రొయ్యలకు మద్దతు ధర ప్రకటించి రైతులకు మేలు చేసినట్లు చెప్పుకుంది. వంద కౌంట్ కిలో రొయ్యల సాగుకి 270 సాగు ఖర్చుగా ఉంటే, వైసీపీ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర 210 రూపాయలు మాత్రమే. ఈ మద్దతు ధర రైతులకు ఏమాత్రం ప్రయోజనకరంగా లేదు.

వైసీపీ ప్రభుత్వం రొయ్యల సాగు రైతులకు విద్యుత్ యూనిట్‌కి 1.50 రూపాయలకే ఇస్తున్నట్లు ప్రకటించి దాన్ని ఆక్వా సాగు రైతులందరికీ సరఫరా చేసింది. ఏడాది గడిచిన తర్వాత చిన్న రైతులకే దాన్ని పరిమితం చేసి మిగతా రైతుల నుంచి యూనిట్‌కు 3.50 రూపాయలు వసూలు చేసింది. ఒక ఎకరా చెరువుకు నెలకు 7,700 యూనిట్లు అవసరం. యూనిట్‌కి 3.50 రూపాయల వలన నెలకు 26 వేలు చెల్లించాలి. ఇది ఆక్వా రైతులకు చాలా భారంగా మారింది. అసలే సంక్షోభంలో ఉన్న ఆక్వా సాగుదారులను ట్రంప్ విధించిన సుంకాలు మరింత సంక్షోభంలోకి నెట్టింది. భారతదేశం నుంచి దిగుమతి చేసుకునే రొయ్యలపై 27% సుంకాన్ని విధించాడు. ఇదికాక భారతదేశ రొయ్యలపై అమెరికా యాంటి డంపింగ్ డ్యూటీతోపాటు 5.7% కౌంటర్ వైలింగ్ సుంకం వసూలు చేస్తున్నది. ఈ సుంకాలన్నీ కలిపి 35% పైగా ఉన్నాయి. మొత్తం సుంకాలను కలుపుకుంటే లక్షరూపాయల విలువచేసే రొయ్యలపై 35 వేలదాకా సుంకంకట్టాలి. దీనికి ప్యాకింగ్ ఖర్చులు అదనం. భారతదేశం నుంచి దిగుమతి చేసుకునే రొయ్యలపై 27% సుంకం విధించిన అమెరికా ఈక్వెడార్ వంటి ఎగుమతిదారులపై 10% సుంకం మాత్రమే విధించింది. వియత్నాం, థాయిలాండ్, జపాన్ దేశాలు, భారతదేశం నుంచి సీఫుడ్ కొనుగోలు చేసి వాటిని ప్రాసెస్ చేసి అమెరికాకు ఎగుమతి చేస్తాయి. ఇప్పుడు అమెరికా విధించిన సుంకం వల్ల ఆ దేశాలు భారత్ నుంచి ఆర్డర్లు రద్దుచేసుకున్నాయి. మరొక వైపు రైతుల నుంచి సేకరణను ఎగుమతిదారులు రద్దు చేసుకున్నారు. యూరోపియన్ యూనియన్‌లో భారతఎగుమతిదారులు 50% తనిఖీరేట్లు, 4 నుంచి 7% దిగుమతి సుంకంతో సహా నాన్ టారిఫ్ అడ్డంకులు ఎదుర్కొంటున్నారు. వియత్నాం వంటి దేశాలు యూరోపియన్ దేశాలతో ఫ్రీట్రేడ్ అగ్రిమెంట్ కింద జీరో డ్యూటీని పొందాయి. దీనివల్ల వియత్నాం వంటి దేశాలు యూరోపియన్ మార్కెట్లను ఆక్రమించాయి.

అమెరికా సుంకం పేరుతో భారత వ్యాపారులందరూ సిండికేట్‌గా ఏర్పడి రొయ్యల కొనుగోలు ధరలు తగ్గించారు. ఫలితంగా రొయ్య సాగుదార్లు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. నష్టాలతో ఆక్వా సాగు చేయలేమని పశ్చిమగోదావరి జిల్లాలో ఆక్వా సాగుకి పంట విరామం ప్రకటించారు. ఆక్వా సంక్షోభంపై ముఖ్యమంత్రి చంద్రబాబు కమిటీవేసి, రొయ్య రైతులను ఆదుకోవాలని కేంద్రానికి లేఖ రాయటం తప్ప ఎటువంటి చేయూతను ప్రకటించలేదు. ఏ పంట అయినా దేశ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి జరిగినప్పుడే, ఆ పంట సాగుచేసే రైతుల సేద్యం ఒడుదుడుకులు లేకుండా సాగుతుంది. అందుకు భిన్నంగా ఉన్న పంటలన్నీ నేడు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. నేటి ఆక్వా సంక్షోభం అందులో భాగమే. దేశ ప్రజల కోసం కాకుండా, వ్యాపార లాభాల కోసం విదేశాలకు ఎగుమతే లక్ష్యంగా నేడు దేశంలో విచ్చలవిడి ఆక్వా సాగు జరుగుతున్నది.

ఫలితంగా కొన్ని పంటల దిగుబడులు గణనీయంగా తగ్గి విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. అంతే కాకుండా ఆక్వా సాగువల్ల అనేక పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయి. దేశ ప్రజలకు ఆహారాన్ని అందించే విధంగా దేశంలో ఆక్వా సాగు పరిమితం కావాలి, దాణా ఖర్చులు తగ్గే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవటం లేదా సబ్సిడీ ఇవ్వటం చేయాలి, యూనిట్ కరెంటు రూపాయిన్నరకే అందించాలి, దేశీయంగానే ఎక్కువగా రొయ్యల విక్రయం జరగాలి. అప్పుడే ఆక్వా సాగు సంక్షోభం నుంచి బయటపడుతుంది.

రైతుకూలీసంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యులు
సెల్: 9885983526

తెలంగాణలో తొలి రాజకీయ పాఠశాల

ఆర్వీ రామారావ్

కోస్తా ఆంధ్ర ప్రాంతంలోని కొన్ని చోట్ల 1930 లో రాజకీయ పాఠశాలలు జరిగినట్టే తెలంగాణలో కూడా 1939 మే 23 నుంచి జూన్ 13 వరకు 22 రోజుల పాటు తునికిపాడులో కూడా రాజకీయ పాఠశాల జరిగింది. దీనికి 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. రైతు సంఘం పేరుతో కృష్ణాజిల్లా పార్టీ విభాగం ఈ తరగతులను నిర్వహించింది. తునికిపాడు ఖమ్మం జిల్లా మధిరకు ఆరు కిలోమీటర్ల దూరంలో కృష్ణాజిల్లా సరిహద్దుల్లో ఉంది. అప్పటికి తెలంగాణలో కమ్యూనిస్టు పార్టీ లేదు. కానీ కామ్రేడ్స్ అసోసియేషన్ మాత్రం ఉండేది. కామ్రేడ్స్ అసోసియేషనే కమ్యూనిస్టు పార్టీగా పని చేసింది. డా. రాజ్ బహదూర్ గౌర్, మఖ్దూం మొహియుద్దీన్, ఆలం కుందుమిరి, చంద్రగుప్త చౌదరి మొదలైన వారు ఈ కామ్రేడ్స్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. ఇది ఆంధ్ర మహాసభలోనూ, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలోనూ ప్రధాన పాత్ర నిర్వర్తించింది.

కోస్తా ఆంధ్ర ప్రాంతంలో ఈ రాజకీయ శిక్షణా తరగతులు బహిరంగంగానే నిర్వహించారు. కామ్రేడ్స్ అసోసియేషన్ ఆంధ్ర మహాసభలో కీలక పాత్ర నిర్వర్తించింది. తెలంగాణలో మాత్రం నిజాం విధానాలవల్ల బహిరంగంగా రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించడానికి వీలు లేనందువల్ల తెలంగాణ ప్రాంతం నుంచి విద్యార్థులు రహస్యంగా ఈ తరగతులకు హాజరయ్యారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి అప్పటికి కమ్యూనిస్టు పార్టీ సభ్యులు కారు. కానీ ఆంధ్ర మహాసభలో చురుకుగా పాల్గొనే వారు. రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి కమ్యూనిస్టు పార్టీ సభ్యులు కానప్పటికీ

సర్వదేవభట్ల రామనాథం

చిర్రావూరు లక్ష్మీ నరసయ్య

తెలంగాణ రైతాంగ స్థితిగతుల మీద పాఠాలు చెప్పారు. అదే కాలంలో ఖమ్మంలో చండ్ర రాజేశ్వరరావు కొద్ది మందికి రహస్యంగా క్లాసులు బోధించారు.

అప్పటికి హైదరాబాద్, వరంగల్, నల్లగొండ జిల్లాల్లో కమ్యూనిస్టు పార్టీ లేదు. కాని ఖమ్మంలో పార్టీ వ్యవహారాలు రహస్యంగా కొనసాగేవి. కమ్యూనిస్టు పార్టీ తరఫున చిర్రావూరి లక్ష్మీ నరసయ్య, పెరవల్లి వెంకట రమణయ్య, పెండ్యాల సత్యనారాయణ, వట్టికొండ సోదరులు, వాసిరెడ్డి వెంకటపతి సహకారంతో సర్వదేవభట్ల రామనాథం కమ్యూనిస్టు కార్యకలాపాలను నిర్వహిస్తూ ఉండేవారు. అదే సమయంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వందేమాతరం ఉద్యమం సాగుతూ ఉండేది. స్టేట్ కాంగ్రెస్ ఏర్పడినా నిజాం ప్రభుత్వం దాన్ని వెంటనే నిషేధించినా రహస్యంగా పని చేసేది. తెలంగాణలో కమ్యూనిస్టు భావజాలం ఉన్నవారు వార్ధాలో గాంధీతో బేటీ అయ్యారు. త్రిపుర కాంగ్రెస్ మహాసభలో ఈ నేతలు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నేతలతో భేటీ లాంటివి జరిగాయి. కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధం ఉన్నందువల్ల చాలా మంది కమ్యూనిస్టులు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీతో తమ కార్యకలాపాలు కొనసాగించే వారు. వీటన్నింటిలోనూ సర్వదేవభట్ల రామనాథం చురుకైన పాత్ర పోషించారు. దేవులపల్లి వెంకటేశ్వరరావు కూడా రామనాథం ద్వారానే కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి కంటే ముందే ఆయన కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

1941 ప్రాంతంలో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి కమ్యూనిస్టు పార్టీలో చేరారు. ఆ తరవాతే తెలంగాణలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. పెరవలి వెంకట రమణయ్య పార్టీ కార్యదర్శిగా ఉండేవారు. పెరవలిఎన్నిక కావడానికి కూడా కారణం ఉంది. ఖమ్మం హైస్కూలులో ఆయన సర్వదేవభట్ల రామనాథం, చిర్రావూరు లక్ష్మీ నరసయ్యకు సహాధ్యాయి. పెరవలికి పోలీసు విభాగంలో సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం వచ్చింది. కానీ రామనాథం ప్రోద్బలంతో ఆయన ఉద్యోగానికి రాజీనామా చేసి కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారు. పార్టీలో పూర్తి కాలం పని చేసే వారు. ఆ రోజుల్లో పెరవలిపెద్ద త్యాగం చేసినట్టే. ఆ రకంగా పెరవలిని తెలంగాణలో తొలి కమ్యూనిస్టు అనుకోవచ్చు.

రాహుల్ పరువు నష్టం కేసు విచారణ 28కి వాయిదా

సుల్తాన్‌పూర్ (యూపీ): కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై దాఖలయిన పరువు నష్టం కేసులో ఫిర్యాదుదారుడి తరఫు సాక్షి కోర్టులో వాదనలు వినిపించకపోవడంతో విచారణను మంగళవారం ప్రత్యేక కోర్టు వాయిదా వేసింది. ఈ కేసుకు సంబంధించి తదుపరి విచారణ తేదీని ఏప్రిల్ 28గా నిర్ణయించినట్లు ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు కేసులోని ఒక న్యాయవాది తెలిపారు. 'ఈరోజు విచారణ జరగాల్సి ఉంది. కానీ ఫిర్యాదుదారుడి తరఫు సాక్షి హాజరు కాకపోవడంతో ఎటువంటి చర్యలు తీసుకోలేకపోయారు. తదుపరి విచారణ తేదీని ఏప్రిల్ 28గా కోర్టు నిర్ణయించింది' అని గాంధీ తరఫు న్యాయవాది కాశీ ప్రసాద్ శుక్లా తెలిపారు. ఈ కేసులో మునుపటి విచారణ ఏప్రిల్ 3న జరిగింది. మంగళవారం సాక్షి ఒకరు సాక్ష్యం చెప్పాల్సి ఉందని ఫిర్యాదుదారుడి తరఫు న్యాయవాది సంతోష్ కుమార్ పాండే తెలిపారు. 'సాక్షి కోర్టుకు వచ్చారు. కానీ అనారోగ్యం కారణంగా వాంగ్మూలం నమోదు చేయలేకపోయారు. నా అభ్యర్థన మేరకు, న్యాయమూర్తి తదుపరి విచారణ తేదీని ఏప్రిల్ 28గా నిర్ణయించారు' అని వివరించారు.

రాష్ట్రానికి మరింత స్వయంప్రతిపత్తి

- సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో కమిటీ
- తమిళనాడు అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టిన సీఎం స్టాలిన్

చెన్నై: రాష్ట్ర హక్కులను కేంద్రం క్రమంగా లాక్కుంటోందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విమర్శించారు. ఇందుకుగాను రాష్ట్ర స్వయం ప్రతిపత్తిపై రిటైర్డ్ సుప్రీం కోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు మంగళవారం అసెంబ్లీలో ప్రకటించారు. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ రాష్ట్ర స్వయం ప్రతిపత్తిని నిర్ధారించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాన్ని వివరంగా పరిశీలిస్తుంది. ఇది జనవరి 2026లో తన మధ్యంతర నివేదిక సమర్పిస్తుంది. సిఫార్సులతో కూడిన తుది నివేదికను రెండేళ్లలో సమర్పించనున్నట్లు సీఎం స్టాలిన్ అసెంబ్లీకి తెలిపారు. ఈ ప్యానెల్‌లో మాజీ అధికారి అశోక్ వర్ధన్ శెట్టి, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు ఎం.నాగనాథన్ సభ్యులుగా ఉంటారు. 'రాష్ట్ర జాబితా నుంచి ఉమ్మడి జాబితాకు వెళ్లిన అంశాలను బదిలీ చేయడానికి కమిటీ చట్ట ప్రకారం అధ్యయనం చేస్తుంది' అని ముఖ్యమంత్రి అన్నారు. వైద్య విద్య కోసం జాతీయ అర్హత-ప్రవేశ పరీక్ష (నీట్) రాష్ట్రాల పరిధిలో లేదని ఆయన ఎత్తి చూపారు. తమిళనాడు అసెంబ్లీ రెండుసార్లు ఆమోదించిన బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరస్కరించడంతో ఈ నెల ప్రారంభంలో నీట్‌పై వివాదం తారస్థాయికి చేరుకుంది. తమిళనాడు ప్రభుత్వం పన్నెండో తరగతి మార్కులను ఉపయోగించుకునేందుకు వీలు కల్పించింది. 'కేంద్ర ప్రభుత్వం తమిళనాడు అభ్యర్థనను తిరస్కరించి ఉండవచ్చు. కానీ మా పోరాటం ఇంకా ముగియలేదు. ఈ నిర్ణయాన్ని ఎలా సవాలు చేయాలో న్యాయ నిపుణులను సంప్రదిస్తాం' అని ఆయన అన్నారు. తమిళనాడు, కేంద్రం మధ్య మరో ప్రధాన వివాదం ఏమిటంటే... జాతీయ విద్యావిధానంలోని త్రి భాషా సూత్రం. రాష్ట్రాలపై 'హిందీని రుద్దడం'లి' వివాదానికి దారితీసింది. ఇతర అంశాలతో పాటు 12వ తరగతి అంతకంటే ఎక్కువ తరగతి విద్యార్థులు 22 జాబితా నుంచి మూడవ భాషను (మాతృభాష, ఇంగ్లీషుతో పాటు) నేర్చుకోవాలని చెప్పే విధానంపై రెండు వర్గాలు పోరాడుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ద్విభాషా విధానం రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడిందని డీఎంకే తెలిపింది. ఇది భారత ఆర్థిక వ్యవస్థకు రెండవ అతిపెద్ద సహకారి అని స్పష్టం చేసింది. రూ.2,500 కోట్ల విద్యా నిధులు నిలిపివేస్తామని బెదిరించడం ద్వారా కేంద్రం, ముఖ్యంగా విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తమను 'బ్లాక్ మెయిల్' చేయడానికి ప్రయత్నిస్తున్నారని తమిళ పార్టీ ఆరోపించింది.

ఆ బాలికకు అంతా తెలుసు

పోక్సో కేసుపై బాంబే హైకోర్టు

ముంబై: పోక్సో కేసు విచారణలో భాగంగా బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఏకాభిప్రాయంతోనే ఆ యువకుడితో బాలిక వెళ్లినట్లు తెలుస్తోందని, ఏం చేస్తుందో ఆమెకు పూర్తి అవగాహన ఉందని వ్యాఖ్యానిస్తూ... నిందితుడికి బెయిల్ మంజూరు చేసింది. కేసు వివరాల ప్రకారం... 2020 ఆగస్టులో 15 ఏళ్ల బాలిక ఇంటినుంచి వెళ్లిపోయింది. ఎంతకీ తిరిగిరాలేదు. ఆమె ఒక యువకుడితో వెళ్లిపోయిందని అనుమానించిన తండ్రి... నవీ ముంబైలోని అతడి ఇంటికి వెళ్లి చూడగా, అక్కడా కనిపించలేదు. తర్వాత అతడికి ఫోన్ చేసి కుమార్తె గురించి ఆరాతీయగా తన వద్ద లేదని సమాధానం ఇచ్చాడు. రెండు రోజుల తర్వాత ఆ బాలికనే తండ్రికి ఫోన్ చేసి, తాను ఆ యువకుడితోనే ఉన్నానని చెప్పింది. ఉత్తరప్రదేశ్‌లోని అతడి గ్రామంలో ఉన్నామని సమాచారం ఇచ్చింది. పది నెలల తర్వాత తిరిగి ఫోన్ చేసి తాను గర్భం దాల్చానని, అయితే ఆ యువకుడు పెళ్లి చేసుకోవడానికి అంగీకరించడం లేదని చెప్పింది. బాలిక అభ్యర్థన మేరకు ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2019 నుంచి ఆ యువకుడితో పరిచయం ఉందని పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొంది. అతడు ప్రేమిస్తున్నానని చెప్పడంతో తాను కూడా అంగీకరించానని చెప్పింది. తమ ప్రేమ వ్యవహారం తల్లిదండ్రులకు ఇష్టం లేదని తెలిపింది. 2020లో అతడు తనను శారీరకంగా లొంగదీసుకున్నాడని, తర్వాత ఉత్తరప్రదేశ్‌లోని తన గ్రామానికి తీసుకెళ్లాడని వెల్లడించింది. అక్కడ తామిద్దరం కలిసే జీవించామని చెప్పింది. దాంతో పోక్సో చట్టం కింద అతడిపై కేసు నమోదైంది. కొంతకాలంగా అతడు జైల్లో ఉంటున్నాడు. తాజాగా అతడి బెయిల్‌పై బాంబే హైకోర్టులో విచారణ జరిగింది. ఈ వ్యవహారమంతా జరిగిన సమయంలో బాలిక మైనర్ అని, ఆమె అంగీకారమనేది ఇక్కడ విషయం కాదని ఆమె తరఫు న్యాయవాది కోర్టులో వాదించారు. బెయిల్ మంజూరు చేయొద్దని కోర్టును కోరారు. రెండు పక్షాల వాదనలు విన్న బాంబే హైకోర్టు ధర్మాసనం 'ఏకాభిప్రాయంతోనే బాలిక ఆ యువకుడితో వెళ్లినట్లు ఆమె ఇచ్చిన వాంగ్మూలాన్ని బట్టి తెలుస్తోంది. తాను ఏం చేస్తుందో ఆమెకు అవగాహన ఉంది. 10 నెలలు అతడితో కలిసి ఉంది. ఆమె వయసు 18 ఏళ్ల లోపే అయినా... తన చర్యలు, నిర్ణయాలపై ఆమె స్పష్టంగానే ఉన్నట్లు కనిపిస్తోంది. తాను గ్రామంలో ఉన్నానని తల్లిదండ్రులకు ఆ బాలిక సమాచారం ఇచ్చినప్పటికీ... వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదు' అని వ్యాఖ్యానించింది. తర్వాత నిందితుడికి బెయిల్ మంజూరు చేసింది.

ఢిల్లీలో మూడు రోజులుంటే రోగాలే: గడ్కరీ

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో కాలుష్యం తీవ్రస్థాయిలో ఉండటంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తంచేశారు. ఢిల్లీలో మూడు రోజులుంటే అనారోగ్యానికి గురికావడం తథ్యమని అన్నారు. కాలుష్యం విషయంలో ఢిల్లీ, ముంబై రెడ్‌జోన్‌లో ఉన్నాయని తెలిపారు. ఢిల్లీలో పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇక్కడి ప్రజల ఆయుర్దాయం పదేళ్లు తగ్గుతుందని వైద్య పరిశోధనను ఉటంకిస్తూ చెప్పారు. ఇప్పటికైనా ప్రజలు మేల్కొని శిలాజ ఇంధనాల వాడకం తగ్గించాల్సిన అవసరం ఉందని సూచించారు. రాష్ట్రాలలో మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక వ్యవస్థకు ఏవిధంగా ప్రాధాన్యం ఇస్తామో... అలాగే పర్యావరణాన్ని కూడా ముఖ్యమైన విషయాల్లో ఒకటిగా పరిగణించాలన్నారు. కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి రహదారుల మౌలిక సదుపాయాల కల్పన ఓ పరిష్కారంగా పని చేస్తుందని గడ్కరీ తెలిపారు. కాలుష్యానికి పెట్రోల్, డీజిల్ ప్రధాన కారణాలని, అందువల్ల వాహనాల్లో ఉపయోగించే ఇంధనంలో మార్పు అవసరమన్నారు. మనం దాదాపు రూ.22 లక్షల కోట్ల విలువైన శిలాజ ఇంధనాలు దిగుమతి చేసుకుంటున్నామని, వాటికి ప్రత్యామ్నాయ ఇంధనాలు వినియోగించాల్సిన సమయం వచ్చిందన్నారు.

బీహార్ ఎన్నికలపై కసరత్తు

- కాంగ్రెస్ అగ్రనాయకత్వంతో తేజస్వి భేటీ
- పొత్తులపై చర్చ... మహాకూటమిదే విజయమని ధీమా
- రేపు పాట్నాలో మళ్లీ చర్చలు

న్యూఢిల్లీ: బీహార్‌లో ఈ ఏడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలైన ఆర్జేడీ, కాంగ్రెస్ కలిసి పోటీ చేయనున్నాయి. ఈ విషయమై చర్చించేందుకు ఆర్జేడీ కీలక నేత తేజస్వీయాదవ్ మంగళవారం ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ సహా సీనియర్ కాంగ్రెస్ నాయకులను కలిశారు. బీహార్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు మహాఘట్బంధన్ (గ్రాండ్ అలయన్స్) ఎన్నికల సన్నద్ధత గురించి చర్చించారు. తేజస్వీ యాదవ్, ఆర్జేడీ ఎంపీలు మనోజ్ ఝా, సంజయ్ యాదవ్‌లతో కలిసి ఖర్గే నివాసంలో కాంగ్రెస్ నాయకత్వాన్ని కలిశారు.

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, బీహార్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ కుమార్, ఏఐసీసీ బీహార్ ఇంఛార్జ్ కృష్ణ అల్లవారు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. మహాఘట్బంధన్ మిత్రపక్షాల సీట్ల పంపిణీపై బేరసారాలు జరుగుతున్నాయన్న సంకేతాల మధ్య ఈ సమావేశం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. అన్ని పార్టీలు క్షేత్రస్థాయిలో తమ పట్టును బలోపేతం చేసుకోవాలని చూస్తున్నాయి.

ఎన్డీఏ ఎట్టి పరిస్థితుల్లో గెలవదు: తేజస్వి

ఎన్నికల పొత్తుపై కాంగ్రెస్ అగ్ర నాయకత్వంతో చర్చల అనంతరం తేజస్వీయాదవ్ మీడియాతో మాట్లాడారు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ హైజాక్ అయ్యారని అన్నారు. బీహార్‌లో ప్రతిపక్ష కూటమి పటిష్టంగా ఉందని...బీహార్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. బీహార్‌లోని ప్రతిపక్ష కూటమి పార్టీలు ఈ నెల 17న పాట్నాలో మరోసారి సమావేశమవుతాయని తేజస్వి తెలిపారు. నితీశ్‌కుమార్ 20 ఏళ్ల పాలనలో బీహార్ ఎద రాష్ట్రంగా మిగిలిపోయిందని విమర్శించారు. తలసరి ఆదాయం, రైతుల రాబడి తగ్గిపోయాయని, వలసలు పెరిగిపోయాయన్నారు. కాంగ్రెస్ అగ్రనేతలతో చర్చలు సానుకూలంగా జరిగాయని తేజస్వి చెప్పారు. ప్రజా సమస్యల ఆధారంగానే తాము ఎన్నికల్లో తలపడతామని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు అర్థమయ్యేలా ఎత్తిచూపడం ప్రతిపక్షాల బాధ్యత అని తెలిపారు. ప్రతిపక్ష కూటమి తరఫున సీఎం అభ్యర్థి ఎవరనే ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. అందరం ఏకగ్రీవంగా సీఎం అభ్యర్థిని ఎన్నుకుంటామని చెప్పారు. ఇక ఈ ఎన్నికల్లో ఎన్డీఏ ఎట్టి పరిస్థితుల్లో గెలువబోదని తేజస్వి జోస్యం చెప్పారు. వచ్చే బీహార్ ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా ఎన్డీఏ కూటమిని ఓడిస్తామని కాంగ్రెస్ పార్టీ బీహార్ అధ్యక్షుడు రాజేష్ కుమార్ పేర్కొన్నారు.

బెంగాల్ హింసలో బంగ్లాదేశీయుల పాత్ర?

కోల్‌కతా: వక్ఫ్ (సవరణ) చట్టం అమలుకు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్‌లో నిరసనలు ఉద్రిక్తతకు దారితీశాయి. ముర్షిదాబాద్‌లో హింసాత్మక పరిస్థితులు కొనసాగుతున్నాయి. వీటిని అదుపు చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. అయితే... ఈ హింస వెనుక బంగ్లాదేశ్‌కు చెందిన వారి ప్రమేయం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని జాతీయ రహదారి 12పై ఒక వర్గానికి చెందిన సమూహం పోలీసులపై రాళ్లదాడికి ప్రయత్నించగా... మరోవైపు, ధూలియన్, షంషేర్‌గంజ్, సుతీల్లో కొందరు విధ్వంసానికి పాల్పడ్డారు. ఈ ప్రాంతం అంతర్జాతీయ సరిహద్దుకు సమీపంలో ఉండడంతో ఇతర ప్రాంతాలు లేదా పొరుగు దేశం బంగ్లాదేశ్‌కు చెందిన ఎవరైనా రాష్ట్రంలోకి ప్రవేశించి ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ మేరకు మీడియా కథనాలు వెలువడుతున్నాయి. రాళ్ల దాడి చేసిన వారు ఎక్కువగా 20 ఏళ్ల లోపు వారేనని ఎమ్మెల్యే మనిరుల్ ఇస్లాం మీడియాకు తెలిపారు. తానెప్పుడూ వారిని చూడలేదన్నారు. 'అల్లర్లు జరుగుతున్న ప్రాంతం సరిహద్దుకు సమీపంలో ఉంటుంది. అస్థిర పరిస్థితుల దృష్ట్యా ఇది జాతీయ భద్రతకు సంబంధించిన అంశంగా పరిగణిస్తున్నాం. బయటి వ్యక్తులు ఈ ప్రాంతంలోకి ప్రవేశించారనడంలో ఎలాంటి సందేహం లేదు. అది ఇతర జిల్లా లేదా పొరుగు దేశం నుంచి కావొచ్చు. ఈ అంశంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. త్వరలోనే వాస్తవాలేంటో బయటపెడతాం' అని ఒక సీనియర్ పోలీసు అధికారి పేర్కొన్నారు. ఉగ్రవాద సంస్థలు యువకులను ఈ హింసలో భాగం చేశాయని కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు మీడియాకు సమాచారం అందించాయి. జాతీయ భద్రతకు సంబంధించిన అంశం కావడంతో పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపాయి.

కాంగ్రెస్ మాజీ మంత్రి ఇంట్లో ఈడీ సోదాలు

జైపూర్: రాజస్థాన్ మాజీమంత్రి ప్రతాప్ సింగ్ ఖచారియావాస్ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్‌గెహ్లాత్ హయాంలో ప్రతాప్ రవాణా శాఖ మంత్రిగా వ్యవహరించారు. ఈడీ దాడులపై ప్రతాప్ మాట్లాడుతూ 'నాకు ఎటువంటి నోటీసు ఇవ్వకుండా ఈడీ అధికారులు నా నివాసంలో సోదాలు నిర్వహించారు. నా వద్ద దాచడానికి ఏమీ లేదు. ఈడీ అధికారులకు నేను పూర్తిగా సహకరిస్తాను. ఈడీ తన పని తాను చేసుకుంటోంది. నేనెవరికీ భయపడను. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా వారి ఇంటికి ఈడీ అధికారులు వస్తారు' అని అన్నారు. కాంగ్రెస్ నేత ఇంటిపై దాడులు నిర్వహించడంతో ఆయన నివాసం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రతాప్‌సింగ్ మద్దతుదారులు ఆయన నివాసానికి చేరుకుని... ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇటీవల ప్రతాప్‌సింగ్ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. 'ప్రభుత్వాలు మారతాయి. కాలం మారుతుంది. రాహుల్‌గాంధీ అధికారంలోకి వస్తే... బీజేపీకి ఏం జరుగుతుందో ఊహించుకోండి. మేము ఇలాంటి వ్యాఖ్యలు చేసినందుకు ఎన్ని సోదాలు కావాలంటే అన్ని చేయవచ్చు. మేము భయపడం' అని ప్రతాప్‌సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యల అనంతరమే ఆయన ఇంటిపై ఈడీ దాడులు నిర్వహించింది.

ప్రధాని వ్యాఖ్యలు గర్హనీయం

పంక్చర్ల వ్యాఖ్యలపై విపక్షాల మండిపాటు

న్యూఢిల్లీ: ముస్లింలు టైర్లకు పంక్చర్లు వేసుకుంటారన్న ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. ఇటువంటి వ్యాఖ్యలు ప్రధాని పదవిలో ఉన్న మోదీకి తగదని మంగళవారం కాంగ్రెస్ విమర్శించింది. సోషల్‌మీడియాలో ముస్లింలను ట్రోల్ చేసేందుకు ఆ వ్యాఖ్యలు వినియోగిస్తారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉద్యోగాలు కల్పించకుండా మోదీ ప్రభుత్వం దేశ యువతను ఈ దుస్థితికి తీసుకువచ్చిందని కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌ఘర్హి విమర్శించారు. ఉద్యోగాలు లేనపుడు పంక్చర్లు మరమ్మతు చేయడం లేదా వడలు విక్రయించడం వంటి వాటినే ఎంపిక చేసుకుంటారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌ను ముస్లింల సానుభూతిపరులు అంటున్నారు. మీరు వారిని ద్వేషిస్తున్నారా అని ప్రశ్నించారు. ముక్తార్ అబ్బాస్ నఖ్వీ, షానవాజ్ హుస్సేన్, ఎంజే అక్బర్, జాఫర్ ఇస్లాంలను ఎందుకు పక్కకు పడేశారని నిలదీశారు. వక్ఫ్ బిల్లుతో మంచి జరుగుతుందని అంటున్నారు. కానీ లోక్‌సభలో ఆ బిల్లును ముస్లిం ఎంపీలు ఎందుకు ప్రవేశపెట్టలేదని ప్రశ్నించారు. ముస్లిం మహిళల హక్కుల గురించి మాట్లాడుతున్నారు... లోక్‌సభలో లేదా రాజ్యసభలో లేదా ఏ రాష్ట్ర అసెంబ్లీలోనైనా ఒక్క ముస్లిం మహిళా సభ్యురాలైనా ఉన్నారా అని ప్రతాప్‌ఘర్హి నిలదీశారు. ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పందిస్తూ మోదీ వ్యాఖ్యలను తిప్పికొట్టారు. ఆర్‌ఎస్‌ఎస్ తన భావజాలాన్ని, వనరులను దేశ ప్రయోజనాల కోసం వినియోగించి ఉంటే ప్రధాని మోదీ బాల్యంలో టీ అమ్మాల్సిన అవసరం ఉండేది కాదని అన్నారు. మోదీ అధికారంలో ఉన్న 11 ఏళ్లలో పేద హిందువులకు, ముస్లింలకు ఏం ప్రయోజనాలు కల్పించారని ప్రశ్నించారు. వక్ఫ్ చట్టాలు బలహీనంగా ఉండటంతోనే వక్ఫ్ ఆస్తులు దుర్వినియోగమయ్యాయని, మోదీ ప్రవేశపెట్టిన సవరణలు ఆ చట్టాలను మరింత బలహీనపరుస్తాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింలకు బీజేపీ ఎందుకు టికెట్లు ఇవ్వదని సమాజ్‌వాది పార్టీ నేత అబూ అజ్మీ ప్రశ్నించారు. వక్ఫ్ ఆస్తులను నిజాయతీగా ఉపయోగించినట్లైతే యువ ముస్లింలు జీవనోపాధి కోసం పంక్చర్లు వేయాల్సిన అవసరం ఉండదని ప్రధాని సోమవారం వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

బంగ్లాదేశ్ వెళ్లిపోండి: యోగి

హర్దోయ్: వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్‌ని ముర్షిదాబాద్‌లో హింసాకాండ చోటుచేసుకోవడంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్రంగా స్పందించారు. 'హింసకు పాల్పడేవారికి మంచిమాటలు చెవికెక్కవు. లాఠీల భాషే వారికి అర్థమవుతుంది' అని వ్యాఖ్యానించారు. బంగ్లాదేశ్‌ను అంతగా ప్రేమించే వారు అక్కడికే వెళ్లిపోవచ్చన్నారు. హర్దోయ్‌లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను యోగి ఆదిత్యనాథ్ మంగళవారం ప్రారంభించారు. బంగ్లాదేశ్‌లో అశాంతి నెలకొనడంపై యోగి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వారం రోజులుగా ముర్షిదాబాద్ తగులబడుతోందని, అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సహా ప్రతి ఒక్కరూ మౌనంగా చూస్తుండి పోతున్నారన్నారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న దాడులకు బెంగాల్ వంతపాడుతోందని, పశ్చిమబెంగాల్ సీఎం చేష్టలుడిగి చూస్తుండిపోతున్నారని, హింసకు పాల్పడుతున్న వారిని శాంతి దూతలుగా ముద్రవేస్తున్నారని విమర్శించారు. బెంగాల్‌లో హిందువుల రక్షణకు కేంద్ర బలగాలను మోహరించాలంటూ ఆదేశించిన బెంగాల్ న్యాయవ్యవస్థకు యోగి కృతజ్ఞతలు తెలిపారు. బెంగాల్ హింసాకాండపై ప్రధాన రాజకీయ పార్టీలు ఎందుకు మౌనంగా ఉంటున్నాయని ప్రశ్నించారు.

ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారకర్తగా గవర్నర్

సీపీఎం

చెన్నై: ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారకర్తగా గవర్నర్ ఆర్‌ఎన్ రవి వ్యవహరిస్తున్నారని సీపీఎం తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆర్‌ఎన్ రవి రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాల్సిన గవర్నర్... అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానించిన బిల్లులు సైతం ఆమోదించకపోవడం ఖండించదగ్గదన్నారు. సుప్రీంకోర్టు అక్షింతలతోనైనా గవర్నర్ తీరు మారలేదన్నారు. ఇటీవల మదురై త్యాగరాజర్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రసంగించిన గవర్నర్... చివరిలో విద్యార్థులతో మూడుసార్లు 'జై శ్రీరామ్' అని పలికించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటున్న గవర్నర్... ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారకర్తగా వ్యవహరిస్తున్నారని, ఆయన్ను వెంటనే రీకాల్ చేయాలని షణ్ముగం డిమాండ్ చేశారు.

సమ్మెలోకి ఆరు లక్షల ట్రక్కర్లు

నిలిచిన నిత్యావసరాల సరఫరా

ఆకాశాన్నంటుతున్న ధరలు

బెంగళూరు: కర్నాటకలో ఆరు లక్షల ట్రక్కులు సమ్మెలోకి దిగాయి. దీంతో నిత్యావసర సామగ్రి నిలిచిపోయాయి. సమ్మెకు 24 రాష్ట్రాల నుంచి రవాణాదారులు మద్దతు ప్రకటించారు. పాలు తరలించే ట్రక్కులు తప్ప... మిగిలిన అన్ని ట్రక్కులు రోడ్లపైకి రావని రవాణా సంఘాలు తెలిపాయి. నిత్యావసరాలు, నిర్మాణ సామగ్రి, పెట్రోల్, ఎల్‌పీజీ, ఇతర వస్తువులు రవాణా చేసే ట్రక్కులు కూడా సమ్మెలో పాల్గొన్నాయి. కర్నాటక రాష్ట్ర లారీ యజమానులు, ఏజెంట్ల సంఘం అధ్వర్యంలో దాదాపు ఆరు లక్షల మంది ట్రక్కర్లు ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి దిగారు. ఇంధన ధరల పెరుగుదల, టోల్ ప్లాజాల్లో వేధింపులకు వ్యతిరేకంగా నిరవధిక సమ్మె ప్రారంభించారు. పాలు రవాణా చేసే ట్రక్కులు తప్ప మిగతా అన్ని ట్రక్కులు రోడ్లపై తిరగవని అసోసియేషన్ తెలిపింది. 24 రాష్ట్రాల నుంచి 60కి పైగా రవాణా సంఘాలు సమ్మెకు మద్దతు ఇచ్చాయని పేర్కొన్నది. నిరసన సమయంలో ఇతర రాష్ట్రాల నుంచి ట్రక్కులు కర్నాటకలోకి ప్రవేశించబోవని తెలిపింది. 'కర్నాటక ప్రభుత్వం కేవలం ఏడు నెలల వ్యవధిలో రెండుసార్లు డీజిల్ ధర పెంచింది. దీని వలన నిర్వహణ ఖర్చులు పెరిగాయి. ట్రక్కర్లు నడపడానికి ఇబ్బంది పడుతున్నారు. డీజిల్ ధరల పెరుగుదల కర్నాటకలోని ప్రతి పౌరుడిని ప్రభావితం చేసింది' అని అసోసియేషన్ అధ్యక్షుడు జీఆర్ షణ్ముగప్ప తెలిపారు. సమ్మె కారణంగా కర్నాటక నుంచి తమిళనాడుకు రోజుకు 4 వేల లోడ్ల కూరగాయలు, బియ్యం, మందులు, ఇతర నిత్యావసర వస్తువుల సరఫరా నిలిచిపోయాయి. 'కోలార్, కర్నాటకలోని ఇతర ప్రాంతాల నుంచి కూరగాయల కోసం... ముఖ్యంగా టమోటాల కోసం ట్రక్కులపై ఎక్కువగా ఆధారపడే చెన్నైకు కష్టాలు తప్పవని షణ్ముగప్ప హెచ్చరించారు. తమిళనాడులో ప్రస్తుతం టమోటాలు కిలో ధర రూ.25 పలుకుతోంది. సరఫరా నిలిచిపోవడంతో అంతరాయం కలిగి ధరలు అమాంతంగా పెరిగిపోవచ్చు. సమ్మె కారణంగా మహారాష్ట్ర నుంచి వచ్చే ట్రక్కులు... ముఖ్యంగా నాసిక్ నుంచి ఉల్లిపాయలు తీసుకొచ్చే ట్రక్కులు ఆలస్యం కావడం పట్ల వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. మహారాష్ట్ర, గుజరాత్ నుంచి ప్రతిరోజూ దాదాపు 15 వేల ట్రక్కులు కర్నాటక గుండా వెళుతున్నాయని బెంగళూరు కమర్షియల్ ట్రక్ అసోసియేషన్ నాయకుడు రాజేశ్ తెలిపారు. కర్నాటకలో టోల్ వసూలు రద్దు చేయడం, రాష్ట్ర సరిహద్దుల్లో ఆర్టీవో చెక్‌పోస్టులు తొలగించడం, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పునరుద్ధరణకు రూ.15 వేలు వసూలు చేయాలన్న కేంద్రం ఆదేశాన్ని ఉపసంహరించుకోవడం వంటి అనేక డిమాండ్లను అసోసియేషన్ లేవనెత్తింది. బెంగళూరులో ట్రక్కులకు 'నో ఎంట్రీ' పరిమితిని సడలించడం ఒక ముఖ్యమైన డిమాండ్‌గా ఉంది.

శిశువుల అక్రమ రవాణా జరిగితే

ఆస్పత్రి లైసెన్స్ రద్దు: సుప్రీం

న్యూఢిల్లీ: నవజాత శిశువుల అక్రమ రవాణా కేసులకు సంబంధించి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏ ఆస్పత్రిలోనైనా చిన్నారుల అక్రమ రవాణా జరిగినట్లు తేలితే లైసెన్స్ రద్దు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేరాలు నిరోధించేందుకు ప్రభుత్వానికి కఠిన మార్గదర్శకాలు ఇచ్చింది. యూపీలో ఇటీవల ఒక ఆస్పత్రిలో నవజాత శిశువు చోరీకి గురయ్యాడు. దీన్ని గమనించిన ఆ చిన్నారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే ఆ శిశువును దుండగుడు విక్రయించాడు. నిందితుడిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. అనంతరం అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించిన దంపతులకు నిరాశే మిగిలింది. కేసు విచారించిన న్యాయస్థానం నిందితుడికి బెయిల్ మంజూరు చేసింది. దీంతో తమకు న్యాయం జరగలేదని ఆరోపిస్తూ బాధితులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును అత్యున్నత న్యాయస్థానం విచారించింది. చిన్నారుల అక్రమరవాణా కేసులపై యూపీ ప్రభుత్వ తీరు, నిందితుడికి బెయిల్ మంజూరుచేసిన అలహాబాద్ హైకోర్టుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. అక్రమ రవాణా పెండింగ్ కేసులకు సంబంధించి విచారణ ఎలా కొనసాగుతుందో తెలియజేయాలని దేశవ్యాప్తంగా హైకోర్టులను జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన ధర్మాసనం ఆదేశించింది. నిందితుడి బెయిల్ రద్దు చేసింది. 'ఇలాంటి కేసులకు సంబంధించిన విచారణను 6 నెలల లోపు పూర్తిచేయాలి. రోజూవారీ విచారణ నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఏ ఆస్పత్రిలోనైనా అక్రమ రవాణా జరిగినట్లు తేలితే లైసెన్స్ రద్దు చేయాలని సంబంధిత అధికారులను సుప్రీం ఆదేశించింది. 'కుమారుడిని పొందేందుకు ఆశపడిన నిందితుడు... రూ.4 లక్షలకు చిన్నారిని పొందాడు. ఒకవేళ బిడ్డ కావాలని అనుకుంటే అక్రమ రవాణా చేసేవారిని సంప్రదించాల్సింది కాదు. ఆ చిన్నారిని దొంగతనం చేసి తనకు అందించారనే విషయం నిందితుడికి బాగా తెలుసు. నిందితులు ప్రతివారం పోలీస్ స్టేషన్‌లో తప్పకుండా హాజరుకావాలి. కానీ, దీనిపై దృష్టిసారించకుండా హైకోర్టు బెయిల్ ఇచ్చింది. నిందితులను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

విశాలాంధ్ర హైదరాబాద్

ఇందిరమ్మ ఇళ్లు మొదటి చెక్కు అందజేత

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి పనులు బేస్మెంట్ వరకు పనులు జరిగిన వారికి మొదటి విడతగా లక్ష రూపాయల చెక్కులను అందజేసే ప్రక్రియ ప్రారంభించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండలంలోని పోరెడ్డిపల్లి గ్రామంలో రాజవ్వ అనే మహిళ ఇందిరమ్మ మొదటి విడత లక్ష రూపాయల చెక్కును అందుకోవడం జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాజవ్వకి చెక్కు అందజేయడం జరిగింది. మిగతా లబ్దిదారులు త్వరత్వరగా పనులు పూర్తి చేసుకొని చెక్కులు తీసుకునే విధంగా వ్యవహరించాలి. అదేవిధంగా ఏప్రిల్ చివరి వారంలో మొదటి విడత 3500 ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. అనంతరం రెండవ విడత 3500 ఇందిరమ్మ ఇళ్లకు ప్రతిపాదనలు చేస్తాం. గ్రామాల్లో కడు పేదలు, పూరి గుడిసెల్లో ఉండేవారికి గ్రామ సభల్లో ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేసి అవినీతికి తావులేకుండా అందరి సమక్షంలో పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక జరగాలని ముఖ్యమంత్రి కోరారు. దాని ప్రకారమే హుస్నాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక జరుగుతుంది. మంగళవారం మొదటి విడతగా చెక్కు అందుకున్న కోహెడ పోరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తీసుకున్న మహిళకు అభినందనలు తెలిపారు.

సీఎం రేవంత్ రెడ్డికి తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర - హైదరాబాద్ : సీఎల్పీ సమావేశం సందర్భంగా నోవాటెల్ హోటల్ వద్దకు సీఎం రేవంత్ రెడ్డి చేరుకున్నారు. తెలంగాణ ప్రభుత్వ విప్‌లు, కొంతమంది ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి ఆహ్వానం పలికి హోటల్ లోపలికి తీసుకెళ్లారు. అయితే పైఅంతస్తుకు వెళ్లే క్రమంలో 8 మంది ఎక్కాల్సిన లిఫ్ట్‌లో రేవంత్ రెడ్డితోపాటు 13 మంది ఎక్కారు. దీంతో లిఫ్ట్ ఉండాల్సిన స్థానం కంటే కిందికి కుంగిపోయింది. వెంటనే అలారం మోగడంతో అధికారులు, హోటల్ సిబ్బంది అప్రమత్తం అయ్యారు. హుటాహుటిన లిఫ్ట్ వద్దకు పరుగులు పెట్టారు. అనంతరం సీఎం సహా అందరినీ లిఫ్ట్ నుంచి బయటకు తీసుకువచ్చారు. అనంతరం మరో లిఫ్ట్‌లో సమావేశం జరుగుతున్న సెకండ్ ఫ్లోర్‌కు తీసుకెళ్లారు. రేవంత్ రెడ్డి ప్రమాదం నుంచి తప్పించుకోవడంతో ఎమ్మెల్యేలు, అధికారులు, హోటల్ సిబ్బంది అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: మరో అవినీతి తిమింగలం ఏసీబీ అధికారులకు పట్టుబడింది. ఈసారి జీహెచ్ఎంసీ అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఓ బాధితుడి ఫిర్యాదు మేరకు మంగళవారం మధ్యాహ్నం శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు చేపట్టింది. జోనల్ కార్యాలయంలోని అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ గదిలో రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ గత కొంతకాలంగా చాంద్రాయణగుట్ట సర్కిల్‌లో అర్బన్ బయోడైవర్సిటీ విభాగం ఇంచార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. చాంద్రాయణ గుట్ట సర్కిల్ పనికి సంబంధించి ఓ కాంట్రాక్టర్ వద్ద రూ. 70 వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడిని లంచం డబ్బులు తీసుకుని శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయానికి రావాలని సూచించాడు. దీంతో కాంట్రాక్టర్ అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపిన విధంగా శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలోని శ్రీనివాస్ వద్దకు వచ్చాడు. అతని వద్ద నుండి డబ్బులు తీసుకుంటూ శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో శ్రీనివాస్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

విశాలాంధ్ర-దుండిగల్: ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ సయ్యద్ మతిన్ హెచ్చరించారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ%ీ% గండిమైసమ్మ దుండిగల్ మండలం పరిధి డి. పోచంపల్లి సర్వే నెంబర్ 120లో కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదు రావడంతో దుండిగల్ తహసిల్దార్ సయ్యద్ మతిన్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్స్పెక్టర్ అన్వేష్ కుమార్ సిబ్బందితో కలిసి నిర్మాణం దగ్గరికి చేరుకొని జేసీబీ సహాయంతో అక్రమ నిర్మాణా లను పూర్తిగా కూల్చివేశారు.అనంతరం తాసిల్దార్ మతిన్ మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేస్తే కూల్చివేతలు తప్పవని హెచ్చరిం చారు. కూల్చివేసిన స్థానంలో మరోసారి నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.ప్రభుత్వ భూములను ఆక్రమించిన నిర్మాణాలు చేపట్టినా నేరుగా తాసిల్దార్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలని ఆయన తెలియజేశారు.

రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా టీబి రోగులకు ప్లాన్ ఇండియా ఆర్గనైజేషన్ సంస్థ నిక్షయ్ మిత్రాగా నమోదు చేసుకొని వారి సహకారంతో మంగళవారం పౌష్టికాహార కిట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ టీ.బి డాక్టర్ రాజేశం మాట్లాడుతూ... మందులతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా వ్యాధి నుండి త్వరగా కోలుకోవచ్చని చెప్పారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉమా గౌరీ మాట్లాడుతూ...క్షయ వ్యాధిని నివారించడంలో ముందస్తు వ్యాధి నిర్ధారణ పూర్తి కాలం మందులు వాడటం చాలా ముఖ్యమని తెలియజేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 6 టిబి యూనిట్లలో 750 టిబి రోగులకు రెండు నెలలకు సరిపడా 1500 న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా అంతట నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ టిబి డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ...ప్లాన్ ఇండియా ఆర్గనైజేషన్ సంస్థకు పౌష్టికాహార కిట్ల పంపిణీ చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. నిశ్చయమిత్ర ద్వారా దాతలు ముందుకు వచ్చి టిబి బారిన పడిన రోగులకు న్యూట్రిషన్ కిట్ల అందించడంలో సహాయం చేయమని కోరారు. ఈ కార్యక్రమంలలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సత్యవతి, పీహెచ్సీ ఉప్పల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌశీల్యా, అభిలాష్ స్టేట్ ప్రాజెక్ట్ లీడర్ ప్లాన్ ఇండియా ఆర్గనైజేషన్, శ్రీనివాస్, వాసు ప్రసాద్ స్టేట్‌జాయింట్ డైరెక్టర్ టీబీసెల్, బోగ ప్రకాష్ సూపర్వైజర్, డిస్ట్రిక్ట్ టీబీ సిబ్బంది , ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఉప్పల్ సిబ్బంది పాల్గొన్నారు.



క్షయ రోగులకు పౌష్టికాహారం కిట్‌లు అందజేత

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ప్లాన్ ఇండియా ఎన్‌జిఓ ఆధ్వర్యంలో క్షయ రోగుల ఆరోగ్యాన్ని మెరుగుపర్చేందుకు మల్కాజిగిరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పౌష్టికాహారం కిట్‌లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సునిత, డా.రాజు, డా.సంగీత్, క్షయ నివారణ సూపర్‌వైజర్ బి.రామోజీ, క్షయ ఆరోగ్య సందర్శకులు కె.హేమలత, లక్ష్మణ్, ప్లాన్ ఇండియా సంస్థ సభ్యులు హాజరయ్యారు. డా.సునిత క్షయ రోగులకు పౌష్టికాహారం కిట్‌లను అందజేశారు. క్షయ మందులు సంక్రమంగా వాడి ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవాలన్నారు. కిట్‌లను పంపిణి చేసిన ప్లాన్ ఇండియా సేవలను ఆమె ప్రశంసించారు.

ఘనంగా నర్తనం ఆర్ట్స్ వార్షికోత్సవం



విశాలాంధ్ర-బషీర్ బాగ్: నర్తనం ఆర్ట్స్ రెండో వార్షికోత్సవం పురస్కరించుకొని రవీంద్రభారతిలో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు వీక్షకులను ఎంతగానో ఆకటుకొన్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎంఎల్ సి వాణిదేవిలు విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి, నృత్య ప్రదర్శనను ప్రారంభించారు. నాట్య గురువ వర్షిణిని అ భినందించారు. ప్రతిభావంతులైన నృత్యకళాకారులను తీర్చిదిద్దడంలో వర్షిణి నిరంతరంగా కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాట్యగురువ మంజుల రామస్వామి కారియోగ్రాఫర్ అనీ మాస్టర్ కూచిపూడి నాట్యకారిణి ఇంద్రనియాల్ మేఘన, టెక్నాలజి డిపే వరల్డ్ అధినేత చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మోటార్ కనెక్షన్.. నీటి వృథా నియంత్రణకు చర్యలు

విశాలాంధ్ర, హైదరాబాద్ : నగరంలో అక్రమ మోటార్ వాడకాన్ని అరికట్టడానికి.. నీటి వృథాను నివారించడానికి జలమండలి మోటార్ ఫ్రీ టాప్ డ్రైవ్‌ను ప్రారంభించారు. ప్రధానంగా లో ప్రెజర్ ఉన్న ప్రాంతాలు.. మోటార్ల వాడకం ఎక్కువగా ఉన్న కాలనీలలో ఈ డ్రైవ్‌లో బాగంగా ఎండీ నుంచి క్షేత్ర స్థాయిలో సిబ్బంది పాల్గొని కొన్ని ప్రాంతాల్లో మోటార్లు సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి విజిలెన్స్, స్థానిక అధికారులతో కలిసి మాదాపూర్‌లోని కాకతీయ హిల్స్ లో నీటి సరఫరా సమయంలో పర్యటించి తనిఖీలు నిర్వహించారు. కొంతమంది అపార్ట్మెంట్ వాసులతో ముచ్చటించిన ఎండీ దాదాపు 150 కిలో మీటర్ల నుంచి పెద్ద పంపులు, భారీ పైపుల ద్వారా నగర పౌరులకు జలమండలి నీటి సరఫరా చేస్తోందని.. వెయ్యి లీటర్లకు శుద్ధి చెయ్యడానికి రూ. 50 వరకు ఖర్చు చేసి తాగునీరు సరఫరా చేస్తున్నామని, అలాంటి నీటిని మొక్కలకు, ఫ్లోర్, వాహనాలను కడగడానికి వినియోగించకూడ దన్నారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ... జలమండలి సుదూర ప్రాంతాల నుంచి నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తోందని, నీటిని వృథా చేయకుండా వాటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని కోరారు. ఇప్పటికే నగరంలో భూగర్భ జలాలు అడుగంటిపోగా కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిందని అన్నారు. రానున్నరోజులలో నీటికి ఇబ్బంది అయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు తాగునీటికై సరఫరా చేసే శుద్ధమైన నీటిని గార్డెనింగ్, నిర్మాణం తదితర అవసారకు వృథా చేయకూడని విజ్ఞప్తి చేసారు. నల్లలకు మోటార్లు బిగించి నీటిని తోడితే మిగితా వినియోగదారులకులో ప్రెషర్‌తో నీటి సరఫరా కావడంతో ఇబ్బంది పడుతున్నారని వివరించారు. నీటి సరఫరా అవరాలకు సరిపోక ట్యాంకర్ బుక్ చేస్తున్నారని, దీంతో ట్యాంకర్ డిమాండ్ పెరుగుతున్నట్లు చెప్పారు. అందుకే ఈ డ్రైవ్ చేపట్టినట్టు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ డ్రైవ్ జలమండలి పరిధిలోని అన్ని డివిజన్ ప్రాంతాల్లో నిర్వహిస్తామని.. ఈడీ డైరెక్టర్ నుంచి కిందిస్థాయి లైన్ మెన్ వరకు పాల్గొని అక్రమ మోటార్లును సీజ్ చేసి నీటి వృథా అరికట్టాలని సూచించారు. అంతకు ముందు ప్రాంతంలోని అపార్ట్మెంట్ వాసులు జలమండలి పైపులైనుకు నేరుగా విద్యుత్ మోటార్లు బిగించి నీటిని అక్రమంగా తోడుతున్న వినియోగదారులను గుర్తించి జలమండలి విజిలెన్స్ సిబ్బంది మోటార్లు సీజ్ చేసారు. మోటార్ ఫ్రీ టాప్ డ్రైవ్‌లో మొదటి రోజు అన్ని డివిజన్‌లలో కలిపి మొత్తం 64 మోటార్లను సీజ్ చేయగా 84 మంది వినియోగదారులకు అక్రమంగా మోటార్లు ఉపయోగించినందుకు.. నీటి వృథా చేసినందుకు పెనాల్టీ విధించారు. అత్యధికంగా ఓ అండ్ ఎమ్ డివిజన్ లో 6 ఎస్ఆర్ నగర్ పరిధిలో 25 మోటార్లు సీజ్ చేసి పెనాల్టీ వేశారు. నల్లా మోటర్ బిగించడం చట్టరీత్యా నేరమని, నీటి సరఫరాలో ఏవైనా ఇతర సమస్యలు తలెత్తినా సంబంధిత మేనేజర్, డీజీఎం, జీఎం అధికారులను సంప్రదించాలి. లేదా జలమండలి కస్టమర్ కేర్ నంబర్ 155313కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

మైనర్ ఇరిగేషన్‌పై కర్ణాటక మంత్రితోఐనా రైతు కమిషన్ భేటీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్‌కు వచ్చిన కర్ణాటక రాష్ట్ర మైనర్ ఇరిగేషన్ శాఖ మంత్రి బోసు రాజుతో బేగం పేట టూరిజం ప్లాజాలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు భవానీ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాలకు చెందిన మైనర్, మేజర్ ఇరిగేషన్‌లపై మంత్రి, రైతు కమిషన్ సభ్యులతో చర్చించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం మైనర్ ఇరిగేషన్ ను మేజర్ ఇరిగేషన్‌తో కలపడం వల్ల చెరువులు మరమత్తులు జరగక, కబ్జాలకు గురై భూ గర్భ జలాలు అడుగంటుకు పోయాయని తెలిపారు. కమిషన్ ఇప్పటికే మైనర్ ఇరిగేషన్‌ను విడదీసి స్థానిక రైతులను నీటి సంఘాలుగా ఏర్పాటు చేసి భూ గర్భ జలాలు పెంపొందింపజేయడానికి తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఒక నివేదిక ఇచ్చినట్లు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మంత్రి బోసురాజుకు వివరించారు. అదేవిదంగా కర్ణాటక ఇరిగేషన్ మంత్రి బోసు రాజుతో కోదండరెడ్డి భవానీ రెడ్డిలు కలిసి కర్ణాటక రాష్ట్రంలో అమలవుతున్న మైనర్ ఇరిగేషన్ పాలసీపై చర్చించారు. కర్ణాటక మంత్రి బోసు రాజు సమాధానం ఇస్తూ నేను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి చర్చిస్తానని, మీరు మా రాష్ట్రానికి వచ్చి మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఒకసారి సందర్శించండి అని చెప్పడం జరిగింది.

సోషల్ మీడియా సైనికులే కాంగ్రెస్ పార్టీకి బలం : ఎంపీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీకి అధికారంలోకి రావడానికి ముఖ్య కారకులు సోషల్ మీడియా సైనికులే అని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు, మంగళవారం నాడు పెద్ద అంబర్ పేటలోని తన క్యాంప్ కార్యాలయంలో భువనగిరి పార్లమెంట్ సోషల్ మీడియా సైనికులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు, పార్టీ బలోపేతానికి తీసుకోవలసిన చర్యలపై వారికి దిశా నిర్దేశం చేశారు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రజాపాలన అందిస్తుందనీ సన్న బియ్యం, ఉచిత విద్యుత్తు, 500 కు గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, యువకులకు స్వయం ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం ఇలా పలు రకాల పథకాలను ప్రవేశపెట్టి ప్రజల కోసం పనిచేస్తుందనీ వీటన్నిటి గురించి ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చెయ్యాలని సూచించారు, ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా పార్టీ నాయకత్వాన్ని బలపరచాలని అన్నారు, కాంగ్రెస్ పార్టీ సముద్రం లాంటిదని, పనిచేసిన వారికి ఖచ్చితంగా సరైన సమయంలో సరైన పదవులు, సముచితమైన గౌరవం ఇస్తుందని తెలిపారు, రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా కంకణబద్దులు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పలు నియోజకవర్గాల నుండి సోషల్ మీడియా కోఆర్డినేటర్లు యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు మే 20న దేశవ్యాప్త సమ్మె

విశాలాంధ్ర, హైదరాబాద్ : కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను మార్చి యజమాన్యాలకు అనుకూలంగా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న నాలుగు లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ మే 20న జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతటానికై హైదరాబాదు నగరంలో విస్తృత ప్రచారం నిర్వహించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ పిలుపునిచ్చారు. మంగళవారం హిమాయత్ నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో హైదరాబాద్ జిల్లా కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా ప్రజలను మరొక మారు బానిసత్వంలోకి తీసుకు వెళ్లే పద్ధతుల్లో రాజ్యాంగాన్ని మార్చి మణిధర్మశాస్త్రాన్ని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నదని అందుకు ఉదాహరణ గతంలో రైతు చట్టాలను మార్చేందుకు ప్రయత్నించి విఫలమైందని ప్రస్తుతం కార్మిక చట్టాలను మార్చేందుకు ప్రయత్నిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని మెడలు వంచి లేబర్ కోడ్లను వెనక్కి పంపేందుకు కార్మిక వర్గం పోరాటాలు నిర్వహించాల్సి ఉన్నదని వారు తెలియజేశారు. రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రతి కార్మిక వాడలో ప్రజా సమూహంలో కార్మిక సంఘాలు తిరిగి ప్రచారం నిర్వహించి ప్రజలను కార్మికులను సమ్మెకు సన్నద్ధం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్మికులు ప్రజలు చైతన్య పరిచేందుకు ఈనెల 19న కోటి ప్రాంతంలో, మే 6న సికింద్రాబాద్ ప్రాంతంలో, మే 10న అమీర్పేట్ ప్రాంతంలో విస్తృతంగా కరపత్రాలు పంచి చైతన్య పరచాలని కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ మే 13న సెంట్రల్ లేబర్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాలని మే 18న హైదరాబాద్ నగర వ్యాప్తంగా బైక్ ర్యాలీలను నిర్వహించి మే 20న ఇందిరా పార్క్‌లో భారీ బహిరంగ సభను కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనట్లు వారు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షత వహించగా సిఐటియు నగర అధ్యక్షులు జె.కుమారస్వామి, టియుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ, ఐఎఫ్‌టియు నగర నాయకులు అరుణ, శివ బాబు, ఏఐయుటియుసి నాయకులు భరత్, టిఎన్టియుసి నాయకులు రత్నం, ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ పి వెంకటయ్య, ఉప ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజీ కాలనీలోని ఇందిరాగాంధీ మహిళా భవన్‌లో జరిగిన జనశక్తి సంస్థాన్ (స్కిల్ ఇండియా) మహిళా నైపుణ్య అభివృద్ధి కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. స్కిల్ డెవలప్మెంట్‌లో ట్రైనింగ్ పూర్తి చేసుకున్న మహిళలకు మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు జ్యోతి, సావిత్రీ, భారతి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గిరి, శేరిలింగంపల్లి నియోజకవర్గం సీనియర్ నాయకులు ఉరిటీ వెంకట్‌రావు, నర్సింగ్ ఠాకూర్, ప్రవీణ్, సునీల్ విశ్వనాథ్‌తో కలిసి సర్టిఫికేట్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మహిళా సాధికారతకు కట్టుబడి ఉందని, ఇందిరా మహిళా శక్తి పథకం వంటి కార్యక్రమాలను ప్రారంభించిందని, వడ్డీ లేని రుణాలు, స్కిల్ యూని వర్సిటీ ఏర్పాటు చేసి మహిళాలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు.ప్రమాద బీమాను అందిస్తోందని గుర్తు చేశారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రాజెక్టులకు క్రెడిట్ అందించడం, నిర్దిష్ట శిక్షణ, కౌన్సెలింగ్ నిర్వహించడం, సంబంధిత ప్రాజెక్టులపై సమాచారాన్ని సేకరించడం ద్వారా మహిళలను సాధికారపరచడమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రతి పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని జగదీశ్వర్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఆర్థిక స్వాతంత్ర్యం,సాంస్కృతిక పరిరక్షణ, మహిళా ప్రాతినిధ్యంపై దృష్టి సారించి,ప్రభుత్వం మహిళలకు సాధికారత కల్పించడం వారి పురోగతిని నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ ఓపెన్ పరీక్షలకు ఏర్పాట్లు

విశాలాంధ్ర, హైదరాబాద్ : జిల్లాలో టెన్త్ , ఇంటర్ ఓపెన్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి ఈ వెంకటాచారి సంబంధిత అధికారులను సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పది, ఇంటర్ ఓపెన్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై విద్యా, రెవెన్యూ, పోలీస్, వైద్య, పోస్టల్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 26 వరకు జరిగే పరీక్షలకు 73 సెంటర్లలో మొత్తం 15068 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 9:00 గంటల నుంచి 12:00 గంటల వరకు అలాగే మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఒక్కో పరీక్ష కేంద్రానికి ఒకరు చొప్పున సిట్టింగ్ స్క్వాడ్‌లు, అలాగే చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్మెంటల్ అధికారులను నియమించామన్నారు. 7 రూట్లలో రూట్ అధికారులను కేటాయించామని వెల్లడించారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లను అనుమతించరాదన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. పరీక్షలు జరిగే సమయంలో పరీక్ష కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్లను ముందుగా మూసివేయాలన్నారు. పది పరీక్షలకు 39 కేంద్రాలు, అభ్యర్థులు 7783 మంది అలాగే ఇంటర్ మీడియట్ పరీక్షకు 7285 మంది మొత్తం విద్యార్థులు 15068 మంది హాజరు అవుతున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో పారిశు ద్ధ్య పనులకు ప్రాధాన్యత చర్యలు చేపట్టాలని ముఖ్యాంగా కేంద్రాలలో నిరంతర విద్యుత్, తాగునీరు ఉండేలా చూడాలని మూత్రశాలల సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రశ్నాపత్రాలను పోలీస్ ఎస్కార్ట్‌తో ప్రభుత్వ వాహనంలో పరీక్షా కేంద్రాలకు తరలించాలని అన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ దృష్ట్యా ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను సూచించారు. పరీక్ష రాసే విద్యార్థుల గదుల్లో ఎలాంటి మెటీరియల్ లేకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పేపర్ల తనిఖీ నిర్వహించాలని తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని అన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈఓ ఆర్.రోహిణి, అదనపు డిసిపి రామదాసు తేజావత్, మెడికల్, విద్యుత్, పోస్టల్, ఆర్.టి.సి, జిహెచ్ఎంసి అధికారులు పాల్గొన్నారు.

యూపీఎస్సీ పరీక్షలపై సమీక్ష

హైదరాబాద్‌లో ఈ నెల 13న 22 కేంద్రాలలో నిర్వహించిన యూపీఎస్సీ సిడిఎస్, ఎన్‌డిఏ అలాగే ఎన్.ఎ పరీక్షలు హైదరాబాద్‌లో నిర్వహించిన సందర్భంలో కేంద్రాలలో సమస్యలు, లైన్ డిపార్ట్మెంట్ల అధికారులు, సిబ్బంది పరీక్షల నిర్వహణ తీరు, అభిప్రాయాలపై డిఆర్ఓ ఈ.వెంకటాచారి రూట్ ఆఫీసర్స్, సూపర్వైజర్లు, లైన్ డిపార్ట్మెంట్స్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై విచారణ జరపాలి :ఇందిరా శోభన్

విశాలాంధ్ర - హైదరాబాద్ :రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీఆర్ఎస్ పార్టీ చేయని ఆగడాలు లేవని కాంగ్రెస్ పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు ఇందిరా శోభన్ అన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీని కూల్చేందుకు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు కూడా డబ్బులిస్తామని చేసిన కామెంట్ పై ఆమె డీజీపీకి ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ పార్టీ కావాలనే కాంగ్రెస్ ప్రభుత్వం పై బురద చల్లే ప్రయత్నం చేస్తుందని ఫిర్యాదులో పేరొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాటల వెనుక కుట్ర కోణం ఉందని, దీనిపై పోలీసు విచారణ జరపాలని ఆమె కోరారు. కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో అశాంతిని రేకెత్తిస్తున్నట్లు, ప్రజలకు తప్పుడు మార్గదర్శకత్వం గురించి తీవ్రమైన ఆందోళనలను లేవనెత్తుతున్నట్లు కనిపిస్తోందని ఇందిరా శోభన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి ప్రకటనల ను దర్యాప్తు చేయకుండా వదిలేస్తే, ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని ఆమె అభిప్రాయ పడ్డారు. మైనార్టీ కమిషన్ చైర్మన్ ఓబేదుల్ల కొత్వాల్, పోతుగంటి నరేందర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇవిగో కేసీఆర్ ఆనవాళ్లు : ఎమ్మెల్సీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ సస్యశ్యామలంగా తీర్చిదిద్దారని చెప్పడానికి ఇదిగో ఆనవాళ్లు అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బాన్సువాడ నియోజకవర్గ కేంద్రం సమీపంలో మంజీరా నదిపై నిర్మించిన చింతల నాగారం చెక్ డ్యాంను ఆమె సందర్శించారు. మండు వేసవిలోనూ మత్తడి దుంకుతున్న ఈ చెక్ డ్యాం కేసీఆర్ తెలంగాణను పచ్చబడేయడానికి పడ్డ తపనను గుర్తు చేస్తుందన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో మంజీరా నదిపై ఇలాంటి నాలుగు చెక్ డ్యాంలు నిర్మించి రైతులు వాన కోసం ఎదురు చూడకుండా పంటలు పండించుకునేలా కేసీఆర్ చేశారన్నారు. ఈ ఒక్క చెక్ డ్యాం పై ఆధారపడి 1600 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు.

సత్ఫలితాలిస్తున్న పౌరసరఫరాల శాఖ సంస్కరణలు

- ఈ-పాస్ సిస్టం విజయవంతం
- సమర్థవంతంగా పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం

విశాలాంధ్ర - హైదరాబాద్ :తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం పౌర సరఫరాల శాఖలో తీసుకొచ్చిన సంస్కరణలతో అద్భుతమైన ఫలితాలు సాధించడం అభ్యినందగ్గ పరిణామమని గుజరాత్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖా ముఖ్య కార్యదర్శి రమేష్ చంద్ర మీనా పేర్కొన్నారు. అన్నింటికీ మించి పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టంలో ప్రవేశ పెట్టిన ఇ-పాస్ సిస్టం ప్రజా పంపిణీ వ్యవస్థలో లోపాలను సరిదిద్దేందుకు దోహదపడుతుందని ఆయన చెప్పారు. పౌర సరఫరాల శాఖాలో రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరం కాలంలో తీసుకొచ్చిన సంస్కరణలను అధ్యయనం చేసేందుకు ఆయన మంగళవారం రాష్ట్రంలో సందర్శించారు. ఈ సందర్భంగా పంజాగుట్ట, ఏ.జి కాలనీలలోని జనపోషణ కేంద్రాలను రాష్ట్ర పౌర సరఫరాల శాఖా ముఖ్య కార్యదర్శి డి.ఎస్.చౌహాన్ లతో కలసి ఆయన సందర్శించారు. పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం పారదర్శకంగా సాగేందుకు ఇ-పాస్ సిస్టం దోహదపడుతుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలను స్వాగతిస్తున్నామన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా నిరుపేదలకు ఉచితంగా అందిస్తున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం అద్భుతమని ఆయన ప్రశంశించారు. తెలంగాణా రాష్ట్ర బియ్యానికి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రోజు రోజుకు పెరుగుతున్న డిమాండ్ అహ్వానించదగ్గదని అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం పిలిప్పీన్‌కు బియ్యం ఎగుమతికి ఒప్పందం కుదుర్చుకోవడం అభినందనీయమని ఆయన కొనియాడారు. సన్న బియ్యం కొనుగోలులో క్వింటా ఒక్కింటికీ రూ.500 బోనస్ అందించడంతో పాటు మహాలక్ష్మి పథకం కింద అర్హులైన ఎల్పీజ్ లబ్ధిదారులకు 500 సబ్సిడీ అందించడాన్ని ఆయన అహ్వానించారు. ప్రజాపంపిణీ వ్యవస్థను పారదర్శకంగా నడిపించడంతో పాటు బలోపేతం చేసేందుకు తీసుకొచ్చిన సంస్కరణలు ధాన్యం కొనుగోలులో వచ్చిన మార్పులు మార్గదర్శనం గా నిలుస్తున్నాయని రమేష్ చంద్ర మీనా వ్యాఖ్యానించారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు రూ. 20.19 కోట్లు విడుదల : మంత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : బేస్‌మెంట్ పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు రూ. 20.19 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమచేయడం జరిగిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొదటి విడతలో పైలట్ ప్రాజెక్ట్ కింద మంజూరు చేసిన 70,122 ఇండ్లలో బేస్ మెంట్ పూర్తి చేసుకున్న 2019 మందికి లక్ష రూపాయిల చొప్పున రూ. 20.19 కోట్లు విడుదల చేశామని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి తెలిపారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆటంకం ఏర్పడకుండా నిధులు విడుదల చేస్తామన్నారు. ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, గ్రౌండింగ్ అయిన ఇండ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేస్తున్నామని ఇప్పటికి 13,500 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 12 మంది లబ్దిదారులకు మంగళవారం లాంఛనంగా లక్ష రూపాయిల చొప్పున చెక్కులను అందజేశారని తెలిపారు. నేరుగా వారి ఖాతాలోనే జమచేస్తామని తెలిపారు. నిర్మాణం పూర్తైన వెంటనే బేస్ మెంట్ పూర్తైన తర్వాత లక్ష రూపాయిలు, గోడలు పూర్తైన తర్వాత రూ.1.25 లక్షలు, శ్లాబ్ పూర్తిచేసుకున్న తర్వాత రూ.1.75 లక్షలు, ఇల్లు పూర్తైన తర్వాత మిగిలిన లక్ష రూపాయిలు విడుదల చేస్తామని వివరించారు. బేస్‌మెంట్ గాని గోడలు గాని శ్లాబ్‌గాని నిర్మాణం పూర్తిచేసుకుంటే అధికారుల కోసం ఎదురుచూడకుండా లబ్దిదారులే ఫోటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసినా కూడా డబ్బులు లబ్దిదారుల ఖాతాలో జమచేస్తామని తెలిపారు. కనీసం 400 ఎస్‌ఎఫ్‌టికి తగ్గకుండా 600 ఎస్ ఎఫ్‌టీకి మించకుండా లబ్దిదారులు ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ మరింత వేగవంతం చేయడం, అధికారులకు , ప్రజాప్రతినిధులకు సమన్వయం ఉండేలా ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నామని తెలిపారు.

రాజ్యాంగాన్ని కాపాడడమే కాంగ్రెస్ లక్ష్యం : వీర్లపల్లి

విశాలాంధ్ర -కొత్తూరు : గాంధీ , అంబేద్కర్ ,పూలే లాంటి ఎందరో మహానుభావుల ఆలోచనతో నిర్మించిన మన దేశ రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే ప్రధాన లక్ష్యంగా తీసుకొని రాహుల్ గాంధీ పిలుపుమేరకు కాంగ్రెస్ పార్టీ జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. అందులో భాగంగానే కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు గొంగొళ్ల హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కొత్తూరు మండలం వైఎం తండా, చింతగట్టు తండా, పులిచెర్లకుంట తండా, సిద్దాపూర్, ఎస్బీ పల్లి గ్రామాల మీదుగా కొడిచెర్ల వరకు చేపట్టిన పాదయాత్రలో ఎమ్మెల్యే శంకర్ తో పాటు మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి , మాజీ జెడ్పిటిసి మామిడి శ్యామసుందర్ రెడ్డి ,ఇంచార్జ్ జైపాల్ , కొత్తూరు ఉమ్మడి మండలాల మాజీ ఎంపీపీ ఎం శివశంకర్ గౌడ్ , కొత్తూరు మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ ,సిద్దాపూర్ శేఖర్ రెడ్డిలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వారికి ప్రజలు పూలతో స్వాగతం పలికారు. ముందుగా వారు గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామాల్లో నిర్వహించిన బహిరంగ సభల్లో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి , మాజీ జెడ్పిటిసి శ్యామసుందర్ రెడ్డిలు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చట్ట సవరణల పేరుతో ప్రజల స్వేచ్ఛ, సమానత్వం, ప్రశ్నించే హక్కులను హరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో రాజ్యాంగ విచ్ఛిన్నానికి కుట్ర చేస్తున్నారని ,దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని అన్నారు .గాంధీజీ కలలుగన్న భారత ప్రజాస్వామ్యం కోసం డా.బి.ఆర్ అంబేద్కర్ సారథ్యంలో రూపుదిద్దుకున్న రాజ్యాంగ మూల సూత్రాలకు భంగం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను, సన్న బియ్యం, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, గ్యాస్ పై సబ్సిడీ, సీఎం రిలీఫ్ ఫండ్, ఆరోగ్యశ్రీ ఇస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మెన్ బాబర్ అలీ ఖాన్ , సీనియర్ నాయకులు విశ్వం , రఘు , జమ్రుద్ ఖాన్ , ఇబ్రహీం ,నందిగామ మండల పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింహా, నాయకులు కొమ్ము కృష్ణ , కావలి కృష్ణ , తేజ , ఎస్బిపల్లి మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్, సీనియర్ నాయకులు మల్లారెడ్డి, ఎస్ కె ఖాజ, జంగయ్య, మాజీ ఎంపీటీసీ రామచందర్, రాందాస్ నాయక్, దయానంద గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పట్టణ కేంద్రాల్లో ఉపాధి పనులు చేపట్టాలి

విశాలాంధ్ర-మొయినాబాద్: పట్టణ కేంద్రాల్లో ఎన్ఆర్‌జీఎస్ పనులను వెంటనే చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలో జిల్లా సమితి సమావేశం జరిగింది. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ 2005ముందు ఎన్నో పోరాటాలు చేసి గ్రామీణ పేదలకు ఉపాధి కోసం ఒక సమగ్ర చట్టం కావాలని అప్పటి యూపీఏ ప్రభుత్వాన్ని కోరితే 2005సంవత్సరంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం చట్టరూపం దాల్చి అమలులోకి వచ్చిందని అన్నారు. అప్పటి నుంచి గ్రామీణ పేదలకు ఉపాధిగా ఉపయోగపడ్డ ఈ చట్టం మోదీ ప్రభుత్వం వచ్చిన తరువాత దీనికి నిధులు తగ్గించి రోజురోజుకు చట్టాన్ని నీవీర్యపరుస్తూ పథకాన్ని ఎత్తేసే దిశలో ఆలోచన చేస్తోందని ఆయన మండిపడ్డారు. ఈ పథకానికి ప్రతి సంవత్సరం రూ.2 లక్షల 86 వేల కోట్లు అవసరం ఉంటే కేవలం రూ.86 కోట్లు మాత్రమే కేటాయించి పథకాన్ని సక్రమంగా అమలు చేయకుండా రకరకాల అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా ఇలాంటివి మానుకొని పేదలకు ఉపయోగపడే ఈ పథకానికి అధిక నిధులు కేటాయించి 200 రోజులు పెంచి రూ.700 పెంచాలని మిగతా సౌకర్యాలు కల్పించాలని దానితో పాటు పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి పనిని ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంజయ్య, జంగయ్య, సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, లక్ష్మయ్య, కృష్ణ, స్వరూప, యశోద, నరసింహ్మ, మల్లేష్, రాములు, సత్తిరెడ్డి, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి

విశాలాంధ్ర, హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో భారతరత్న బాబా సాహెబ్ డాక్టర్ బీ అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం, సికింద్రాబాద్‌లోని రైల్‌నిలయం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్రవాల్, దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ కటి గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన ప్రధాన అధిపతులు, ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సంఘాల నుండి గుర్తింపు పొందిన కార్మిక సంఘాల నుండి సీనియర్ నాయకులు కూడా పాల్గొని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే రైల్వే జనరల్ అరుణ్ కుమార్ జైన్ సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, భారతీయులను విద్య, సామాజిక సంస్కరణల ద్వారా వారిలోని పూర్తి సామర్థ్యాన్ని వెలికితీయడం, ప్రేరేపించడం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గొప్పతనమని పేర్కొన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నిజమైన స్ఫూర్తిని అలవర్చుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే పర్సనల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో భారతదేశంలో సామాజిక న్యాయం అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీలో విజేతలకు జనరల్ మేనేజర్ అవార్డులను అందజేశారు. అంతకుముందు, దక్షిణ మధ్య రైల్వేకి చెందిన ఎస్.సి. ఎస్.టి, ఓ.బీ.సీ, గుర్తింపు రైల్వే ట్రేడ్ యూనియన్ నాయకులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పట్ల, తమ అభిప్రాయాలను వెల్లడించారు.

నేడే ఒడిశాలో సింగరేణి నైనీ బొగ్గు బ్లాక్ ప్రారంభం

విశాలాంధ్ర, హైదరాబాద్ : సింగరేణి సంస్థ తన 13 దశాబ్దాల చరిత్రలో తొలిసారిగా ఇతర రాష్ట్రంలో బొగ్గు తవ్వకాన్ని ప్రారంభించనుంది. ఒడిశా రాష్ట్రంలోని అంగూల్ జిల్లాలో సింగరేణి సంస్థకు కేటాయించిన నైనీ బొగ్గు బ్లాక్‌ను నేడు బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రం వరకే పరిమితమై బొగ్గు గనులు నిర్వహిస్తున్న సింగరేణి ఇప్పుడు నైనీ బొగ్గు బ్లాక్ ద్వారా ఇతర రాష్ట్రాల్లోకి అడుగు పెట్టడాన్ని ఒక చరిత్రాత్మక ఘట్టంగా పేర్కొన్నారు.

తొమ్మిదేళ్ల సుదీర్ఘ నిరీక్షణ...

2016 మే నెలలో ఈ గనిని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ వారు సింగరేణికి కేటాయించినప్పటికీ, అన్ని రకాల అనుమతులు సాధించి, గనిలో తవ్వకం ప్రారంభించడానికి తొమ్మిదేళ్ళ సుదీర్ఘ కాలం నిరీక్షించాల్సి వచ్చింది. చివరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రత్యేక చొరవ చూపుతూ అప్పటి కేంద్ర బొగ్గు శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని, ప్రస్తుత బొగ్గు శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిని కలిసి విజ్ఞప్తులు చేశారు. అలాగే ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు ఒడిశా రాష్ట్రంలో ప్రత్యేకంగా పర్యటించి ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రితోనూ, సంబంధిత అధికారులతోనూ సంప్రదింపులు జరిపి గని ప్రారంభానికి మార్గం సుగమం చేశారు. దీంతో చివరికి సింగరేణీయుల చిరకాల స్వప్నం సాకారమైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ వల్ల సింగరేణికి అతిపెద్ద బొగ్గు బ్లాక్ లభించింది. తద్వారా వార్షిక అధికోత్పత్తి సాధనకు మార్గం సుగమమై సంస్థ ఆర్థిక పటిష్టతకు దోహదపడనుంది.

నైనీ బొగ్గు బ్లాక్ విశేషాలు

ఈ గనిలో 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు తవ్వితీయటానికి అవకాశం ఉంది. ఈ గనిలో ఉత్పత్తి పూర్తిస్థాయికి చేరుకుంటే ఏడాదికి 10 మిలియన్ టన్నులు అనగా కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుంది. సింగరేణిలో ప్రస్తుతం ఉన్న 17 ఓపెన్ కాస్ట్ గనుల కన్నా ఇదే అతి పెద్ద గని కానున్నది. ఏడాదికి కోటి టన్నుల చొప్పున 38 సంవత్సరాల పాటు ఈ గని నుండి బొగ్గు తవ్వి తీయనున్నారు. తెలంగాణలో ప్రస్తుతం గల సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో ఒక టన్ను బొగ్గు తవ్వి తీయడానికి సగటున 12 టన్నుల ఓవర్ బర్డెన్ (పై మన్ను) తొలగిస్తుండగా ఈ గనిలో మాత్రం ఒక టన్ను బొగ్గుకు కేవలం రెండున్నర క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తీస్తే సరిపోతుంది. కనుక ఈ గని సింగరేణికి లాభదాయకమైనదే అని భావిస్తున్నారు. ఈ గనిలో మేలైన జీ - 10 రకం నాణ్యమైన బొగ్గు లభిస్తోంది. ఈ గనిలో, ఓవర్ బర్డెన్ తొలగించడానికి, బొగ్గు తవ్వకానికి , బొగ్గు రవాణాకు సంబంధించి ఇప్పటికే కాంట్రాక్ట్ లను అప్పగించారు .ఇక్కడ ఉత్పత్తి చేసే బొగ్గును ప్రస్తుతం రోడ్డు మార్గం ద్వారా సమీపంలోని జరపడ రైల్వేసైడింగ్ కు రవాణా చేసి ,అక్కడి నుండి వినియోగదారులకు సరఫరా చేయనున్నారు.అయితే ఈ ప్రాంతంలోగల ఇతర బొగ్గు కంపెనీలతో కలిసి ఒక ప్రత్యేక 60 కిలోమీటర్ల రైలు మార్గాన్ని నిర్మించడం కోసం కూడా ప్రయత్నాలు ప్రారంభించారు. మరో మూడేళ్లలో ఇది కార్యరూపం దాల్చే అవకాశం ఉంది. నైనీ బొగ్గు బ్లాకు కోసం మొత్తం 2255 ఎకరాల భూమి సేకరించారు. దీనిలో 1935 ఎకరాల అటవీ భూమి, 320 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ భూమి ఉంది.

జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పెద్ద ఎత్తున పాదయాత్ర జై బాపూ,జై భీమ్,జై సంవిధాన్ అనే నినాదంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ ఎం సి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రతి డివిజన్‌కు కాలినడకతో ప్రజల మధ్యకు వెళ్లి మన దేశం, మన రాజ్యాంగం గొప్పతనం తెలుపుతూ ప్రజలలో చైతన్యం కలిగిస్తూ ముందుకు కొనసాగిస్తున్నారు.అనంతరం మంగళవారం 12వ రోజు బాచుపల్లి సాయి నగర్ 21వ డివిజన్ నందు పాదయాత్ర కార్యక్రమం నిర్వహిస్తు ఇంటింటికి కరపత్రాలు అందజేస్తూ ప్రజల మధ్యకు వెళ్లారు. ఈ సందర్భంగా కొలను శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం గొప్పతనం తెలుపుతూ ప్రజలలో చైతన్యం కలిగిస్తున్న జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ అనే ఈ కార్యక్రమానికి మాతోపాటు మీరందరూ పాల్గొని మీ వంతు బాధ్యతను మీరు నిర్వహిస్తున్నందుకు ఎంతో గర్వపడుతున్నామన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిట్ల దివాకర్, జగదీష్ యాదవ్, చౌదరి,కడియాల ఇందిరా,ప్రవీణ్,మల్లికార్జున్,ఏనుగుల మధుసూదన్ రెడ్డి,శ్రీశైలం యాదవ్, ఏలూరి సత్య ,వీరబాబు,స్టీల్ రమేష్,సయ్యద్ రఫత్,సాంబశివరావు,ఆంజనేయ వర్మ,సురేందర్ యాదవ్,నారాయణరెడ్డి,జక్కా మధుసూదన్, సురేష్ యాదవ్, సంతోష్, శ్రీనివాస్ చారి, శ్రీను, శేఖర్, గిరి, కళ్యాణ్, కార్తీక్, తిరుపతి, గజ్జల యాదమ్మ, నిర్మల, నాగరాణి, చంద్రకళ, అంజలి, అఖిల్, అక్బర్, వాజిద్, గౌస్, అస్గర్, అంజయ్య, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్ విధానం రద్దుచేయాలని నిరసన

విశాలాంధ్ర, ఘట్‌కేసర్ : స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లతో తమ జీవనోపాధి కోల్పోయి తమ బతుకులు రోడ్డున పడుతాయని పాత పద్ధతినే కొనసాగించాలని కోరుతూ ఘట్‌కేసర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యలయం వద్ద తెలంగాణ డాక్యుమెంట్ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో ప్లేకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా స్లాట్ బుకింగ్‌తో రిజిస్ట్రేషన్లతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందని గుర్తు చేశారు. అంతేకాకుండా ఇన్ని రోజులు డ్యాక్యుమెంట్ రైటర్లుగా జీవనోపాధి పొందుతూ మరికొంత మందికి ఉపాధి కల్పిస్తున్నామని, స్లాట్ బుకింగ్‌తో తమతో పాటు దీనిపై ఉపాధి పొందుతున్న వేలమంది రోడ్డున పడుతారని తెలిపారు. ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానాన్ని వెనకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డాక్యుమెంట్ రైటర్స్ ఫోరం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చట్టబద్ధంగా రిజిస్టర్ సంఘాలకే ప్రాధాన్యత

విశాలాంధ్ర-బషీర్ బాగ్: చట్టబద్ధంగా రిజిస్టర్ అయిన సంఘాలకే అధికార పార్టీ నేతలు ప్రభుత్వ అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్ద విజయ్ కుమార్ కోరారు. మంగళవారం ముదిరాజ్ మహాసభ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీలను బాధ్యులను నియమించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొందరు స్వార్థపరులు అవకాశవాదులు తమ పబ్బం గడుపుకోవడానికి ముదిరాజ్ కులాన్ని రాజకీయ అవసరాలకు స్వార్థానికి వాడుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారి పట్ల ముదిరాజ్ కులస్తులు రాజకీయ పార్టీ నేతలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. ప్రధాన సంఘాల నేతలను పక్కకు పెట్టి అవసరం కోసం పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి రోజుకో సంఘం పెట్టుకునే వాళ్లు నిర్వహించే కార్యక్రమాలకు వెళ్లి అధికార పార్టీ నేతలు అభాసపాలు కావద్దని హితవుపాలికారు. జిల్లా ముదిరాజ్ మహాసభ భవనం శ్రీనివాస్ కాలనీలో ఉందని ఇది 1150 రిజిస్టర్ నెంబర్ తో ఒక ట్రస్టు, ఫౌండర్ మెంబర్స్ తో కూడుకున్న కమిటీ ముదిరాజుల్ కోసం కొన్న స్థలం అని ఈ మధ్యలో కొందరు స్వార్థపరులు అప్పటికప్పుడే సంఘాలను తయారు చేసుకుని వాట్సప్ గ్రూపులలో ముదిరాజ్ భవనంపై తప్పుడు వార్తలు ప్రచారం చేస్తూ ముదిరాజులను తప్పుదోవ పట్టిస్తున్నారని, అధికార పార్టీ ఈ విషయంలో వాస్తవాలను గమనించి మసలుకోవాలని సూచించారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పనిచేసే కార్యవర్గానికి మద్దతు ఉండి ముదిరాజ్ భవనం అభివృద్ధికి ముదిరాజుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: పఠాన్‌చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్‌తో కలిసి కుటుంబ సమేతంగా శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ జహంగీర్ పీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా నూతన వధూవరులు రాగం జాగృతి అనిరుధ్ యాదవ్ దర్గాలో చాదర్ సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. తన డివిజన్, నియోజకవర్గం ప్రజలు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఆనందంగా ఉండాలని ప్రార్ధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజోత్సవ సభకు తరలివెళ్దాం

విశాలాంధ్ర -మొయినాబాద్: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రజోత్సవ సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లామని మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, బాకారం జాగీర్ గ్రామ మాజీ సర్పంచ్ కొత్తపల్లి రాఘవరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రజోత్సవ సభకు సంబందించి మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్కేపల్లిలో వాల్‌పోస్టర్ మంగళవారం సాయంత్రం ఆయన విడుదల చేశారు. అనంతరం రాఘవరెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ 27న వరం గల్లో నిర్వహించనున్న రజోత్సవ సభకు అందరం కలిసికట్టుగా అధిక సంఖ్యలో తరలివెళ్లామని సూచించారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకుల సమిష్టి కృషితో సభను విజయవంతం చేసేందుకు మండలం నుంచి అందరం తరలివెళ్లి విజయవంతం చేద్దామని తెలిపారు. బీఆర్ఎస్ మండల యువజన విభాగం నాయకుడు అరవింద్ రజక, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల శ్రీనివాస్, దప్పు కరంచంద్, కుమ్మరి శ్రీనివాస్, ఈదులకంటి రవీందర్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర - కొత్తూరు : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు టంగుటూరి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కొత్తూరు మండల సమితి తో కలిసి ఎంపీడీవో అరుందతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం ఏడు గంటల వరకు పనిచేస్తున్నారని, వారు ఎల్లప్పుడు ప్రజల సంరక్షనే లక్ష్యంగ మంచినీరు, పారిశుద్ధ్యం ,వీధి దీపాలు, వన సంరక్షణతో పాటు అధికారులకు, ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. కానీ వారికి ఇస్తున్న చాలిచాలని జీతాలతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఐదు, ఆరు నెలల నుంచి జీతాలు పెండింగ్‌లో ఉండడంతో ఎం చేయాలో అర్థం కాక లబోదిబో మంటున్నారన్నారు.వెంటనే ప్రభుత్వం స్పందించి గ్రామపంచాయతీ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి 2 PRC పరిధిలోకి తీసుకోవాలి, 51 జీవోను సవరించాలి, సహజ మరణానికి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్ రెడ్డి, బిక్షపతి ,ఎర్ర దేవయ్య, సురేష్ ,జంగమ్మ, సురేష ,రాములు ,కృష్ణయ్య ,మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు .

ధాన్యంకు గిట్టుబాటు ధర : ఎమ్మెల్యే

- ఆమనగల్లు: కొనుగోలు కేంద్రాలు రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేందుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. మంగళవారం తలకొండపల్లి మండలం పడకల్లు గ్రామంలో ప్రొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ గీతా నరసింహ, పిఎసిఎస్ కేశవరెడ్డి మండల అధ్యక్షులు దోకూరు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. అర్హులైన నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తాం అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. వెంకటాపూర్ తండా,పెద్దూరు తండా, దేవుని పడకల్లు, కడ్తాల్ ఆయా గ్రామాలలో జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాలను ఎగురవేసి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అవమాన పరిచేల వ్యాఖ్యలు చేస్తున్నారని వారి వ్యాఖ్యలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి

విశాలాంధ్ర - ఆమనగల్లు: అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకుంటున్న బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని టిపిసిసి సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం ఆమనగల్లు మండల కేంద్రంలో రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న జై బాపు జై భీమ్ జై సంవేదాన్ పాదయాత్ర ముఖ్య నాయకులతో కలిసి శ్రీనివాస్ గౌడ్ విస్తృతంగా చేపట్టారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు వివరిస్తూ వెళుతుంటే ప్రజలనుండి మంచి స్పందన వచ్చిందని, వాస్తవాలను ప్రజలకు తెలియ చెప్పేందుకే జై బాపు జై భీం జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం చేపట్టామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు అందించిన అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేసే విధంగా, దేశంలో బిజెపి ప్రభుత్వం ఏ విధంగా రాజ్యాంగాన్ని అవమానిస్తూ కించపరుస్తూ వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేస్తూ, అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకుంటున్న బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని పార్టీ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు .

సమస్యలు పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర కాప్రా : నాచారం డివిజన్ పరిధిలోని పటేల్ కుంట చెరువులో గుర్రపు డెక్క పెద్ద ఎత్తున నిలిచి ఉండడంవల్ల దోమలు పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను కంటిమీద కొనుక్కు లేకుండా చేస్తున్నాయని వెంటనే గుర్రపు డెక్కను తొలగించాలని డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్ మంగళవారం జోనల్ కమిషనర్ కు వినతి పత్రం అందించారు. అందులోనే భాగంగా నాచారం హిందూ స్మశాన వాటికలోని అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. నాచారం పెద్ద చెరువు వద్ద ఏర్పాటు చేసిన విధి దీపాలు పనిచేయడం లేదని వాటిని మరమ్మతులు చేపట్టాలని కార్పొరేటర్ జోన్ కమిషనర్‌కు తెలిపారు. జోనల్ కమిషనర్ స్పందిస్తూ వెంటనే చర్యలు తీసుకొని గుర్రపు డెక్కన్, ముందు స్మశాన వాటికలోని అభివృద్ధి కోసం నిధులు, పెద్ద చెరువు వీధిదీపాలు మరమ్మతులు చేపడతామన్నారని డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్ చెప్పారు.

యువ ఫిల్మ్ మేకర్స్ 'కీప్‌ఇట్‌షార్ట్' ఓటీటీ ప్లాట్‌ఫామ్ ప్రారంభం

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : యువ ఫిల్మ్ మేకర్స్ ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా సినీ స్టోర్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో కీప్‌ఇట్‌షార్ట్ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా సినీస్టోర్ టెక్నాలజీస్ సీఈఓ నాగేందర్ పోలమరాజు మాట్లాడుతూ ఇది దేశంలోనే మొదటి ఫిల్మ్, యానిమేషన్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఓటీటీ ప్లాట్‌ఫామ్ అన్నారు. యువ ఫిల్మ్ మేకర్స్‌కు ప్రారంభ వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఈ ప్లాట్‌ఫామ్ ప్రతిభను వెలికి తీసేందుకు, గుర్తింపు పొందేందుకు ఇతరులతో కలిసే అవకాశం పొందేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 1,500 పైగా ఫిల్మ్ ఇనిస్టిట్యూషన్స్, 1,200 యానిమేషన్ ఇన్స్టిట్యూట్లకు చెందిన ఐదు లక్షలపైగా ప్రస్తుత, పూర్వ విద్యార్థులు కలరన్నారు. ఈ ప్లాట్‌ఫామ్ ప్రారంభంలో వెయ్యి నుంచి పన్నెండు వందల షోరీల్స్ లేదా టీమ్ ఎంట్రీలు (ఒక్కో టీమ్‌లో కనీసం ఐదుగురు సభ్యులు) అందుకుంటుందని అంచనా ఉందన్నారు. ఈ కీప్‌ఇట్‌షార్ట్ వేదిక వినూత్న డిజిటల్ టూల్స్ అందుబాటులోకి తెచ్చి డేటా ఆధారిత నిర్ణయాల ద్వారా సినిమా తయారీ వ్యవస్థను ప్రజలందరికీ అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన ఈ ప్లాట్‌ఫామ్ దర్శకత్వం, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, కథా రచన, స్క్రీన్ రైటింగ్ రంగాల్లో సృజనాత్మకతకు ఒక వేదికను అందిస్తుంది తెలిపారు. కొత్త కథలు, వినూత్న ఆలోచనలు వినిపించే విద్యార్థుల కోసం ఇప్పటికే స్కౌటింగ్ చేస్తున్నారన్నారు. వినోద రంగంలో కొత్త శైలితో కూడిన ప్రతిభను వెలికితీయడంలో కీలక పాత్ర పోషించనుందని పేర్కొన్నారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

విశాలాంధ్ర -కొత్తూరు : ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమైన ఘటన కొత్తూరు మున్సిపాలిటీ , కుమ్మరి గూడ గ్రామంలో మంగళవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..కొత్తూరు మున్సిపాలిటీ పరిధి, కుమ్మరి గూడ గ్రామ శివారులో ఉన్న గోధుమ కుంట చెరువులో పడి ఎవరో గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి శవం పైకితేలి ఉండడాన్ని గమనించిన గ్రామస్తులు 14న సాయంత్రం 4 గంటల సమయంలో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని చెరువులో నుండి బయటికి తీశారు. మృతిని జేబులో లభించిన ఆధార్ కార్డు ఆధారం ప్రకారం అతని పేరు షఫీ ఆలం (33), అబ్బా బకర్పూర్ గ్రామం,పోస్ట్, వైశాలి జిల్లా, బీహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతుడు తెల్లటి ఆఫ్ బనియన్, నల్లటి ప్యాంటు ధరించి ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని షాద్నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించి, పోలీసు సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ ఐ మురళి గౌడ్ తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

ఆర్థిక నేరగాళ్లను శిక్షించాలి

విశాలాంధ్ర-అనంతపురం: విదేశాల్లో ఆశ్రయం పొందుతున్న ఆర్థిక నేరగాళ్లను దేశానికి రప్పించి, శిక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. దేశంలోని బ్యాంకుల నుంచి కోట్ల రూపాయల రుణం తీసుకొని, వాటిని చెల్లించకుండా విదేశాలకు పలాయనం సాగించిన పారిశ్రామికవేత్తలపై చర్యలు ఏవని పాలకులను నిలదీశారు. ఆర్థిక నేరగాళ్లను అరెస్టు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ముస్లింల ఆందోళనలపై, వాటికి మద్దతిచ్చే పార్టీలు, నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులపై కేసులు పెట్టడం గర్హనీయమన్నారు. ఇలాంటి చర్యలతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26ను ఉల్లంఘిస్తున్నారని రామకృష్ణ ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతపురంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చు పెడుతోందని విమర్శించారు. మత సంస్థల ఆస్తులను కొల్లగొట్టడమే లక్ష్యంగా పెట్టుకుందని, అందుకే వక్ఫ్ బోర్డులో ముస్లింయేతరులను సభ్యులుగా పెట్టేలా చట్టాన్ని సవరించిందన్నారు. వక్ఫ్ సవరణ చట్టానికి పార్లమెంటు ఆమోదించిన మరుసటి రోజు క్రైస్తవుల ఆస్తులు, ఆలయ భూములపై ఆర్ఎస్ఎస్ మ్యాగజైన్‌లో కథనం ప్రచురితమైందని రామకృష్ణ గుర్తుచేశారు. వక్ఫ్ సవరణ బిల్లు ముస్లింలకు వ్యతిరేకం కాదని, కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు వ్యతిరేక ప్రచారం చేస్తున్నాయని, రెచ్చగొడుతున్నాయని ప్రధానమంత్రి స్థాయిలో ఉండి మోదీ వ్యాఖ్యలు చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. ఎన్డీయే కేబినెట్‌లో ఒక్క ముస్లింనకూ స్థానం లేనప్పుడు... ఆ పార్టీ ముస్లింల సాధికారత గురించి ఆలోచిస్తుందా అని రామకృష్ణ ప్రశ్నించారు. హిందూత్వంపై రభస చేయడం తప్ప ఇప్పటివరకు హిందువుల కోసం మోదీ ప్రభుత్వం చేసినదేమిటని నిలదీశారు. మోదీ హయాంలో పేదరికం, నిరుద్యోగం పెరిగాయని, అంతర్జాతీయ స్థాయిలో రూపాయి మారక విలువ పడిపోయిందని విమర్శించారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకు రావడం ద్వారా రాజ్యాంగంపై లౌకికవాదంపై మోదీ ప్రభుత్వం దాడి చేసిందని రామకృష్ణ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ప్రమాదకర పరిస్థితులపై ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. 'తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డుకు సంబంధించి ఎన్నో కార్యక్రమాలలో గోశాల నిర్వహించడం ఒక భాగం. టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ ఎమ్మెల్యే తెలిపిన అంశాన్ని సున్నితంగా పరిష్కరించుకోవడం మానేసి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడడం సరికాదు' అని తాజా వివాదంపై రామకృష్ణ వ్యాఖ్యానించారు. సమావేశంలో సీపీఐ పుట్టపర్తి జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, అనంత సహాయ కార్యదర్శి నారాయణస్వామి, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి సంతోశ్ కుమార్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.కేశవరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు లింగమయ్య, నగర సహాయ కార్యదర్శి రమణ, అలిపిర పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టం... రాజ్యాంగం – లౌకికవాదంపై దాడి: రామకృష్ణ

రామకృష్ణకు యూజేఏసీ వినతి

వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా అనంతపురంలో జరిగిన యునైటెడ్ జేఏసీ ర్యాలీలో ఇద్దరు యువకులు పలస్తీనా జెండాలు ప్రదర్శించడంపై బీజేపీ ఫిర్యాదు చేయడం వివాదాస్పదంగా మారింది. ఇది పొరపాటున జరిగిందని, మత విద్వేషాలు రెచ్చగొట్టే ఆలోచన లేదని ర్యాలీ నిర్వాహకులు స్పష్టత ఇచ్చారు. ఇదే విషయంలో జేఏసీ నేతలు మంగళవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను కలిసి... తమకు మద్దతుగా నిలవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. రామకృష్ణ కూడా సానుకూలంగా స్పందిస్తూ డీజీపీతో మాట్లాడతానన్నారు.

నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలి: రామకృష్ణ

విశాలాంధ్ర-కూడేరు: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, వారికిచ్చే పరిహారాన్ని పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు మండలం ముద్దలాపురం, కదరకుంట, సోలసముద్రం గ్రామలలో పర్యటించారు. అకాల వర్షాలతో చేతికి వచ్చిన అరటి, మామిడి, బొప్పాయి వంటి ఉద్యయవన పంటలు పూర్తిగా దెబ్బతిన్న తోటలను సందర్శించి రైతులను పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కదరగుంట గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ, సోలసముద్రం గ్రామానికి చెందిన కేశన్న, వెంకటనారాయణ తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. మంత్రులు అచ్చె నాయుడు, పయ్యావుల కేశవ దృష్టికి రైతుల సమస్యలను తీసుకెళతామన్నారు. రామకృష్ణ వెంట సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, కార్యదర్శివర్గ సభ్యులు కేశవరెడ్డి, గోపాల్, కార్యవర్గ సభ్యులు రమణ, రాజేశ్ గౌడ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణుడు, సీపీఐ తాలూకా కార్యదర్శి జె. మల్లికార్జున, ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సంగప్ప, రమణ, భీమన్న ఉన్నారు.

ఐరాస ప్రపంచ ఆహార పథకంతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వ్యవసాయ వాతావరణ మార్పులు, వాటిని తట్టుకునే వివిధ అంశాలపై మంగళవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో ఐక్యరాజ్య సమితి ప్రపంచ ఆహార పథకం సంస్థతో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కీలక అవగాహనా ఒప్పందం చేసుకుంది. శ్రీలంక, భారతదేశంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిస్థితులకు అనుగుణమైన వాతావరణ వ్యవసాయ కార్యాచరణ ప్రణాళికపై ఒప్పంద పత్రాన్ని మార్చుకున్నారు. ప్రపంచ ఆహార పథకం డైరెక్టర్, మనం దేశం తరఫున ఎలిజబెత్ ఫెయిరీ, రాష్ట్ర వ్యవసాయ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ పథకాన్ని ఆంధ్ర ప్రదేశ్, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల్లో 5 సంవత్సరాల వరకు అమలు చేయనున్నారు. ఏపీలో రైతు సాధికార సంస్థ అధ్వర్యంలో మొట్ట మొదటగా వైఎస్ఆర్ కడప జిల్లాలో అమలు చేస్తారు. పథకం డైరెక్టర్ ఎలిజబెత్ ఫెయిరీ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా అమలు పరిచే విధానాల వల్ల చిన్న, సన్నకారు, మహిళా రైతులు తీవ్రంగా మారుతున్న వ్యవసాయ వాతావరణ పరిస్థితులకు తట్టుకుని సుస్థిర వ్యవసాయం సాధించే దిశగా వారిని బలోపేతం చేయడానికి దోహదపడుతుందని తెలిపారు. బుడితి రాజశేఖర్ మాట్లాడుతూ ఈ ఒప్పందం వల్ల చిన్న రైతులకు వారి ప్రాంతాలకు అనుగుణమైన స్థానిక సమాచార సూచనలను పొందటం వల్ల ఎప్పటికప్పుడు మార్పులు చేసుకుంటూ వాతావరణ వ్యతిరేక పరిస్థితుల నుంచి పంటలను రక్షించుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చీఫ్ ఫారెస్ట్ అధికారి డాక్టర్ పి.వి.చలపతి రావు, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ శారద జయలక్ష్మీ, ఆహార పథకం కోఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్ మాయసేన్, రైతు సాధికార సంస్థ అధికారి బి.రామారావు, వాతావరణ శాఖ నుంచి కరుణ సాగర్, వ్యవసాయ శాఖ నుంచి వి.వి.విజయలక్ష్మీ, డి.హరిబాబు చౌదరి పాల్గొన్నారు.

19న రాఘవాచారి సంపాదకీయాల సంపుటి ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అక్షర శస్త్రధారి, విశాలాంధ్ర పూర్వ సంపాదకులు సీ రాఘవాచారి సంపాదకీయాలు–నాల్గవ సంపుటి (జాతీయ అంశాలు) ఆవిష్కరణ సభ ఈనెల 19వ తేదీ శనివారం సాయంత్రం 5 గంటలకు విజయవాడ సిద్ధార్థ అకాడమీ ఆడిటోరియంలో జరగనుంది. సీ రాఘవాచారి ట్రస్ట్, విజయవాడ అధ్వర్యంలో నిర్వహించే సభకు విశాలాంధ్ర సంపాదకులు ఆర్వీ రామారావు అధ్యక్షత వహిస్తారు. సంపుటిని సీపీఐ కేంద్ర కార్యదర్శి డాక్టర్ కే నారాయణ ఆవిష్కరిస్తారు. దారి–దీపం సంపాదకులు డీవీవీఎస్ వర్మ సభకు పరిచయం చేస్తారు. ఈ సభలో సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కే రామకృష్ణ, విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ సందేశాలిస్తారు. ఈ ఆవిష్కరణ సభకు అందరూ సకాలంలో హాజరు కావాలని సీ రాఘవాచారి ట్రస్ట్ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

లేబర్ కోడ్‌ల రద్దుపై 25న రాష్ట్ర సదస్సు

మే 20న దేశ వ్యాప్త సమ్మె జయప్రదం చేయాలి

రాష్ట్ర స్థాయి కార్మిక సంఘాలు

విశాలాంధ్ర-విజయవాడ: మే 20న దేశ వ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాల సమ్మె పిలుపు జయప్రదంలో భాగంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ల రద్దుకు డిమాండ్ చేస్తూ ఈనెల 25న రాష్ట్ర సదస్సును విజయవాడ యంబీవీకే ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్మిక సంఘాలు వెల్లడించాయి. విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో రాష్ట్ర స్థాయి కార్మిక సంఘాల నాయకుల సమావేశం మంగళవారం జరిగింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఈ రాష్ట్ర సదస్సు అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచారం చేస్తామని, మొత్తం ప్రజానీకానికి సమ్మె అవసరాన్ని తెలియజేసి జయప్రదానికి కృషి చేస్తామని చెప్పారు. కార్మిక పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లు రూపొందించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులతో కనీసం ప్రతిపాదనగానీ, చర్చించటంగానీ చేయలేదని మండిపడ్డారు. చట్ట సభల్లో ప్రతిపక్షాలు వ్యతిరేకించినా ఏకపక్షంగా లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదించుకున్నారని అన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక శాఖ అధికారులు, ఆ శాఖ రాష్ట్ర మంత్రులు చర్చలతో సరిపెట్టి ఆమోదించుకున్నారని, ఇది ఏ పాటి ప్రజాస్వామ్యమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్పొరేట్ కంపెనీల లాభాల కోసమే కార్మిక చట్టాల రద్దు అని, వాటి స్థానంలో లేబర్ కోడ్‌ల అమలుకు పూనుకుంటున్నారని ధ్వజమెత్తారు. సుదీర్ఘకాలంగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు పి.గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ లేబర్ కోడ్‌ల అమలుతో కార్మికుల పనిగంటలు పెరుగుతాయని, ఆరోగ్య భద్రత, ఆహార భద్రత, యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కులు, సమ్మె చేసే హక్కులు కోల్పోతామని అన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరావు, ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర కార్యదర్శి జాస్తి కిషోర్ బాబు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు సుధీర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎం.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఎన్.వి.కృష్ణా, టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షులు మరీదు ప్రసాద్ బాబు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.కేశవరావు, సీఐటీయూ నాయకులు ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, ఎ.వెంకటేశ్వరరావు, కె.దుర్గారావు, ఏఐఎఫ్‌టీయు(న్యూ) జిల్లా నాయకులు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పరువు కాపాడారు

'షైనింగ్ స్టార్స్- 2025'లో మంత్రి లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మీరంతా ప్రభుత్వ విద్య పరువు కాపాడారని, ప్రభుత్వ కళాశాలల్లో చదివిన వారికి మంచి మార్కులు రావన్న ముద్ర చెరిపేశారని విద్య, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రశంసించారు. 'మీరంతా విజేతలు...మీకు హ్యాట్సాఫ్... మీ అందరితో ఇలా కూర్చోవడం నా అదృష్టం... మిమ్మల్ని చూసి చాలా గర్వపడుతున్నా' అని లోకేశ్ భావోద్వేగానికి గురయ్యారు. ప్రైవేట్ ఇంటర్ కాలేజీలకు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యనభ్యసించి మార్కుల్లో రాష్ట్రస్థాయి టాపర్‌లుగా నిలిచిన 52 మంది విద్యార్థులను మంత్రి లోకేశ్ అభినందించి... సన్మానించారు. ఉండవల్లి నివాసంలో జరిగిన 'షైనింగ్ స్టార్స్–2025' కార్యక్రమంలో విద్యార్థులకు గోల్డ్ మెడల్, ల్యాప్ ట్యాప్‌లు ప్రదానం చేశారు. అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ పేదరికం వల్ల విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలను తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. జూనియర్ కాలేజీల విషయానికి వస్తే వైసీపీ ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన పథకాన్ని రద్దు చేశారని, పాయకాపురంలో ఓ చెల్లితో మాట్లాడినప్పుడు... తల్లిదండ్రులను కోల్పోయిన తనను చేపలమ్మి వాళ్ల అమ్మమ్మ చదివిస్తోందని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరించడం వల్ల ఆమెపై భారం తగ్గిందని చెప్పారన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివిన వారికి మంచి మార్కులు రావనే ముద్ర చెరిపేశారని, ఇవాళ మీరందరూ బ్రాండ్ అంబాసిడర్లని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో వసతులు మెరుగుపరుస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

చిత్తూరు జిల్లాలో కొత్త ప్రైవేట్ హోమియోపతి కళాశాల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆయుష్ వైద్య విధానాలను ప్రాచుర్యంలోకి తీసుకొచ్చేందుకు కేంద్రంలో, ఆంధ్ర ప్రదేశ్‌లోని ఎన్డీఏ ప్రభుత్వాలు ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో చిత్తూరు జిల్లాకు కొత్త ప్రైవేట్ హోమియోపతి కళాశాల మంజూరయింది. ఇప్పటివరకు ఆంధ్ర ప్రదేశ్‌లో నాలుగు ప్రైవేటు హోమియోపతి కళాశాలలు మాత్రమే ఉండగా, చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం ముత్తిరేవుల గ్రామంలో శ్రీనివాస ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా హోమియోపతి కళాశాల ఏర్పాటుకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు. వెంకటేశ్వర హోమియో వైద్య కళాశాల, హాస్పిటల్ పేరుతో కొత్త ప్రైవేట్ కళాశాలలో ప్రతి సంవత్సరం 100 మంది విద్యార్థులను చేర్చుకుంటారు. సొసైటీలో ఇప్పటికే 50 పడకల ఆసుపత్రి ఉంది.

వక్ఫ్ చట్టంపై సుప్రీంకు వెళ్తారా?

చంద్రబాబుకు పేర్ని నాని సవాల్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశ లౌకిక వ్యవస్థకు భంగం కలిగిస్తూ... రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో రిట్ 19575/2025 దాఖలు చేయడం ద్వారా వైఎస్ఆర్‌సీపీ న్యాయపోరాటం సాగిస్తుందని, అదే వక్ఫ్ చట్టానికి చంద్రబాబు వ్యతిరేకమైతే సుప్రీంను ఆశ్రయిస్తారా అని మాజీమంత్రి పేర్ని వెంకట్రామయ్య సవాల్ విసిరారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మైనార్టీల హక్కుల విషయంలో చంద్రబాబు డబుల్ గేమ్ ఆడుతున్నారని మండిపడ్డారు. ముస్లిం మత ధర్మాల పట్ల చంద్రబాబుకు గౌరవం ఉంటే వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టుకు వెళ్లాలని హితవు పలికారు. ఈ చట్టాన్ని ఏపీలో అమలు చేయనని చంద్రబాబు ప్రకటించగలరా అని నిలదీశారు. కేంద్రంలో ఈ చట్టాన్ని సమర్థించడం ద్వారా చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్...ముస్లింల మనోభావాలను గాయపరిచారని, మైనార్టీలకు వెన్నుపోటు పొడిచారని ధ్వజమెత్తారు.

రాష్ట్రాన్ని ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్‌ను ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర రోడ్లుచ భవనాలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గతంలో వెనుకంజ వేసిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు సైతం పెట్టుబడులు పెట్టేందుకు తరలి వస్తున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మంగళవారం ఆర్అండ్‌బీ మంత్రి కార్యాలయంలో అనేక మంది పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని కలిసి రాష్ట్రంలో ఏవియేషన్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు తమ ఆసక్తిని తెలియజేశారు. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు అన్ని విధాలుగా ప్రభుత్వం సహకారం అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. ఆసక్తి ఉన్న ఔత్సాహిక పెట్టుబడుదారులు, పారిశ్రామిక వేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పూర్తిస్థాయి ప్రతిపాదనలతో ముందుకు రావాలని కోరారు. ఈవిటోల్స్ అండ్ డ్రోన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ రంగంలో మొత్తంగా రూ.1,500 కోట్లకుగాను తొలి దశలో రూ.350 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు మాగ్నం వింగ్స్ సీఈవో అభిరామ్ చావా తెలిపారు. అరిస్టాటిల్ ఏవియేషన్ అకాడమీ డైరెక్టర్ కెప్టెన్ శిరీష్... ఎయిర్ క్రాఫ్ట్ సిమ్యూలేటింగ్ ట్రైనింగ్ యూనిట్ రంగంలో రూ.600 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరిచారు. ఈ ఫ్లెయిన్ కంపెనీ డైరెక్టర్ కెప్టెన్ దివ్య... ఈవిటోల్స్ అండ్ ఎయిర్ టాక్సీ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ రంగంలో మొత్తంగా రూ.1,200 కోట్లకుగాను తొలి దశలో రూ.270 కోట్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరిచారు. అలాగే భారత్ ఏవియేషన్ డైరెక్టర్ జోసఫ్ పొన్నుస్వామి దాస్... ఏవియేషన్ రంగంలో మెయింటెనెన్స్–రిపేర్స్ అండ్ ఓవర్ హాల్స్ సెంటర్ స్థాపన కోసం ముందుకు రానున్నట్లు తెలిపారు.

నాటక రంగంలో 110 మందికి కందుకూరి పురస్కారాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏప్రిల్ 16న రచయిత, సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతిని పురస్కరించుకొని నిర్వహించుకునే తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ముగ్గురికి కందుకూరి ప్రతిష్ఠాత్మక రంగస్థల పురస్కారం, 26 జిల్లాలకు గాను జిల్లా స్థాయిలో 107 మంది ప్రతిభ గల నాటక రంగ కళాకారులు, సాంకేతిక నిపుణులకు కందుకూరి విశిష్ఠ పురస్కారాలను అందిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నాటక, సినీ రచయిత డా.బుర్రా సాయి మాధవ్ చైర్మన్‌గా 11 మంది నాటక రంగ ప్రముఖులతో నియమించిన ఎంపిక కమిటీ పురస్కార గ్రహీతలను పారదర్శకంగా ఎంపిక చేసిందన్నారు. నాటక రంగంలో కృషి చేసిన వారికి రాష్ట్ర స్థాయిలో కందుకూరి ప్రతిష్ఠాత్మక రంగస్థల పురస్కారంతో పాటు లక్ష రూపాయల నగదు, జిల్లా స్థాయిలో ఎంపికయిన వారికి కందుకూరి విశిష్ఠ పురస్కారంతో పాటు రూ.10 వేల నగదును ఏప్రిల్ 16న సాయంత్రం 6 గంటలకు విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో అందించనున్నామని తెలిపారు. కళాకారులు, నాటక రంగ ప్రముఖులు, సాంకేతిక నిపుణులు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరుకావాలని మంత్రి కోరారు.

వామపక్ష ఐక్యతను చాటేలా

'పోలీస్ వారి హెచ్చరిక' ఆడియో లాంచ్

హైదరాబాద్: వామపక్ష ఐక్యతను చాటేలా 'పోలస్ వారి హెచ్చరిక' ఆడియో లాంచ్ జరిగింది. తూలికా తనిష్క్ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత బెల్లి జనార్ధన్, అభ్యుదయ దర్శకుడు బాబ్జీ రూపొందించిన ఈ చిత్రం ఆడియో లాంచ్ హైదరాబాద్‌లో నిర్వహించారు. సినీ ప్రముఖులు తనికెళ్ల భరణి, తుమ్మారెడ్డి భరద్వాజ్, జయసుధ, ఆర్ నారాయణ మూర్తితో పాటు సీపీఐ తెలంగాణ కార్యదర్శి, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హాజరయ్యారు. అతిథులు మాట్లాడుతూ గొప్ప సామాజిక లక్ష్యంతో ప్రజా నాట్య మండలి నాయకుడు బాబ్జీ రూపొందించిన ఈ సినిమాను ఆదరించాలని కోరారు. పోలీస్ వారి హెచ్చరిక విజయంతో రాబోయే రోజుల్లో మరిన్ని మంచి చిత్రాలు తెరకెక్కుతాయన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి చిత్రాలు మరిన్ని రావడానికి తెలుగు రాష్ట్రాలకు చెందిన వామపక్ష నాయకులు, ప్రజా సంఘాల సభ్యులు, అభిమానులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వామపక్ష ఐక్యతను చాటేలా ఈ సినిమా ఆడియో లాంచ్ జరగడం హర్షణీయమన్నారు. బాబ్జీతో ఉన్న సాన్నిహిత్యంతోనే ఆడియో ఫంక్షన్‌కు వచ్చానని తనికెళ్ల భరణి చెప్పారు. తాను గతంలో బాబ్జీతో పనిచేసినట్లు గుర్తుచేసుకున్న ఆయన... ఔట్‌డోర్‌లో ఉన్నందున ఈ చిత్రంలో పని చేయలేపోయానన్నారు. సినిమా కంటెంట్ ఎంతో నచ్చిందని, ఈ చిత్రాన్ని ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారని భరణి అన్నారు. సమజంలో జరిగే చెడును ప్రశ్నించే సినిమాలు రావాలని, 'పోలీస్ వారి హెచ్చరిక' అలాంటిదే అని తమ్మారెడ్డి భరద్వాజ్ అన్నారు. గతంలో ఎన్టీఆర్, కృష్ణ, మోహన్ బాబు వంటి అగ్రస్థాన నటులు ఎర్రజెండా పట్టుకొని కమ్యూనిస్టు నేపథ్య సందేశాత్మక చిత్రాలు తీశారని, వాటిని ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారని గుర్తుచేశారు. అలాంటి ఆశయాలతో తెరకెక్కిన ఈ చిత్రాన్ని కూడా అలానే ఆదరిస్తారని ఆకాంక్షిస్తున్నట్లు భరద్వాజ్ తెలిపారు. బాబ్జీ అద్భుత డైరెక్టర్ అని జయసుధ ప్రశంసించారు. ఆయన సినీ పరిశ్రమలోకి వచ్చినప్పటి నుంచి తనకు పరిచయం ఉందని చెప్పారు. 'పోలీస్ వారి హెచ్చరిక' కంటెంట్, పాటలు బాగున్నాయని, ప్రేక్షకులకు నచ్చుతాయని జయసుధ అన్నారు. ఆర్ నారాయణ మూర్తి మాట్లాడుతూ 'ప్రజా నాట్యమండలి నుంచి వచ్చిన బాబ్జీ తీసిన ఈ సినిమా గురించి విన్నప్పుడు ఇది సమాజానికి ఉపయోగపడే అద్భుత సినిమా అని అర్థమైంది. ఇలాంటి సినిమాలు ఎన్నో రావాలి. ఈ సందేశాత్మక చిత్రం ఘన విజయం సాధించాలి. తన బిడ్డతో కలిసి బాబ్జీ మంచి సినిమా తీశారు. ఆయన నుంచి మరిన్ని సందేశాత్మక చిత్రాలు రావాలని కోరుకుంటున్నా' అని అన్నారు. నటుడు అజయ్ ఘోష్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ద్వారానే తనకు గుర్తింపు వచ్చిందని, కమ్యూనిస్టు భావజాలాన్ని తన కుటుంబం ఆదరిస్తుందని చెప్పారు. ఈ సినిమా చేయడం ఆనందంగా ఉందని, గొప్ప పాత్ర పోషించానన్నారు. ఈ చిత్రం ద్వారా సక్సెస్‌ఫుల్ డైరెక్టర్‌గా బాబ్జీ తనదైన గుర్తింపు పొందుతారని ఘోష్ ఆకాంక్షించారు. డైరెక్టర్ బాబ్జీ, నిర్మాత బెల్లి జనార్ధన్‌ని అతిథులు అభినందించారు.

కొత్త విధానంతో మైనింగ్ రంగానికి ఊతం

గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు నేతృత్వంలో మంగళవారం జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఖనిజ రంగాన్ని పునరుజ్జీవింపజేయడమే లక్ష్యంగా లఘు ఖనిజాలపై రూపొందించిన "ఏపీ మైనర్ మినరల్స్ పాలసీ 2025" ను ఆమోదించడం జరిగిందని గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తెలిపారు. రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తిలో (జీడీపీ) ఒకప్పుడు 3.53 శాతం ఉన్న మైనింగ్ రంగం 2023–24 నాటికి 2.71 శాతానికి పడిపోవడంతో, ఈ రంగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం గుర్తించింది. 2022లో వచ్చిన విధానంలో ప్రభుత్వ భూములపై లీజుల కోసం దరఖాస్తుల ప్రతిపాదన రద్దు చేయడంతో 6వేలకుపైగా దరఖాస్తులు అనర్హమయ్యాయి. కొత్త విధానంలో మార్చి 2022 నాటికి పెండింగ్‌లో ఉన్న ఈ దరఖాస్తులను 'ఫస్ట్ కమ్ - ఫస్ట్ సర్వ్' ఆధారంగా పరిష్కరించాలని కేబినెట్ నిర్ణయించింది. ఇవి ఏడాది మాత్రమే అర్హత కలిగి ఉంటాయని ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఇంటి నిర్మాణం, నీటి ప్రాజెక్టులు, రహదారి అభివృద్ధి కోసం అవసరమైన గ్రానైట్, రోడ్ మెటల్ వంటి బిల్డింగ్ మెటీరియల్స్‌కు దరఖాస్తు విధానం కొనసాగుతుంది. సిలికా శాండ్, డోలోమైట్ వంటి ఇండస్ట్రియల్ ఖనిజాలకు ఉత్పత్తితో అనుసంధానించిన ప్రీమియంతో వేలం విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. పట్టా, డీకేటీ, అటవీ భూములపై దరఖాస్తుల ద్వారా లీజుల మంజూరు కొనసాగుతుంది. లీజు మంజూరుకు సంబంధించిన ప్రీమియంను డెడ్ రెంట్‌పై 10 రెట్లు నుంచి 5 రెట్లకు తగ్గించారు. ఈ మొత్తాన్ని 2–3 ఏళ్లలో రెండు సులభ వాయిదాలుగా చెల్లించవచ్చు. నూతన పాలసీలో కొత్తగా మంజూరు అయ్యే గ్రానైట్, ఇండస్ట్రియల్ మినరల్స్ లీజులు 20 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాలకు, రోడ్ మెటల్ (క్యాప్టివ్ క్రషింగ్ యూనిట్ల కోసం) లీజులు 15 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాలకు, మిగిలిన ఖనిజాల కోసం 5 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాలకు పెంచారు. గతంలో 10 రెట్లు డెడ్ రెంట్ చెల్లించి లభించిన లీజులకు కూడా ఈ కొత్త గడువులు వర్తింపజేయనున్నారు. 2021లో కోవిడ్ ఖర్చుల నిమిత్తం విధించిన 'కన్సిడరేషన్ అమౌంట్'ను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రవీణ్ కుమార్ తెలిపారు. గత సంవత్సరాల్లో పెండింగ్‌లో ఉన్న లీజు వివాదాలు, పద్ధతులు పరిష్కరించేందుకు ఒక సంవత్సరం పాటు ఒకసారి మాత్రమే లభించే ఓటీఎస్ పథకాన్ని ప్రవేశపెట్టారు. జరిమానాలను 10 రెట్ల నుంచి 2 రెట్లు, 5 రెట్ల నుంచి 1 రెట్టుకు తగ్గించారు. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వానికి రావలసిన రాబడులు సమర్థవంతంగా వసూలు అవుతాయి. ముందస్తు క్లియరెన్స్ కోసం ఖనిజ, రెవిన్యూ, అటవీ, పర్యావరణ, కాలుష్య నియంత్రణ వంటి శాఖలతో కూడిన అంతర్గత శాఖల కమిటీ ఏర్పాటు చేస్తారు. కుటుంబ సభ్యులకు లీజు బదిలీపై ఫీజును మాఫీ చేస్తారు. గత పాలనలో చిన్న మైనర్లకు తలుపులు మూసివేయగా, ఇప్పుడు వారి కోణంలో చక్కటి విధానం తీసుకొచ్చామని ప్రవీణ్ కుమార్ చెప్పారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ విధానంకు శ్రీకారం చుట్టామని, ఏపీ మైనర్ మినరల్స్ పాలసీ 2025 అనేది లీజుదారుల కేంద్రంగా, పారదర్శకంగా, ప్రగతిశీలంగా రూపొందించబడిందని పేర్కొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.